# మూసీ

# MUSI


• Samputi : 27 • Sanchika : 03 • Pages : 64 • Rs. 20
• January 2024

UGC Care List
Approved Journal

- అయోధ్య 'రామాలయం' - అరుదైన చరిత్ర
- రైతు కథలు - భాషా విశేషాలు
- ఆచార్య భూమయ్య గారి 'భౌమమార్గ విమర్శ'
- భావితరాలకు సాహితీ మార్గదర్శి 'గురుజాడ'
- పౌరాణిక ప్రవచన భీష్మాచార్యుడు - మల్లాది చంద్రశేఖర శాస్త్రి
- మానవతకు సంకేతం మార్గళీవ్రతం
- స్వాతంత్ర్యోద్యమంలో తెలంగాణ గీతాలు
- మహాభారతం : 'ధర్మ' ప్రశ్నలు - 'భీష్మ' సమాధానాలు




Scanned with OKEN Scanner



వ్యవస్థాపకులు
**శ్రీ బి.ఎన్.శాస్త్రి**
సంపుటి : 27 సంచిక : 3
జనవరి - 2024
'శోభకృత్' మార్గశిర, పుష్య మాసాలు
**సంపాదకులు** (EDITOR)
సాగి కమలాకర శర్మ
SAGI KAMALAKARA SHARMA
**సహ సంపాదకులు** (ASSOCIATE EDITOR)
డా. దత్తయ్య అట్టెం
Dr. DATTAIAH ATTEM
Printed and Published by
**B. MANOHARI**
*Type Setting at :*
**Kavyasree Graphics**
Ph: 934 797 1177
Printed at : Sri Sai Process
Ph. 27563075
**విడిప్రతి : 20/-**
**సంవత్సర చందా : 200/-**
**శాశ్వత సభ్యత్వం : 2500/-**
(పది సంవత్సరాలు మాత్రమే)
చెక్కులు, డి.డి.లు **'మూసీ తెలుగు మాసపత్రిక' (MUSI Telugu Monthly Magazine)** పేరుపై మాత్రమే పంపాలి.
వివరాలకు : మేనేజర్, మూసీ మాసపత్రిక,
2-2-1109/బికె - ఎల్ఐజి-10,
బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట,
హైదరాబాద్ - 500 013
ఫోన్ : 934 797 1177
email : editormusi@gmail.com992
INTERNATIONAL STANDARD SERIAL NUMBER
ISSN 2457-0796
UGC APPROVED JOURNAL



# మూసీ

సాహిత్య సాంస్కృతిక చారిత్రక

చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక

## ఈ సంచికలో ...

### వ్యాసాలు


| | |
|---|---|
| అయోధ్య 'రామాలయం' - అరుదైన చరిత్ర ... డా. భిన్నూరి మనోహరి | 7 |
| విశ్వనాథ నవలలు - సంప్రదాయ దృక్పథం ... డా. జె. భారతి | 11 |
| నన్నె జీవులు (బందారం కథలు -24) ... డా. నందిని సిధారెడ్డి | 15 |
| పద్యమనోహరం- 48 ... గన్నవరం గిరిజామనోహర్ బాబు | 20 |
| రైతు కథలు - భాషా విశేషాలు ... డా. గంజి సుకన్య | 21 |
| ఆచార్య భూమయ్య గారి 'భౌమమార్గ విమర్శ' ... అరుణ ధూళిపాళ | 25 |
| భావి తరాలకు సాహితీ మార్గదర్శి 'గురజాడ' ... ఆచార్య ఎం. గోనానాయక్ | 29 |
| పౌరాణిక ప్రవచన భీష్మాచార్యుడు - మల్లాది చంద్రశేఖర శాస్త్రి ... ఎ. మారుతి | 33 |
| షితాబుఖాను అను సీతాపతిరాజు (గ్రంథాంతరంగం-30) ... ఘట్టమరాజు | 35 |
| మానవతకు సంకేతం మార్గశీర్షవ్రతం ... ఆచార్య శ్రీవత్స | 38 |
| స్వాతంత్ర్యోద్యమంలో తెలంగాణ గీతాలు ... డా. ఘనపురం సుదర్శన్ | 43 |
| దొరకునా ఇటువంటి సేవ ... వేముల ప్రభాకర్ | 46 |
| మహాభారతం : 'ధర్మ' ప్రశ్నలు - 'భీష్మ' సమాధానాలు ... డా. అట్టెం దత్తయ్య | 47 |
| ముకుంద కవితావీక్షణం ... ఆచార్య బూదాటి వేంకటేశ్వర్లు | 51 |


9993

### కవితలు


| | |
|---|---|
| భారత వీర పుత్రుడా! ... అవధాని భానుప్రకాశాచార్య | 5 |
| తుకారాం అభంగం ... డా. మంత్రి శ్రీనివాస్ | 6 |
| 'పాటూరి' సుందరామ్మూర్తి ... డా. తిరునగరి శరత్‌చంద్ర | 14 |
| జీవన సంక్రాంతులు ... వి.ఎస్.ఆర్.ఎస్. సోమయాజులు | 56 |
| కోచింగ్ పిల్లలు ... డా. ఎన్. గోపి | 62 |


### సమీక్షలు


| | |
|---|---|
| వైభవంగా బి.ఎన్.శాస్త్రి పురస్కార ప్రదానం ... డా. మంత్రి శ్రీనివాస్ | 57 |
| ప్రణయం నుండి ప్రణవం దాకా ... డా. గంద్ర లక్ష్మణ రావు | 59 |
| స్వీకృతి ... | 61 |


**ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.**

*Printed, Published and Owned by* : **B. MANOHARI,** 2-2-1109/BK-LIG-10, Bathukamma Kunta, Bagh Amberpet, Hyderbad - 500 013. Telangana.
*Office :* 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13.
*Printed at* Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
*Editor :* **Dr. Sagi Kamalakara Sharma. RNI No. 37723/80**

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 3  UGC Care List Approved Journal
హైదరాబాద్ జనవరి : 2024

## సంపాదకీయం







వ్యక్తి శక్తి కావాలి

మనిషి మనీషి కావాలి

మానవుడు
మహనీయుడు కావాలి

ఉన్న స్థానం నుండి
ఉన్నత స్థానానికి చేరాలి

పరిమితుడు
అపరిమితుడు కావాలి


స్థాయి విస్తరించాలి


దైవత్వం మేల్కొనాలి

తనను తాను నిరంతరం
ఉద్ధరించుకోవాలి

అందరికీ ఆదర్శంగా
అమృతమూర్తిగా
మారాలి

**నీలో దీపం వెలిగించు**
**నీవే వెలుగై వ్యాపించు**





## పరీక్ష

జీవన విధానంలో ప్రతి విషయానికీ, వ్యక్తికీ ఎదగడమే లక్ష్యం. ముందుకు వెళ్ళడమే గమ్యం. స్థాయి పెంచుకోవడమే తత్త్వం. తామున్న స్థాయి నుండి ఉన్నత స్థాయికి చేరాలని అందరూ అనుకుంటూనే ఉంటారు. అందరికీ సాధ్యం కాక ఇబ్బంది పడుతూ తమకే అన్నీ సమస్యలని భావిస్తుంటారు. సాధ్యం అయిన వారు విజేతలవుతుంటారు. ఎదగాలంటే ఎవరికైనా పరీక్షలు ఎదుర్కోక తప్పదు. పరీక్షలలో ఉత్తీర్ణులైతే స్థాయి పెరుగుతుంది. ఉత్తీర్ణులు కాకపోతే స్థాయి పెరగదు. పై స్థాయిని ఆశిస్తున్న వారికి నిరంతరం బాధలు, ఊహలే మిగులుతాయి. అందుకే తమ శక్తిని, స్థాయిని ఎప్పటికప్పుడు పెంచుకుంటూ ఉండాల్సిన అవసరం ఉంది.

పరీక్షలు మనం నిత్య జీవితంలో ఎదుర్కుంటూనే ఉంటాం. అవి పరీక్షలు అనుకోము అంతే. తరగతి గదిలో సంవత్సరం పాటు చదివి పరీక్ష రాసి పాస్ అయితే తరువాతి తరగతిలోకి ప్రవేశం ఉంటుంది. జీవిత విధానంలో మనం నిర్వహించలేని ప్రతి అంశమూ మనకు పరీక్ష వంటిదే. ఆరోగ్య రక్షణలో, కుటుంబ జీవనంలో, సంతాన అనుకూలతలలో, ఉద్యోగ పరిరక్షణలో, సంపాదన అధికంగా చేయడంలో అన్నింటిలోనూ పరీక్షలు ఎదురవుతాయి. ఉన్న స్థాయిలోనే ఉండేవారికి ఎదురయ్యే పరీక్షలు తక్కువ. ఎదగాలనుకుంటే మాత్రమే పరీక్షలు తప్పవు. అది తరగతి గది అయినా జీవన మార్గంలో అయినా.

పరీక్షలు ఎదుర్కోవాలంటే శక్తి కావాలి. శారీరక శక్తితో కొన్ని పనులు మాత్రమే చేయగలం. మానసిక శక్తితో చాలా పనులు నిర్వహించే అవకాశం ఉంటుంది. తరగతి గదుల పరీక్షలు కాని, ఎంట్రన్స్‌లు కానీ, ఇంటర్వ్యూలు కాని ఎదుర్కోవడానికి కోచింగ్ సెంటర్‌లు, ఎకాడమీలు చాలా ఉంటాయి. అక్కడ విషయాన్ని చెప్పగలరు కాని నిర్వహించవలసింది మాత్రం వ్యక్తి మాత్రమే. ఆహారం, జలం, వాయువులు శారీరకమైన అవసరాలు తీర్చుతూ, శక్తిని పెంచడానికి సహకరిస్తాయి. వాటిలోని శక్తి మనశక్తిగా మారినపుడు మనం శక్తివంతులం అవుతాం. ఆ శక్తితో పరీక్షలను ఎదుర్కునే ప్రయత్నం చేస్తాం. నిత్య జీవితంలోనూ అనేక విషయాల్లో సమస్యలు మనకు ఎదురు అవుతూనే ఉంటాయి. సమస్యలు ఎదురైనప్పుడు మన మనస్సును సమస్యపై కాకుండా పరిష్కార మార్గంపై కేంద్రీకరిస్తే సమస్యలు అన్నీ తీరిపోతాయి. సమస్య మీదనే దృష్టి పెట్టినవాడు ఎప్పటికీ బయటకు రాలేక ఇబ్బంది పడుతూనే ఉంటాడు. ఎదుగుదల కోల్పోతాడు.

వ్యక్తి ఈ లోకానికి వచ్చిన తర్వాత తమకు ఒక స్థాయి నిర్ణయించబడి ఉంటుంది. ఆ స్థాయి నుండి ఉన్నత స్థాయికి ఎదగడానికి ప్రయత్నం మొదలు అవుతుంది. తమ మనస్సు అనేది కేంద్రీకరించే ప్రదేశాన్ని బట్టి మనస్సుకు శక్తి లభిస్తుంది. సెల్ ఫోన్‌కు ఛార్జింగ్ పెడితే దానిని పవర్‌తో అనుసంధానం చేస్తాం. అదేవిధంగా మన మనస్సును కూడా ఈ విశ్వంతో అనుసంధానం చేస్తూ ఉంటే అపరిమితమైన శక్తివంతులమవుతాం. శక్తి వస్తేనే పరీక్షలు ఎదురుకోవడం సాధ్యం అవుతుంది. ఎంత ఎక్కువ శక్తి వస్తే అంతకన్నా పెద్ద పరీక్షలు వస్తూనే ఉంటాయి. ఇవన్నీ ఇక పరీక్షలు లేని స్థాయికి మనల్ని తీసుకువెళ్ళడానికే.

మనస్సును శక్తి దగ్గర కేంద్రీకరించడం అలవాటు చేసుకున్నవారికి జీవితంలో పరీక్షలు అనేవి ఉండవు. సమస్యలు రావు. తమకు కావలసినవన్నీ ఎదురుగా ఉంటాయి. ఏదైనా తమ దగ్గర లేనప్పుడు సాధించాలి కానీ, కావలసినవి అన్నీ మన చుట్టూనే ఉన్నప్పుడు సాధించేది ఏమిటి? ఈ విషయంపై దృష్టి కేంద్రీకరించి జీవిత పరీక్షలలో ఉత్తీర్ణత పొంది పరమార్థాన్ని చేరుకోవాలి.

# భారత వీర పుత్రుడా!



గురువగు రామకృష్ణులకు కూర్మిని బంచిన శిష్యుడాతడే!
నరయగ కాళికాంబ వరమంతయు పొందిన పూర్ణుడాతడే!
వరమయి భారతమ్మునల వర్ధిల జేసిన యోగి యాతడై
ధర వెలుగొంద నిల్చెగద ధన్యుడు! భారత వీరపుత్రుడా!

బలమదె జీవితమ్ము! మన భారత జాతికి చేతనమ్మదే!
బలమిసుమంత తగ్గ ధర పావన జీవికి మృత్యువద్దియే!
నలుగురు శక్తివంతులిల నవ్యత దెత్తురు దివ్యమూర్తులై!
ఫలము వివేక శక్తియదే! బంగరు భారత వీర పుత్రుడా!

తలలను దించు గొర్రెలను ధాత్రి బలిత్తురు! గర్జ జేసెడున్
పులులను గాంచ పర్వులిడు పూర్ణపు సూత్రము దెల్పినాడు! మీ
తలలను వంచబోకుడని ధైర్యము నెంతయొ నింపినాడహో!
సలలిత దివ్యభావనల శక్తియె! భారత వీర పుత్రుడా!

ఉక్కు నరాలతోడ ప్రజ నొక్కటి జేసెడు కండరమ్ములే
జక్కగ నుక్కుతోడి సమశక్తుల నింపెడు దేహులౌనటల్
మిక్కిలి శక్తివంతమని మేనుల దీర్చెడు ప్రేరణమ్ముతో
చిక్కని యైకమత్యమును జెప్పెను ! భారత వీర పుత్రుడా!

భారత తత్త్వదీప్తినల పశ్చిమ దేశము నందు చాటె! నా
ధీర వివేక యోగి! పరదేశము నందున దివ్య దీప్తియౌ
భారత భావనమ్ముల నపారముగానిడి నిల్చినాడు! తా
వీర వరాన్వితమ్మగు వివేకియె! భారత వీరపుత్రుడా!




అవధాని భానుప్రకాశాచార్య
ఫోన్ : 96032 04507

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 3  UGC Care List Approved Journal
హైదరాబాద్ జనవరి : 2024

# మూసీ 'వ్యాస' రచయితలకు సూచనలు

మీ వ్యాసాన్ని వర్డ్ (యూనికోడ్), పేజిమేకర్ (అను.7)లో టైప్ చేసి editormusi@gmail.com కు మెయిల్ చేయగలరు.

**వ్యాససంగ్రహం – (Abstract) : (200 పదాలకు మించకుండా)**

1. వ్యాససంగ్రహం : 1) రెండు–మూడు వాక్యాల పరిచయం, 2) వ్యాసరచన ముఖ్యోద్దేశం, 3) పరిశోధన ఊహా ప్రణాళిక, 4) అనుసరించిన పరిశోధన పద్ధతులు, 5) ఆశించే ఫలితాలతో కూడిన ముగింపు
2. Keywords : (కనీసం 5 పదాలు) (ఉదా: భాష, సాహిత్యం, ప్రకియలు, శతకం, నీతులు, విశ్లేషణ, అనువాదం, కవిపేరు, పాత్రచిత్రణ.)

**పూర్తి పరిశోధనవ్యాసం (పేజిమేకర్ ఎ4 సైజ్ లో 4-5 పేజీలకు తగ్గకుండా)**

1. ఉపోద్ఘాతం : ఒకటి లేదా రెండు పేరాలలో పరిశోధన వ్యాస ముఖ్య ఉద్దేశాన్ని ఉపోద్ఘాతంగా పేర్కొనాలి. కవి/రచయిత పరిచయం, పరిశోధనాంశానికి సంబంధించిన పరిచయవాక్యాలను వ్రాయవచ్చును. పూర్వపరిశోధనలకు సంబంధించిన అంశాలను సంక్షిప్తంగా చర్చించవచ్చును.
2. విషయం : పరిశోధనవిలువలుండాలి. సొంతంగా రాసినదై ఉండాలి. యధాతథంగా పుస్తకాలు, ఇంటర్నెట్ నుండి గ్రహించకూడదు. కొన్ని విభాగాలుగా విభజించుకుని, ఆయా విభాగాలకు అనుగుణమైన ఉపశీర్షికలు (సైడ్ హెడ్డింగ్స్) పొందుపరచాలి. ఎంచుకున్న పరిశోధన సామగ్రి (పుస్తకాల) నుండి పద్యం, కవిత, గేయం, కీర్తన, కథ, నవల, నాటకభాగాలు మొదలైన ఉల్లేఖాలను (references) అనుకరణ చిహ్నాల (" ") తో తప్పక ఉటంకించాలి. ఈ ఉటంకింపుల ప్రక్కనే బ్రాకెట్లో తప్పకుండా వాటికి తగిన సూచికలను సంక్షిప్తాక్షరాలలో పొందుపరచాలి. (ఉదా. ఆం.మ. భార. ఆది, ఆశ్వా. 5ప. 235) పేర్కొన్న ప్రతి పద్యం, కవిత, గేయ, వచన భాగాలను చక్కగా, పరిశోధన ధ్యేయం దృష్ట్యా విశ్లేషించాలి.
3. ముగింపు : పరిశోధనలో వెలువడిన ఫలితాలను విశ్లేషణాత్మకంగా 'ముగింపు' అన్న శీర్షిక క్రింద పేర్కొనాలి. కవి ఆత్మీయత, శైలి, ఆకర్షణీయాంశాలు, వెలువడిన క్రొత్త విషయాలు, రచన సామాజిక ప్రయోజనం, భాషాసాహిత్యాలకు పరిపుష్టిని చేకూర్చే కావ్య, వ్యాకరణ, అలంకారాది అంశాలు, ప్రత్యేకతలు మొదలైనవి రెండు–మూడు పేరాలుగా ముగింపులో పేర్కొనవచ్చు.
5. ఉపయుక్తగ్రంథసూచి : ముగింపు తరువాత ఆధారగ్రంథాలన్నింటికీ ఉపయుక్తగ్రంథసూచిని తప్పక పొందుపరచాలి. (రచయితపేరు, ఇంటిపేరు. ప్రచురణ సంవత్సరం). గ్రంథం పేరు, ప్రచురణసంస్థ, ప్రచురణ స్థలం.) సంకలనగ్రంథాలకు సంపాదకుడి పేరు పేర్కొనాలి. పత్రికావ్యాసాలు, బ్లాగ్, వెబ్సైట్లకు పూర్తివివరాలు తెలపాలి. ఉదా :

1. కమలాకర శర్మ, సాగి. సంపా. **'కదంబం'** (తెలుగు సాహిత్య ప్రక్రియలు – రూపాలు). 2014. హైదరాబాద్ : మూసీ ప్రచురణలు.
2. రఘునాథ శర్మ, శలాక. **'భారత ధ్వని దర్శనము'**. 2000. అనంతపురం : ఆనందవల్లీ గ్రంథమాల.

(సూచనలు పాటించని / పరిశోధనవిలువలు లేని/ పుస్తకాలు, ఇంటర్నెట్ నుండి యధాతథంగా రాసే వ్యాసాలు తిరస్కరించబడతాయి)

# తుకారాం అభంగం

అసలు తెలుసుకోరా మనుజా
తెలిసి మసలుకోరా నరుడా
మరలు గొల్పు మాయ జగంబు
దాటుకుంటూ పోతే జయంబు

తొమ్మిది తొర్రలది శరీరం
యదల నిండ మిషల మలీనం
ఆరుగురు శత్రువులతో గూడి
జరుపుతున్నదసలు ప్రయాణం

భక్తి కలుగ శక్తి కలుగును
తత్త్వ మెరిగి లౌక్యమమరును
జ్ఞానగంగ ముక్తి తెలుపును
మునిగి నౌక దాటవేయుము

తుకా అసలు లోన వరలును
భ్రమలు వీడి అసలు ఎరిగెను
మరలు గొల్పు మాయను దాటి
విఠల బ్రహ్మ చెంత చేరెను




**అనువాదం :**

**డా॥ మంత్రి శ్రీనివాస్**

**ఫోన్ : 83283 33720**

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 3 (7) హైదరాబాద్ జనవరి : 2024

# అయోధ్య 'రామాలయం' – అరుదైన చరిత్ర

**డా. భిన్నూరి మనోహరి,** ఫోన్ : 934 797 1177

**సుందరే సుందరో రామ: సుందరే సుందరీ కథా**
**సుందరే సుందరీసీతా సుందరే సుందరం వనం ।**
**సుందరే సుందరం కావ్యం సుందరే సుందర: కపి:**
**సుందరే సుందరం మంత్రం సుందరే కిం న సుందరమ్॥**

సుందరమైన ఈ శ్లోకం వాల్మీకి రామాయణంలోని సుందర కాండలోనిది. రామాయణానికి సంబంధించి ఈ శ్లోకం చాలా సుందరమైనది. అందులోని కథా నాయకుడు రాముడు సుందరుడే, రామాయణ కథా సుందరమైనదే. రాముని ధర్మపత్ని సీతామాత సుందరమైనదే. రావణుడు ఆమెను ఎత్తుకుపోయి నివసింపచేసిన అశోకవనం సుందరమైందే. రామాయణ కావ్యం సుందరమైంది, సుందరకాండలో ప్రాముఖ్యం ఉన్న హనుమంతుడు సుందరమైనవాడే. రామనామంతో కూడిన తారకమంత్రం సుందరమైందే. రామునికి, రామాయణానికి సంబంధించినవి ఏవి సుందరం కావు? అన్నీ సుందరమైనవే. అటువంటి సుందరమైన రాముని జననం ఒక ప్రశాంతమైన నగరంలో జరిగింది.

రాముడు జన్మించిన అయోధ్య ఎంత బాగుంటుందో రామాయణంలోని బాలకాండలో వాల్మీకి వర్ణిస్తాడు.

**"కోసలో నామ ముదిత: స్ఫీతోజన పదోమహాన్**
**నివిష్ట: సరయూతీరే ప్రభూత ధనధాన్యవాన్"**
**"అయోధ్యా నామ నగరీ తత్రీసీల్లోక విశ్రుతా:**
**మనునా మానవేంద్రేణ యా పురీ నిర్మితా స్వయమ్"**

సరయూనదీ తీరంలో సుప్రసిద్ధమైన కోసల దేశముంది. ఆ దేశం ధనధాన్యాలతో, సంపదలతో విరాజిల్లుతుంది. అటువంటి దేశంలో ప్రజలు సుఖశాంతులతో సంతోషంగా ఉన్నారు. ఆ కోసల దేశంలో సరయూనది పరిసర ప్రాంతాల్లో అయోధ్య మహానగరం కలదు. ఆ నగరాన్ని మనువు అనే మహారాజు నిర్మించాడు. ఈ మనువు శ్రీరామచంద్రునికి ముందు 34వ తరం వాడు.

ఇంతటి ప్రసిద్ధి పొందిన అయోధ్యానగరం పన్నెండు యోజనాలు పొడవు, మూడు యోజనాల వెడల్పు ఉండట. (ఒక యోజనం 13 కి.మీ.అని అంచనా). ఇటువంటి సుందరమైన, మహానగరంలో ఇక్ష్వాకు వంశంలో దశరథ, కౌసల్యల ప్రథమ సంతానంగా జన్మించాడు రాముడు. భారతీయ ఇతిహాసాల్లో రామాయణ, భారత, భాగవతాలకు పవిత్ర స్థానం ఉంది. రామాయణం అంటే రాముని అయనం అంటే ప్రయాణం. రాముని ప్రయాణం లేదా రాముని నడవడి అని చెప్పుకోవచ్చు. భారతీయ జీవన విధానానికి మూలం



రామాయణమని చెప్పడంలో ఎటువంటి సందిగ్ధత అవసరం లేదు. అంతటి ఉన్నతమైన, ధర్మబద్ధమైన, తన ప్రజలందరి క్షేమం కోరుకున్న రాముడి మార్గమే రామాయణం. అదే భారత జాతి ధర్మ మార్గం.

ఆ రాముడికి సంబంధించిన జన్మస్థలం ఆయన జన్మించిన ప్రాంతంలోనే వందల సంవత్సరాలు వివాదాస్పదంగా కొన్ని లక్షలమంది బలిదానాలకు కారణమైంది. పలువురు దేశభక్తుల త్యాగాలకు కారణమైంది. ఆ జన్మస్థలమే రామజన్మభూమి ఉద్యమంగా రూపు దాల్చింది. ఆ జన్మస్థలమే పరమ పవిత్రమైన రాముని అడుగుజాడలకు నీడ లేకుండా చేయబడింది. ఆ జన్మస్థలమే ఇతర మతస్థులలో రాముని పట్ల ద్వేషభావాన్ని కలిగించింది. ఆ జన్మస్థలమే కొందరి బలమైంది, కొందరి బలహీనమైంది. అటువంటి ఆ రామజన్మభూమిలో కోట్లాది భారతీయుల ఆకాంక్షలకు రూపం వస్తూ 2024 జనవరి 22వ తేదీన రామ మందిరం, అందులో రామ్‌లాల, రామ పరివారం విగ్రహ ప్రతిష్ఠానలకు ముహూర్తం నిర్ణయించ బడింది.

దేశ, విదేశాలలో ఉన్న భారతీయులు, రామభక్తులు, హిందూ ధర్మం పట్ల గౌరవం ఉన్నవారందరూ ఎంతో ఉత్సుకతతో ఎదురు చూస్తున్న ఆ రామ మందిర ప్రతిష్ఠాపన కార్యక్రమానికి భక్తిపూర్వకంగా సమర్పిస్తున్న ఈ వ్యాసం అందరి కోసం.

శ్రీరాముడు జన్మించిన తరువాత ఎన్ని కష్టాలు అనుభవించాడో రామజన్మభూమిలో రామ మందిర నిర్మాణానికి జరిగిన ప్రయత్నాలు కూడా అంతకంటే కష్టమైనవిగా చెప్పవచ్చు. రాముడు అనుభవించిన కష్టాల కంటే మానవులం మన కష్టాలు ఎక్కువా అంటే ఎక్కువనే చెప్పాలి. ఆయన లోకాభిరాముడు. నిగ్రహం గలవాడు, ఎట్టి కష్టాన్నైనా అనుభవిస్తాడు. ఆయన స్ఫూర్తితోనే రామ మందిర నిర్మాణంలో వచ్చిన కష్టాలను అధిగమించడానికి 5 శతాబ్దాలు పట్టింది.



ఎవరి ప్రాంతంలో వారు నివసిస్తున్నప్పుడు, అక్కడ ఇల్లు కట్టుకోవడం అన్నది సహజం. ఒక మహాపురుషుడు ఒక ప్రాంతంలో జీవించాడంటే, ఆయన జ్ఞాపకార్థం ఒక స్మారక చిహ్నమో, మందిరమో కట్టడమన్నది జరుగుతుంటుంది. మరి ఎందుకు? రాముడు నడయాడిన నేలలో ఆయన మందిరం నిర్మించడానికి ఇన్ని వందల సంవత్సరాలు పట్టింది. ఆర్థికపరమైన ఇబ్బందులా? రాజకీయ పరమైన ఇబ్బందులా? దేశ స్థితిగతులు అందుకు అనుకూలంగా లేవా? మత పరమైన ఇబ్బందులా? ఇన్ని ప్రశ్నలు రామ మందిరం చుట్టే తిరుగుతున్నాయి. ఈ ప్రశ్నలన్నిటికి జవాబులు వెతికే ప్రయత్నం ఈ వ్యాసంలో చేద్దాం.

మనం సంకల్పం చెప్పుకునేటప్పుడు జంబూద్వీపే, భరత వర్షే, భరత ఖండే అని భారతదేశాన్ని జంబూద్వీపం, భరతవర్షం, భరతఖండం, ఆర్యావర్తం, హిందూదేశం, భారతదేశం అని అనేక పేర్లతో పిలుచుకుంటాం. అంతటి పవిత్రమైన మన భారతదేశం పైన, ఇక్కడి సంపదపైన విదేశీయులు చాలామంది కన్నువేసి సంపదలను దోచుకొని వారు సంపన్నులమవుదామని కలలు కన్నారు. కొంతమంది భౌతిక సంపద దోచుకొని తమ దేశం తీసుకుపోయి సంతుష్టులయ్యారు కూడా. కాని సనాతన భారతదేశం యొక్క ఆధ్యాత్మిక సంపదను, మానవీయ ఔన్నత్యాన్ని ఇప్పటివరకు ఇన్నివేల సంవత్సరాల్లో ఎవరూ కొల్లగొట్ట లేకపోయారు. ఈ దేశ సంస్కృతి నలుగురికి విద్య నేర్పింది, కడుపు నింపింది. మేధస్సును వికసింప జేసింది. అటువంటి దేశంపై దండయాత్రలు చేసి తమ అస్తిత్వం నిల్పుకోవడానికి వారి మత సంబంధమైన కట్టడాలు నిర్మించి, స్థానిక ప్రజలను ఇబ్బందులు పెట్టిన సంస్కృతి విదేశీయులది. అట్లా నిర్మించబడినదే బాబ్రీ మసీదు.

మొగలు చక్రవర్తుల్లో మొదటివాడైన బాబర్ ఆజ్ఞమేరకు అతని సేనాని అయిన మీర్‌బాకీ అయోధ్యలోని రామ్‌లాల గుడి రూపురేఖలు మార్చి మసీదును నిర్మించాడు. అదే బాబ్రీ మసీదుగా పిలువబడింది. క్రీ.శ. 1528లో రామజన్మభూమిలో ఉన్న రామమందిరం విధ్వంసం చేయబడి ఈ మసీదు నిర్మించబడింది. శిథిల మందిరం మీదనే ఇస్లాం మత చిహ్నాలైన గుమ్మటాలు పెట్టారు. దాన్ని ప్రార్థనా స్థలంగా భావించారు. అప్పుడు పెట్టబడిన ఆ ఇస్లాం మత గుమ్మటాలు తొలగించడానికి ఇన్ని సంవత్సరాల్లో సుమారు 75 ప్రయత్నాలు జరిగాయి. ప్రతీ ప్రయత్నంలో లక్షలాదిమంది మరణించారు. 1992లో విశ్వహిందూ పరిషత్, రాష్ట్రీయ స్వయంసేవక్‌సంఘ్, ఇంకా ఇతర హిందూ ధార్మిక సంస్థలు పెద్ద సంఖ్యలో కరసేవకు కార్యరూప మిచ్చి ఆ గుమ్మటాలను ధ్వంసం చేసినారు. అప్పటినుండి ఈ రామజన్మస్థలం, రామజన్మభూమి, బాబ్రీమసీదు వివాదం తీవ్రతరమైంది. కోర్టు పరిధిలోకి చేరింది.

ఇన్ని వందల సంవత్సరాలు అంటే 1528 నుండి బాబ్రీమసీదుకు సంబంధించిన గుమ్మటాల నిర్మాణం జరిగినప్పటినుండి హిందూ సమాజం ఆ పవిత్రస్థానం విముక్తికోసం నిరంతరం పోరాటం చేస్తూనే ఉన్నారు. వీధుల్లోకి వచ్చి నిరసనలు వ్యక్తం చేయడం, రామభజన చేయడం వంటి కార్యక్రమాలతో హిందువులలో విశ్వాసాన్ని, ధైర్యాన్ని నింపేవారు. 1885లో మొదటిసారి రామ్‌ఛబుత్ర ప్రాంతంలో రామమందిర నిర్మాణానికి కోరుతూ ఫైజాబాద్ కోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారు. దానికి వ్యతిరేకంగా మసీదు ముతవల్లి కేసు వేయడంతో ఆ రెండు కేసులు కొట్టివేయబడినాయి. అప్పటినుండి అనేక ప్రయత్నాలు జరిగినాయి. 1934లో హిందువులు ఈ ప్రాంతంలో మసీదు గుమ్మటాలకు కొంత విఘాతం కలిగించారు. ఆ సందర్భంలో అప్పటి ఆంగ్లేయ ప్రభుత్వం హిందువుల మీద జరిమాన విధించింది. మొత్తంగా 84వేల రూపాయలు జరిమానాల రూపంలో వచ్చాయి. వాటిని తిరిగి ఆ గుమ్మటాల మరమ్మత్తులకే వినియోగించారు. అయితే 1949 డిసెంబర్‌లో రాముడు, సీతాదేవి విగ్రహాల్ని ప్రతిష్టించారు. అప్పుడు ముస్లింలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేయడంతో ఫైజాబాద్ మెజిస్ట్రేట్ ఆ ప్రాంతాన్ని సీజ్ చేసి తాళం వేసింది. 1950లో గోపాల్‌దాస్ విశారద్, రామచంద్రదాస్ పరమహంసలు ఆ ప్రదేశాన్ని తెరిపించాలని, పూజాదికాలకు అనుమతివ్వాలని కోర్టులో కేసు దాఖలు చేసినారు. 1961లో సున్నీ వక్ఫ్‌బోర్డు బాబ్రీ మసీదు ఉన్న స్థలం ముస్లింలదని, హిందువు వేసిన మూడు పిటీషన్లు కొట్టివేయాలని కోర్టులో కేసు వేశారు. ఇరవై సంవత్సరాల వాదోపవాదాల తర్వాత హిందువులు ఆ స్థలంలో పూజలు జరుపవచ్చని ఫైజాబాద్ జిల్లా మెజిస్ట్రేట్ ఆదేశించారు.

1986 ఫిబ్రవరి 1న విశ్వహిందూ పరిషత్ ప్రేరణతో రెండు లక్షల 75 వేల రామశిలలకు దేశంలో, 47 దేశాలల్లో పూజలు జరిగినాయి. 1989 నవంబర్‌లో మందిరం శంకుస్థాపన జరిగింది. 1990 నవంబర్, 1992 అక్టోబర్, 1992 డిసెంబర్ 6న కరసేవలు జరిగాయి. ఈ మూడు కరసేవల్లో మూడు గుమ్మటాలను తొలగించడం జరిగింది.

1989లో రామజన్మభూమికి సంబంధించిన అన్ని కేసులు అలహాబాద్ న్యాయస్థానానికి బదిలీ చేయబడ్డాయి. 1992 కరసేవ సమయంలో రథయాత్ర నిర్వహించిన హిందూ నాయకులపై కేసులు నమోదు చేసారు. 2001లో అద్వానీ, మురళీ మనోహర్ జోషీలకు కోర్టు నుండి ఊరట లభించింది.

1993లో అప్పటి రాష్ట్రపతి డా. శంకర్ దయాళ్‌శర్మగారు 143వ అధికరణాన్ని అనుసరించి సుప్రీంకోర్టుకు ఒక ప్రశ్న పంపారు. అదేంటంటే **"అయోధ్యలో బాబరీ మసుదు ఉన్నచోట దాన్ని నిర్మించడానికి ముందు ఏదైనా హిదూ ధార్మిక భవనం లేదా హిందూ మందిరం గాని ఉండేదా? దాన్ని కూల్చివేసి మసీదు కట్టబడిందా?"** అని.

ఈ ప్రశ్నకు సమాధానానికై ఉన్నత న్యాయాలయం రాడార్ తరంగాలతో భూమిలోపల పొరలలో ఫోటోలు తీయించింది. భారతీయ పురాతత్త్వ విభాగం ద్వారా త్రవ్వకాలు జరిపించింది. ఈ రెండు మార్గాల ద్వారా చేసిన ప్రయత్నంలో క్రింద భూమి పొరలలో ఒక విశాలమైన హిందూ దేవాలయం ఉండేదన్న ఆధారాలు లభించాయి. ఈ సాక్ష్యాలను ఆధారం చేసుకొని అక్కడ నిర్మించబడిన మసీదు ఇస్లాం నియమాలకు విరుద్ధంగా కట్టబడింది, మూడు గుమ్మటాలు కూడా ఖాళీగా ఉన్న ప్రాంతంలో కాక ఒక హిందూ దేవాలయం, లేదా పూజాస్థలం మీద నిర్మించబడింది. కాబట్టి ఈ భూమి ఇస్లాం నియమాలకు విరుద్ధంగా ఉంది కనుక అక్కడ ప్రార్థనలు చేయకూడదు. ఒకవేళ బలవంతంగా సంపాదించిన భూమిలో ప్రార్థనలు చేస్తే అల్లా స్వీకరించదు. అయితే ఈ స్థలం రెండు మత విధానాలు అనుసరించేవారి మనోభావాలకు సంబంధించి కాబట్టి దాన్ని విభజించకూడదని అన్ని వర్గాలవారు కోరుకున్నారు. కాని ఉచ్ఛ న్యాయాలయం దాన్ని రెండు భాగాలు హిందువులకు, ఒక భాగం ముస్లింలకు కేటాయించాలని తమ నిర్ణయం ప్రకటించింది. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ 14 పిటీషన్లు నమోదయ్యాయి.

కాల క్రమంలో 2017లో అయోధ్య వివాదంపై వచ్చిన అన్ని పిటీషన్లపై సుప్రీంకోర్టు విచారణ ప్రారంభించింది. ఈసారి చాలా త్వరితంగా విచారణ జరిగింది. 2019 జనవరి 8న జస్టిస్ రంజన్ గొగొయ్ నేతృత్వంలో ఐదుగురు న్యాయమూర్తులు సభ్యులుగా ధర్మాసనం ఏర్పాటు చేయబడింది. మధ్యవర్తిత్వం ద్వారా ఈ సమస్యను పరిష్కరించుకోవాలని జస్టిస్ ఖలీఫుల్లా నేతృత్వంలో త్రిసభ్య కమిటీ మార్చిలో ఏర్పాటైంది. ఈ కమిటీ తుది నివేదికను జులైలో సుప్రీకోర్టుకు సమర్పించింది. ఆగస్టు 6 నుండి అక్టోబర్ 16 వరకు ప్రతిరోజు వాదోపవాదాలు కొనసాగాయి. నవంబర్ 9న సుప్రీంకోర్టు తుది తీర్పును ప్రకటించింది. దీని ప్రకారం వివాదాస్పదంగా ఉన్న 2.77 ఎకరాల భూమిని ప్రభుత్వంచే నియమించబడిన రామమందిర్ ట్రస్టుకు అప్పగించాలని, మసీదును కూల్చివేసినందుకు ప్రత్యామ్నాయంగా 5 ఎకరాల భూమిని ఉత్తరప్రదేశ్ వక్ఫ్‌బోర్డుకు



ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ తీర్పును పున: సమీక్షించాలని 18 పిటీషన్లు వచ్చాయి. సుప్రీంకోర్టు వాటినన్నిటిని కొట్టివేసింది.

ఈ చారిత్రాత్మకమైన తీర్పు వందల కోట్ల భారతీయుల శతాబ్దాల నిరీక్షణకు ఆశాజ్యోతి అయ్యింది. హిందూదేశం, హిందూ ధర్మం, హిందూ వాదం గెలవాలని ప్రతి హిందువు కోరుకున్నాడు. ఆ కోరికల నిరీక్షణ ఫలించింది. ఈ న్యాయ పోరాటంలో తన మేధాసంపత్తిని ఉపయోగించి న్యాయస్థానంలో సత్యాన్ని వాదించిన పలువురు న్యాయమూర్తులందరికి భారతదేశంలోని ప్రతి ధర్మానువర్తి కృతజ్ఞులై ఉంటారు.

ఇక ప్రస్తుత విషయానికి వస్తే రామమందిర నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీలు లక్షల్లో ఉంటే, ఈ వివాదంలో హిందూ ధర్మం నిలబడాలని చేసిన పోరాటంలో ఆర్థికపరమైన చేయూతనిచ్చిన పుల్లారెడ్డి వంటి వదాన్యులు దేశవ్యాప్తంగా వేల సంఖ్యలో ఉంటారు. వీరందరూ రాముని తమ ఆదర్శమూర్తిగా భావించి ఆ రాముని జన్మస్థలంలో ఆయనకు మందిర నిర్మాణంలో తమ వంతు సేవను అందించారు.







500వందల సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర, 134 సంవత్సరాల పోరాట పటిమ ఫలితంగా నేడు అయోధ్యలో రామ్‌లాల విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఎంతో వైభవంగా జరుగబోతుంది. శ్రీరాముడు వనవాసం చేసి సీతాసమేతంగా అయోధ్యకు తిరిగి వచ్చిన సందర్భంలో అయోధ్యవాసులందరు దీపాలు వెలిగించి స్వాగతం పలికారు. ఆ స్ఫూర్తితోనే జనవరి 22వ తేదీన భారతదేశంలోని ప్రతి ఇంట్లో రామమందిర ప్రతిష్ఠాపన సమయంలో దీపాలు వెలిగించి రామయ్యను ఆహ్వానించాలని ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీగారు విన్నవించారు. మన ఇంట్లో అప్పుడే పుట్టిన సంతానాన్ని ఏవిధంగా అయితే ఆనందోత్సాహాలతో ఆహ్వానిస్తామో రామప్రతిష్ఠ కార్యక్రమం కూడా అంతే ఉత్సాహంగా, భక్తి శ్రద్ధలతో జరుపుకుందాం.

రామమందిర ప్రతిష్ఠా కార్యక్రమానికి చేయూతగా పలువురు మత పెద్దలు, పీఠాధిపతులు, ధర్మాధికారులు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలను చైతన్యపరుస్తున్నారు. అయోధ్యనుండి రామాక్షతలు దేశంలోని ప్రతి ఇంటికి చేరవేయాలనే కోరికతో ఆ కార్యక్రమం జరుగుతుంది. శృంగేరి జగద్గురు పీఠం శ్రీ స్వామివారు భారతదేశంలోని పవిత్రమైన 16 నదీజలాలు, వాటి మృత్తికతో రామ పాదాలు ప్రతి గ్రామంలో సందర్శింపచేస్తూ కోటి గడపలలో పూజలందుకోవాలని సంకల్పం చేశారు. మహాత్ముల సంకల్పం వృథా కాదు కదా! భారతదేశ ఖ్యాతిని, ధర్మాచరణను విశ్వవ్యాప్తం చేస్తూ అత్యంత వైభవోపేతంగా రామ్‌లాల విగ్రహ ప్రతిష్ఠాపన, మందిర ప్రారంభం జరుగబోతుంది. ఆ స్వామిని ప్రసార మాధ్యమాల ద్వారా అందరం దర్శించుకుందాం.

ఈ రామ మందిర నిర్మాణ రూపకల్పన చాలా అద్భుతంగా ఉంది. మొత్తం 2.77 ఎకరాల విస్తీర్ణంలో మొదటి అంతస్థు నుండి గర్భగుడి శిఖరం వరకు మొత్తం 161 అడుగుల ఎత్తు ఉంటుంది. ఆలయం పొడవు 360 అడుగులు. వెడల్పు 235 అడుగులు. ప్రతి అంతస్థు 20 అడుగులతో మొదటి అంతస్తులో 160, రెండవ అంతస్థులో 74 స్థంభాలతో నిర్మాణ పనులు జరుగుతాయని, ప్రస్తుతం కొంతవరకు పని పూర్తి అయి రామ విగ్రహ ప్రతిష్ఠాపన జరుగుతుందని, పూర్తిస్థాయి మందిర నిర్మాణం డిసెంబర్ 2024 వరకు కొనసాగుతుందని శ్రీరామజన్మభూమి మందిర ట్రస్ట్ నిర్వాహకులు తెల్పుతున్నారు.

వందలాది సంవత్సరాల నిరీక్షణ, కోట్లాది ప్రజల ఆకాంక్షలకు ఆకార రూపమైన శ్రీరామ భవ్య మందిర ప్రారంభోత్సవంలో మనం భౌతికంగా పాల్గొనలేకపోయినా, మానసికంగా రామనామాన్ని జపిస్తూ ఆ దివ్యమంగళమూర్తి ప్రతిష్ఠాపనా కార్యక్రమంలో పాల్గొందాం. ఆ సీతా, లక్ష్మణ సమేత రామచంద్రమూర్తిని సేవిద్దాం.



ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 3  UGC Care List Approved Journal
హైదరాబాద్ జనవరి : 2024

# విశ్వనాథ నవలలు – నవ్య సంప్రదాయ దృక్పథం

డా. జె. భారతి, తెలుగుశాఖాధ్యక్షులు, వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హైదరాబాద్. ఫోన్ : 8919996936



ప్రపంచానికి భారతీయ సంస్కృతి ఏమి ఇచ్చిందో తెలుసుకోవాలంటే విశ్వనాథ రచనలు చదవాలని అంటారు ఆచార్య ముదిగొండ వీరభద్రయ్యగారు. విశ్వనాథ రచనలన్నీ, వ్యక్తి సమాజాల శ్రేయస్సు వైదిక సంప్రదాయానుసరణంలోనే ఉన్నదని, అదే భారతీయ సంస్కృతి అని ఎలుగెత్తి చాటుతున్నాయి. విశ్వనాథ రచించిన మహా కావ్యాలనుండి చిన్న కథలదాకా ప్రతి రచనా భారతీయ ఆత్మను ప్రకటిస్తుంది. అయితే, పాఠకుడు తన అవగాహనా సామర్థ్యం, సంస్కార నేపథ్యం మేరకు ఆ ఆత్మను పట్టుకోగలుగుతాడు. సంస్కృతిలోని ప్రాణ శక్తి ని ఆవాహన చేసుకుంటాడు. పక్షి ఎంత దూరం వెళ్లినా రాత్రికి తన గూటికి చేరటం సంప్రదాయమనీ, అదే జాతీయత అనీ చెప్పిన విశ్వనాథ, పరాయి సంస్కృతులవెంట పరుగులు పెడుతున్న భారతీయులకు ముఖ్యంగా తెలుగు వారికి ఆధునిక వస్తు రూపాల ద్వారా ఆ అవిచ్ఛిన్న సంస్కృతిని అంకస్థ పేటిగా అందించారు.

ఏ రచనలోనైనా వస్తు పరిశీలన చేసినపుడు రచయిత గ్రహించిన వస్తువు, ఆ వస్తునిర్వహణ అనే రెండు విషయాలను, వాటిలో ప్రతిఫలించిన రచయిత దృక్పథాన్ని గుర్తించాల్సి ఉంటుంది. విశ్వనాథ వారి దృక్పథాలన్నింటికీ మూలం లేక ప్రాతిపదిక భారతీయత. ఇంకా ప్రత్యేకంగా చెప్పాల్సివస్తే ఆయన సామాజిక దృక్పథం మానవీయత, సాహితీ దృక్పథం దేశీయత, అభివ్యక్తిదృక్పథం నవ్య సంప్రదాయం. **"సమకాలీన స్పందన చేరిన సంప్రదాయం నవ్యసంప్రదాయం"** అంటారు ఆచార్య కోవెల సుప్రసన్న. (విశ్వనాథ నవ్య సంప్రదాయం పుట X). విశ్వనాథ నవలలలో వస్తురూపంగా అభివ్యక్తమవుతున్న ఈ నవ్యసంప్రదాయ దృక్పథ విహంగ వీక్షణమే ఈ వ్యాస రచనా ఉద్దేశ్యం.

విశ్వనాథవారు తమ నవలలలోని వస్తువు గురించి మాట్లాడుతూ **"నేను వ్రాసిన సుమారు అరువది నవలలలో ఏ విషయాన్ని గూర్చి వ్రాయలేదు. పాశ్చాత్యుల యొక్క సైన్సు యొక్క చరిత్రలో విషయాలు ఉంటవి. వాళ్ళ ఫిలాసఫీ యొక్క విషయాలు ఉంటవి. వాళ్ళ సాహిత్యంలోని రహస్యాలు ఉంటవి. వృక్షశాస్త్రము, పశుశాస్త్రము, చివరకు 'మనీ మారకం' అవసరమైతే ఇది ఉంటుంది అది ఉండదు అని ఉండదు. ఇటు చూస్తే వేదాలు, ఉపనిషత్తులు, భాష్యాలు, తర్కాలు, వ్యాకరణాలు అటుచూస్తే పాశ్చాత్య విజ్ఞానములో నేను నిద్రాహారాలు లేకుండా సంపాదించిన విజ్ఞానమంతా నా నవలలలో, నా పుస్తకములలో ఉంటుంది"** అంటూ తన నవలలు వైవిధ్య వస్తుమయమని స్వయంగా ప్రస్తావించారు. కాబట్టి ఆయన రచించిన 57 నవలలలో 57 వస్తువులకే పరిశీలన పరిమితం చేసుకుంటే సముద్ర స్నానానికి వెళ్ళి, చెంబుతో నీళ్ళు పోసుకున్నట్లు ఉంటుంది. ఇక విశ్వనాథ వారి నవలలలో వస్తు నిర్వహణ గురించి ఆచార్య కోవెల సంపత్కుమారాచార్య వివరిస్తూ, "అంతరాత్మ నుంచి నందిగ్రామరాజ్యందాకా సాగిన నవలారచనా ప్రపంచంలో నవలారూపం ఎన్నెన్ని రకాలుగా మారిందో చెప్పడం సులభసాధ్యం కాదు. విశ్వనాథ చేతిలో నవల 'కావ్య లక్షణాలను 'ఏకవీర' మొదలైన వాటిల్లో, ఇతిహాస లక్షణాలను 'వేయిపడగలు'లో, పురాణ లక్షణాలను పురాణవైర గ్రంథమాల, కాశ్మీరదేశ, నేపాళదేశ నవలామాలికల్లో, ప్రతీకాత్మకతను 'పులుల సత్యాగ్రహం'లో, కథన వైలక్షణ్యాన్ని 'దమయంతీ స్వయంవరం'లో, హర్ష చరితాదుల్లోని ఆత్మకథా లక్షణాన్ని 'మ్రోయు తుమ్మెద'లో, అధిక్షేపకతను 'నందిగ్రామరాజ్యం'లో, మరో వైలక్షణ్యాన్ని 'ఆరునదులు'లో– ఇలా అప్పటిదాకా సాగిన నవలా రూపాన్ని చెదరగొట్టి, అనేకరూప సాధన చేసింది." అన్నారు. (విశ్వనాథ సాహిత్య వ్యక్తిత్వం పుట 19)

ఇక, దృక్పథం విషయానికి వస్తే విశ్వనాథ వారి నవలలు కొందరికి భారతీయ సంస్కృతి ప్రతిష్ఠాపితాలుగా కనిపిస్తే, కొందరికి మానవ మనస్తత్వ చిత్రణ ప్రధానంగా, మరికొందరికి సామ్యవాద ధోరణులు కలిగినవిగా, ఇంకొందరికి శాస్త్రీయ దృక్పథ ప్రధానంగా అనిపిస్తున్నాయి. అయితే ఇవన్నీ భారతీయ సాంస్కృతిక ధార్మిక జాతీయతా భావనల భూమికపైన పెరిగిన భిన్న రసాల వృక్షాలే అంటారు ఆచార్య జీవియస్. తన కాలంనాటి సాంస్కృతిక పునరుజ్జీవన చైతన్య ప్రభావంతో భారతీయ సంప్రదాయ ఔన్నత్యాన్ని, విలువలను సామాన్య పాఠకులకు తన రచనల ద్వారా అందించటమే విశ్వనాథవారి నవ్య సంప్రదాయ దృక్పథం.

వైవిధ్యం ప్రకృతి సహజ లక్షణం. ఆధునిక మానవుడు ఈ సహజత్వాన్ని నాశనం చేసి నాగరికత పేరుతో మూస ధోరణిని అనుసరిస్తున్నాడు. మూస ధోరణిని తన పరిమిత ఆలోచనగా కాకుండా జ్ఞానంగా భావిస్తున్నాడు. ఏ విషయంలో విభిన్నంగా ఉండాలి, దేనిని మూసగా అంగీకరించాలి అనే ప్రాథమిక అవగాహన నేటి సమాజానికి లోపించింది. భారతీయ సంప్రదాయం, వ్యవహారంలో సమానత్వాన్ని, ఆచార ఆహారాలలో విభేదాన్ని కలిగిఉంటుంది. కానీ ఆధునిక సమాజం ఆచార ఆహారాలలో సమానత్వాన్ని సాధించి, వ్యవహారంలో విభేదాన్ని ప్రదర్శిస్తోంది. ఆచార ఆహారాలు పరిసర ప్రకృతి మీద, అవసరాల మీద ఆధారపడి ఏర్పడతాయి కాబట్టి, విభేదం ఉండటం సహజం. మనుషులమధ్య ఉండే ప్రేమాభిమాన వ్యవహారం మీద ఆధారపడి ఏర్పడే సమానత్వం నిలుస్తుంది కానీ ఆచార ఆహారాల ద్వారా సాధించిన సమానత్వం నిలబడదు. వ్యవహారంలో సమానత మానవీయతను కలిగిఉంటే, ఆచారాదుల సమానతలో డాంబికత ఉంటుంది. డాంబికతను సాధించి, మానవీయతను కోల్పోయిన సమాజం ఎదుర్కొనే దుష్ఫలితాలు నేడు మనం చూస్తున్నాం. ఈ విషయాన్ని ముందుగానే ఊహించి, తన నవలలలో చిత్రించిన క్రాంతదర్శి విశ్వనాథ.

పాఠకులలో భిన్న ప్రకృతులు కలిగినవాళ్లు ఉంటారు. వారి వారి అభిరుచికి తగిన ఇతివృత్తాల ద్వారా భారతీయ సంస్కృతిని, అందులోని మానవతావిలువలను అందిస్తే, తాను ఆశించిన సాంస్కృతిక పునరుజ్జీవనం సాధ్యమవుతుంది. నవలలలో వైవిధ్య వస్తువు గ్రహించటంలో ఉద్దేశ్యం ఇదే. వస్తుగ్రహణలో ఎన్ని ప్రయోగాలు చేయవచ్చో ఎంత వైవిధ్యాన్ని ప్రదర్శించవచ్చో వాటన్నిటినీ తెలిసి, చేస్తున్నాననే స్పృహతో విశ్వనాథ చేసి చూపించారు.

విశ్వనాథ 57 నవలలు రచించారు. అందులో 32 చారిత్రకాలు, 25 సాంఘికాలు. వీరి సాంఘిక నవలలలో గ్రామీణ ప్రాంత సామాజిక, రాజకీయ, వ్యవస్థలను చిత్రించిన నవలలు – వేయి పడగలు, సముద్రపు దిబ్బ, దమయంతీ స్వయంవరం, శార్వరి నుండి శార్వరి దాకా, వీరవల్లడు, నందిగ్రామ రాజ్యం మొదలైనవి. మానవ సంబంధాల నేపథ్యంలో వచ్చినవి మా బాబు, జేబుదొంగలు, గంగూలీ ప్రేమ కథ, చెలియలి కట్ట, కుణాలుని శాపం, మొదలైనవి. సాంస్కృతిక వైశిష్ట్యాన్ని చిత్రించినవి – వేయి పడగలు, తెఱచిరాజు, హాహాహూహూ, ప్రోయుతుమ్మెద, స్వర్గానికి నిచ్చెనలు, నీల పెండ్లి మొదలైనవి. సామాజిక విశ్వాసాల నేపథ్యం కలిగినవి– పునర్జన్మ, బాణావతి, మొదలైనవి. ఆధునిక విద్యావ్యవస్థ, సామాజిక ధోరణులను ఎండగట్టినవి విష్ణుశర్మ ఇంగ్లీషు చదువు, పరీక్ష, ఆఋనదులు, అంతరాత్మ మొదలైనవి.

విశ్వనాథ తన నవలల ద్వారా సాంస్కృతిక యుద్ధం చేశారని ఆచార్య కోవెల సంపత్కుమార అంటారు. పాశ్చాత్యులు చేసిన భారతీయ చరిత్ర నిర్మాణం ఎంత అవాస్తవంగా రూపకల్పన చేయబడిందో, చారిత్రక నవలలద్వారా విశ్వనాథ నిరూపించిన క్రమంలో కోవెల మాటలు ఎంత సత్యమో మనకు అవగతమవుతుంది. భారతీయ చరిత్రను విదేశీ చరిత్రకారులు తొడిగిన కళ్ళజోడుతో చూడటానికి అలవాటు పడిన భారతీయ మేధావులకు విద్యావంతులకు విద్యార్థులకు అసలైన భారతదేశ చరిత్రను గురించిన అవగాహన కల్గించడానికి విశ్వనాథ చేసిన ప్రయత్నం పురాణవైర గ్రంథ మాల, కాశ్మీర రాజవంశ నవలలు, నేపాళ రాజవంశ నవలలుగా రూపుదిద్దుకుంది. వైదికధర్మ నాశనం కోసం ఆయా కాలాలలో జరిగిన తీవ్ర ప్రయత్నాలు, వాటిని అడ్డుకున్న కల్పిత, వాస్తవ చారిత్రక వ్యక్తులు, అవిచ్ఛిన్న భారతీయ సంస్కృతీ సంప్రదాయ వైశిష్ట్యం అనేవి ఈ నవలలలో నేపథ్యంగా కనబడుతుంటాయి. పురాణవైర గ్రంథమాలలోని 12 నవలల కథాకాలం మహాభారత యుద్ధంతర్వాత 100 ఏళ్లకు మొదలై, భారతదేశంపైకి మహమ్మదీయుల దండయాత్ర వరకు సుమారు 3000 ఏళ్ళకు విస్తరించింది. మహాభారత యుద్ధ కాల నిర్ణయాన్ని ఖగోళ శాస్త్ర జ్ఞానంతో ఎలా చేయవచ్చో చెప్పడం దగ్గరనుండీ యోగ, గణిత, వైద్యశాస్త్రాదులకు సంబంధించిన భారతదేశ ప్రాచీన జ్ఞానమెంతో ఈ నవలలలో వివరించబడింది. 1953–64 మధ్య కాలంలో రచించబడిన ఈ నవలలు కొత్తగా స్వాతంత్ర్యం పొందిన సమాజం తన ఔన్నత్యాన్ని స్మరించుకుని జాతీయాభిమానాన్ని పెంచుకునేందుకు ఉద్దేశించబడ్డాయి. యవనులు, హూణులు, మ్లేచ్ఛుల దాడులతో భారతదేశ సంస్కృతి విచ్ఛిన్నమయ్యే పరిస్థితి ఏర్పడటం, అంతిమంగా భారతీయ ధర్మమే గెలుస్తూ ఉండటం, చరిత్రలో కనబడే వాస్తవం. ఆ సత్యంవైపు మన దృష్టి మరల్చి, స్వధర్మంపట్ల కొందరిలో ఏర్పడుతున్న వైరాన్ని, వైమనస్య భావాన్ని తొలగించే ప్రయత్నం ఈ నవలలద్వారా జరిగింది.

పంచలక్షణాలు కలిగినవిగా చెప్పబడే పురాణాలు భారతీయులకు అనేక విషయాలలో ప్రమాణాలు. పంచలక్షణాలలో చరిత్ర ఒకటి. పురాణ ప్రామాణికతను అంగీకరించని పాశ్చాత్యులు, అందులోని చరిత్ర విషయాలనూ అంగీకరించలేదు. విశ్వనాథ తన పురాణవైర గ్రంథమాలలోని 12 నవలల రచనకు మన పురాణాలను, కాశ్మీర రాజవంశావళిలోని 6 నవలల రచనకు కల్హణుని రాజతరంగిణిని ఆధారంగా చేసుకోవటం జరిగింది. తాను రచించిన చారిత్రక నవలల గురించి మాట్లాడుతూ **"ఈ ఇరువదినాలుగు నవలలలో మన పురాణములలో ఆయా చరిత్రములలో ఉన్న అంశములు తారీకుల ప్రకారము కాలమును చూపించితిని. సందర్భములను వివరించితిని … … ఇన్ని నవలలలో చరిత్రాంశములను తీసివేయ, కథలన్నియు నేను కల్పించినవే. వందలాది విలక్షణమైన పాత్రలు నేను సృష్టించినవే. కథ, కథ చెప్పే సొగసు, శిల్పము – ఒక గొప్ప నవలకు కావల్సిన సామగ్రి అంతయు ప్రతి నవలలో సమకూర్చితిని.**

**ఒక నవలవలె మరొక నవల యుండదు. అనంతమైన కల్పనా వైవిధ్యమునకంతు లేదు."** అంటారు. చారిత్రక నవలలకు వారు పెట్టిన పేర్లు ఉదా : భగవంతునిమీద పగ, నాస్తిక ధూమము, పులిమ్రుగ్గు, దూత మేఘము, భ్రమరవాసిని, దిండుకింది పోకచెక్క మొదలైనవి నవలాంతర్గత ప్రధాన విషయాన్ని, విశ్వనాథవారి కాల్పనిక రచనా శైలిని ప్రకటిస్తుంటాయి.

విశ్వనాథ రచించిన 25 సాంఘిక నవలలలో ఏ ఒక్కదాని వస్తువు మరొక దానిని పోలి ఉండదు. ప్రతి వస్తువు అభివ్యక్తిలో సమగ్రత కారణంగా ఆ విషయం గురించి తెలుసుకోవటానికి ఇంకా ఏమైనా మిగిలి ఉంటుందా అని పాఠకుడిని ఆలోచింపచేస్తుంది. సాంఘిక నవలలన్నిటిలో పరిమాణం, అనేక విషయాల ప్రస్తావన, పాత్రల సంఖ్య, సాంస్కృతిక పునరుజ్జీవన చైతన్య పరంగా వేయిపడగలు విలక్షణమైంది. ఇందులో ప్రధాన వస్తువు భారతీయ సంస్కృతి.

తెలుగుదేశంలోని జనజీవితాన్ని ఒక బెత్తెడు ఎడంకూడా వదిలిపెట్టకుండా వేయిపడగలులో పట్టాను అంటారు విశ్వనాథ. నిజానికి వేయిపడగలు నవలలోని సుబ్బన్నపేట ఈ దేశానికంతటికీ లక్ష్యభూతమైన గ్రామంగా చెప్పబడింది. విశ్వనాథ తన రచనలద్వారా చేసిన సాంస్కృతికోద్యమం పరాకాష్ఠకు చేరింది వేయి పడగలలోనే. ఇందులో భారతదేశంలోని అనేక సామాజిక వ్యవస్థలు విచ్ఛిన్న మవడాన్ని, దానివలన ఏర్పడిన పరిణామాలని సమగ్రంగా చిత్రించారు. వాణిజ్య పంటలు పెరిగి, తిండిగింజల కొరత ఏర్పడటం, ఎరువుతెచ్చుకున్న ఆహారపు అలవాట్లు ఆరోగ్యానికి హానికరం కావటం, పసిరిక కథ ద్వారా ప్రకృతి సమతుల్యత కోల్పోతే కలిగే దుష్ఫలితాలు, వృషన్నిధి ద్వారా ఆధునిక మానవుడి చేతిలో హింసించబడిన ప్రకృతి చివరికి అతని వినాశానికి ఎలా కారక మైందో, గిరికపాత్రద్వారా నిజమైన కళ అంటే ఏమిటో దానివలన ఏం సాధించబడుతుందో అద్భుతంగా చర్చించారు. ఒక సువ్యవస్థ నుండి భారతదేశం ఎలా జారిపోయిందో చిత్రించిన నవల ఇది. సమాజంలో ఏ విషయంలోనైనా మార్పు వస్తుంటే అది మనిషిని ఉన్నత స్థితికి తీసుకువెళ్ళేది అయి ఉండాలిగానీ, భ్రష్టుపట్టించ కూడదనే విషయాన్ని పాఠకులు సరిగా అర్థం చేసుకుని ఉంటే నవలా రచనాకాలానికి మిగిలిన దాంపత్య వ్యవస్థ పరిరక్షించబడేది. నేడు అది కూడా పతనమవుతున్న దశను చూస్తున్నాం.

పాశ్చాత్య సిద్ధాంతాలను యథాతథంగా భారతీయ జీవితానికి సాహిత్యానికి వర్తింపచేయటాన్ని విశ్వనాథ వ్యతిరేకించారు. దీనిని అర్థం చేసుకోలేనివారు ఆయనని సంప్రదాయవాదిగా విమర్శించారు. అయితే "Tradition is not mere mechanical reproduction. It is creative transformation" అన్న సర్వేపల్లి మాటలని ఉటంకిస్తూ ఆచార్య కోవెల సంపత్కుమార **"సంప్రదాయమంటే కరడుగట్టిన మూర్ఖత్వంగా, హేతురహితమైన అంధవిశ్వాసంగా, ప్రగతి**





**నిరోధకంగా ప్రచారం చేయబడుతోంది"** అని ఆవేదన చెందారు.

విశ్వనాథ తన సంప్రదాయాన్ని సామ్యవాదం మతం కలిసినదిగా చెప్పుకున్నారు. **"భారతదేశము సర్వప్రపంచమునకు చేసెడు మహోపకారమేమనగా ఆధ్యాత్మిక ప్రవృత్తియు, స్త్రీ పురుష మధ్యగత నీతియు, దైవ భక్తియు కలిగిన కమ్యూనిజం స్థాపింపవలయును"** అంటారు. ఇది వారి నవ్య సంప్రదాయం. అంటే కమ్యూనిజం ఉండాలి కానీ అది విదేశీయం కాకూడదు. స్వదేశీయ విలువలు కలిగినదై ఉండాలి. నవలా వస్తువు నేపథ్యం సాంఘికమైనా, చారిత్రకమైనా ఈ నవ్య సంప్రదాయమే అంతర్లీనంగా నిర్వహించబడింది. దానిని గ్రహించలేక వారి సంప్రదాయాన్ని ప్రగతి నిరోధకంగా భావిస్తున్నారు. రచయిత ఉద్దేశ్యాన్ని పాఠకుడు ఎందుకు గ్రహించలేడో విశ్వనాథ బాణావతి నవలలో ఇలా చెప్తారు. **"ఈ రోజుల్లో ఎవరైనా పుస్తకం చదివితే తన భావాలు ఆ పుస్తకంలో ఉన్నాయా లేవా అనే దాని కోసం చదువుతాడు తప్ప వాడేమి వ్రాశాడని చదవడు. రచయిత వ్రాసిన భావాలు తనకు వ్యతిరేకంగా ఉంటే వాడిని తూర్పార బడతాడు"** అంటారు. ఈ స్థాయి నుండి తెలుగు పాఠకులు ఎదిగినప్పుడే విశ్వనాథ తెలుగు వాడి ఆస్తి అన్న శ్రీశ్రీ మాటల లోని సత్యం అర్థమవుతుంది. **'మంత్రంలో ఎక్కడో నిగూఢమైన అక్షరగత శక్తిని మేల్కొల్పడం కొద్దిమందికే చేతనవుతుంది'** అంటారు విశ్వనాథ. అలాగే భారతీయ సంస్కృతిలోని అంతర్గత సంప్రదాయ శక్తిని పాఠకునిలో ఉజ్జీవింప చేయడం విశ్వనాథకే చేతనైన శక్తి. విశ్వనాథ తెలుగు సాహితీ పిపాసువులకి దొరికిన ఒక కల్పవృక్షం. మనం చదవాలని, తెలుసు కోవాలని కోరుకునే అనేక విషయాలను వారి రచనలు అందిస్తాయి. అందుకోవాలనే కోరిక కలగటం ప్రధానం.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. విశ్వనాథ నవ్య సంప్రదాయం– యువభారతి ప్రచురణ
2. విశ్వనాథ సాహిత్య దర్శనం– ఆచార్య ముదిగొండ వీరభద్రయ్య





ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 3 14 హైదరాబాద్ జనవరి : 2024

# 'పాటూరి' సుందర రామ్మూర్తి



అతడు పాటల తోటమాలి
ఎన్ని వేల పదబంధాల సుమగంధాలను
తోటలో వెదజల్లాడో..
అడుగు పెట్టిన ప్రతీసారి
అది నందనవనిలా అలరిస్తుంది..

అతడు కమ్మని కవితల
నిండు జాబిల్లి
ఎన్నెన్ని అక్షరాల వెన్నెలవెలుగులను విరజిమ్మాడో
చూసిన ప్రతీసారి
పున్నమి కన్నులముందు నిలబడుతుంది.

అతని అక్షరాలతడికి
ఆకాశాలే విరబూస్తాయి.
నేలకు దిగి సాగిలపడి మొక్కుతాయి.
అతని మాటలజడికి
మందారగిరులే ఝురులై
అలలెత్తి ప్రవహిస్తాయి..

భువనానికి వేణువై వచ్చాడు
విశ్వరూపమెత్తి 'గీతో'పదేశం చేశాడు
'రాలిపోయే పువ్వులకు' కూడా
నవరాగాలొత్తి శాశ్వతంగా పరిమళాలు అద్దాడు.
'ఈ దుర్యోధన దుశ్శాసన దుర్వినీతలోకాన'
విక్రమించిన అక్రమాలను
విచ్చుకత్తిలాంటి తన కలంతో ఖండించాడు
గళంతో ప్రశ్నించాడు.

'ఓరుగల్లుకే పిల్లా' అంటూ
కుర్రకారును ఉర్రూతలూగించాడు
యవ్వనవన సుమదీపాలను
ఇంపుగా వెలిగించాడు.
'కోకెత్తుకుపోయిన కొండగాలిని'చూసి
దుమ్మెత్తిపోయే పాటెత్తుకున్నాడు.

'పిల్లనగ్రోవికి నిలువెల్లా ఉన్న గాయాలను'
తన గేయాలతో మాయం చేశాడు.

ప్రణయం, ప్రబోధం,విషాదం,అభ్యుదయం
ఆధ్యాత్మికం,జానపదం,తాత్త్వికం...
వస్తువేదైనా పటిష్టమైన భావమద్దుకుని
అది పాటై..వెలుగులతోటై..
తేనెలఊటై..నవకవులకు బాటై
సాగిపోతుంది...

క్షణాల్లో సంగీతపుబాణీలకు
సాహిత్యపుఓణీలు కట్టి
అందమైన తెలుగింటి పాటమ్మాయిని
తయారు చేయగల కవిబ్రహ్మ..

సన్నివేశం చెబితే చాలు
సెకన్లలో పాట మొదలవుతుంది
నిమిషాల్లో పాట పూర్తవుతుంది.


అతడు ఏడురంగుల దివ్వె
సూర్యచంద్రులను రెక్కలుగా
చేసుకుని ఎగిరే పాటలగువ్వ..
అతడు పాటేశ్వరుడు
అక్షర కోటీశ్వరుడు..
అతడు పాటలసింగిడి..కొంటెపదాల గారడి
వింతభావాలసడి..కవ్వింతరాగాలమడి
కొత్తమార్గాన తెలుగుసినిమాపాటకు
దిద్దినాడు ఒరవడి..
అందుకే నేనంటాను..
అతడు వేటూరి సుందరరామ్మూర్తి కాదు..
'పాటూరి'సుందరరామ్మూర్తి అని..
**( జనవరి 29 న వేటూరి జయంతి సందర్భంగా..)**

**డా. తిరునగరి శరత్ చంద్ర**
ఫోన్ : 630 987 3682

బందారం కథలు
24

# నన్నె జీవులు

**డా. నందిని సిధారెడ్డి,** ఫోన్ : 9440 381148


డా. నందిని సిధారెడ్డి

దుగోడ పడుతుంటే చెయ్యి గుంజినట్టయింది అంతయ్యకు. ఒక్క నిమిషం ఆగి చెయ్యి పైకి తీసుకోని మరో చెయ్యితో అటూ ఇటూ ఒత్తుకున్నాడు. **'ఎంతజేసినా ఎనుగుల పద్దట్టే ఉంటంది తన బతుకు. చేతికి రాదు. పేరుకు రాదు. దరిద్రం జన్మ'** అని విసుక్కున్నాడు. మళ్లా దుగోడ పట్టి జరిపాడు. గుండ్రటి చెక్కను నున్నగ సమ్రంం చేస్తున్నాడు. దుగోడ రంధ్రంలోంచి చెక్కపొట్టు లేసి మళ్లా ఆగిపోయింది. చెక్క మీదనుంచి దుగోడ పైకి తీసి పొట్టు బయటికి తీశాడు. ఇంకా పొట్టు మిగిలినట్టనిపిస్తే గట్టిగా ఊదాడు. సన్నటి పొట్టు ఎగిరొచ్చి కంట్లో పడింది. కన్ను మండింది. చెయ్యి గుంజుతుందని, అవస్థ పడుతుంటే కన్ను మంట కొత్తగ తోడయింది. కన్ను నులుముకున్నాడు. గరగరమంటూ పొట్టు తుకురు పొత్తుకుంటున్నది. ధోతి కొసతో మెల్లగా తుడుచుకున్నాడు. పైన వేపకొమ్మ మీద కాకి అరిచింది. గూటిలోంచి చిన్నపుల్ల జారిపడింది. ముందట పడిన పుల్లను చూడగానే తను పుల్ల కంటే చులకన అనిపించింది అంతయ్యకు. కన్నుమంట ఆగలేదు. తూర్పువైపు చూస్తే చేదబావి మీద సూరవ్వ నీళ్లు చేదుతూ కనిపించింది. దగ్గరికి వెళ్లి అడిగాడు. బొక్కెనలోంచి చారెడు నీళ్లు పోస్తే మెల్లగా కన్ను తెరచి నీళ్లు అద్దుకున్నాడు. రెండుసార్లు అద్దుకోగానే కన్ను కుదుట పడింది. ధోతి అంచుతో తుడుచుకున్నాడు. **"అవస్తయితుందా అంతన్నా"** అడిగింది సరవ్వ. **"తప్పుతదా.... కొద్దిగ తగ్గింది"** అనుకుంటూ కుడి చెయ్యి తడుముకున్నాడు. ఇటు కన్ను, అటు చెయ్యి రెండు గుంజుతున్నాయి. వచ్చి దుగోడ పట్టసాగాడు.

పొద్దు బారెడెక్కింది. చలికాలం ఎండ తగులుతుంటే హాయిగా ఉంది. అంతయ్య చెయ్యి కదులుతున్నా కొద్దీ మరింత గుంజుతున్నది. ఎదురుగా ఇంటి లోపలికి చూశాడు. అంతా వంటింట్లో కూడినట్టు ముచ్చట్లు వినబడ్డాయి. అంతయ్యకు 'చాయ' తాగాలనిపించింది. చాయ తాగితే చెయ్యి గుంజటం తగ్గుతుందనిపించింది. మామూలుగా అయితే చాయ మీదికి గుంజేది కాదు. ఆ వాడలో ఎవరికీ రోజూ టీ అలవాటు లేదు. ఒకటి రెండు కుటుంబాలకు తప్ప బందారంలో ఎవరికీ రోజూ టీ తాగే స్థోమత లేదు. చలికాలం గనుక వారం, పదిరోజులకొకసారి కొందరు చాయ చేసుకుంటుంటారు. చాయంటే పిల్లలకు సంబురం. కొద్దిసేపటిముందు అంతయ్య పని చేసుకుంటూ తలెత్తి చూసే సరికి తన కొడుకు రాములు పొట్లం పట్టుకొని వస్తున్నాడు. ఏం పొట్లమని కొడుకును అడిగాడు. **'శాపత్త' పొట్లం. అమ్మమ్మ కొనుక్కరమ్మన్నది'** అనుకుంటూ లోపలికి పోయాడు. అప్పటినుండి చాయ మీదికి మళ్ళింది మనసు. తోడుగా చెయ్యి గుంజుతుంది. మాటిమాటికి ఇంటిలోపటికి చూడ బుద్ధయితున్నది. పిలుపొస్తుందేమోనని ఆత్రం, రాదేమోనని అనుభవం. చాయ రాత కూడా నోచుకోనందుకు తనమీద తనకే విసుగు.

అంతయ్యకు పని చెయ్యటం కష్టంగా వుంది. లేచి ధోతి దులుపుకున్నాడు. వేపకొమ్మ వంచి పుల్ల విరిచాడు. నోట్లో వేసుకున్నాడు. నములుతూ, తోముతూ నడుమ నడుమ వంటింట్లోకి చూపు సారిస్తున్నాడు. తను తప్ప ఆ కుటుంబమంతా వంటింట్లో ఒకచోట చేరి చాయ తాగుతున్నట్టు అనిపిస్తున్నది. సందడి సందడిగా హుషారు వినిపిస్తున్నది. పెద్ద కుటుంబం. ఊరిలోనే పెద్ద వాటా. తన వాటాలో కొంత ఇతరులకు పని ఇస్తాడు. వడ్ల సిద్దయ్యంటే పేరెల్లిన పెద్ద మనిషి. కులానికే పెద్ద. ఊరి పెద్ద మనుషుల్లో ఒక పెద్ద. ఇద్దరు ముగ్గురు చేసినా దంగనంత వడ్ల పని. పెద్దమనిషి సిద్దయ్యకు కొడుకుల్లేరు. ఐదుగురు బిడ్డలే. నాయన ఒత్తిడి మీద ఇల్లరికమొచ్చాడు అంతయ్య. పెద్ద బిడ్డ నిచ్చి పెళ్లి చేసాడు సిద్దయ్య. పనితనం, మెతకదనం తప్ప మరొటి తెలియనివాడు అంతయ్య. పుట్టిన ఇల్లు, పుట్టిన ఊరు, పెరిగిన స్నేహితుల్ని విడిచిపెట్టి బందారం రావాలంటే ఏడుపొచ్చింది అంతయ్యకు. ఏమంటూ ఏడ్చుకుంటూ ఇల్లరికమొచ్చాడో ఏడుపే మిగిలింది అంతయ్యకు. సుఖపడ్తావని ఊబిలోకి తోశారు తల్లిదండ్రులు. సుఖం సంగతేమో గాని సుడి పడుతున్నా జాలి తల్చేటోళ్లు లేరు. పెద్దమనిషి కనబడని కత్తి. పెండ్లాం మొన దేరిన కత్తి. అత్త తేనె పపూసిన కత్తి. నలుగురు మరదళ్లు బట్టచుట్టిన కత్తులు. చుట్టూ కత్తుల నడుమ గాయపడి గాయపడి అలిసిపోయిన వ్యక్తి అంతయ్య.

చాయ తాగితే తప్ప పనిచెయ్యలేని పరిస్థితి అంతయ్యది. వాడకొకటే చేదబావి. చేదబావికి నాలుగు దిక్కుల చేదగిర్కలున్నాయి. తూర్పు గిర్క, దక్షిణం గిర్క పొద్దు తిరిగినట్టే తిరుగుతూనే ఉంటాయి. ఉత్తరం దిక్కు చేదబొక్కన ఖాళీగా ఉంది. అంతయ్య నీళ్లు చేదుకొని బొక్కెనతోనే మొఖం కడుక్కున్నాడు. దోతి అంచుతో మొఖం తుడుచుకున్నాడు. మళ్లీ

లోపలికి చూశాడు. పిలుపు వచ్చే అవకాశం కనబడలేదు. తనే వంటింట్లోకి నడిచాడు. ఉన్న ఎనిమిదిమంది హుషారుగా గ్లాసుల్లో చాయ తాగుతున్నారు. తనను ఎవరూ పలకరించలేదు. అడగలేదు. తనే అడుగుతామనుకున్నాడు. అడగలేకపోయాడు. విసురుగా వెనకకు వచ్చాడు. దాతి తనలాగే దిగాలుపడి చూస్తున్నది. పైన వేపచెట్టు, కొమ్మన కాకిగూడు, కింద దాతి, పక్కన బాడిస, దుగోడ అన్నీ జాలిగా చూస్తున్నట్టనిపించాయి.

'చాయ'!

'అందునా కోపెడు చాయ'

ఇంత చిన్న కోరికకు బరువైన బతుకు. ఎంత చాకిరి చేస్తాడు? పెద్ద బాడిస పని. నిలబడి చెక్కుతుంటే చేతులు పోతయి. కూసోని చెక్కుతుంటే కూసాలు కదులుతయి. ఇంత పెద్ద ఇల్లును సాదాలె. పెద్దాయన పెద్దమనిషి అయితె కావొచ్చు గని – తన రెక్కలతోనే గద. కుటుంబం తినేది, బతికేది. 'ఇల్లిటపల్లుడు ఇంటికి లోకువ' 'ఇంట్లందరికి చులకన'

చాయ! చాయ మనార్తెంత? చారెడు పోస్తెనే కర్సయితదా?

అంతయ్య చెక్క పొట్టంత దగ్గరికి జరిపాడు. దుగోడ పొట్టు సన్నటిది మంచిది ఏదిరాడు. దోతి అంచులు పోసి సింగులు మూట పట్టుకున్నాడు. రెండడుగులు నడిచాడు. ఇంటెనుక దర్వాజ దగ్గరికి చేరి పిలిచాడు.

"అక్కా, రట్నక్కా... నేను అంతయ్యను".

తలుపు తీసింది రత్నవ్వ. "ఇగో... చెక్కపొట్టు తెచ్చిన పొయ్యిలకు. మంచిగ మండుతది" అని మూట విడిచి కుప్ప పోశాడు.

"అంతన్నా, నేనడుగలేదు గద. గట్ల పట్టుకొచ్చినవు, మీ వోల్లు చూస్తె లొల్లయితది".

"చూడని. నన్ను జాలనేది నువ్వొక్కదానివే. చూసినవాక్క. వాళ్లు చాయ చేసుకోని అందరు ఒక్క జాగల కూసోని తాగుతండ్రు. నేను ఇంటోన్ని కాదా? ఇల్లింటపోడయితె ఇంటోడు గాకుంట పోతడా. కశికెడు చాయ పోయ్యొద్దా".

అంతయ్య కండ్లల్ల నీళ్లు జారాయి. రత్నవ్వ సముదాయించింది. ఊకుంచింది. "చేసి చేసి చెయ్యి గుంజుతందక్కా. చాబొట్టు కావాలె. నీ దయ" కాళ్లు మొక్కబోయాడు.

రత్నవ్వ మనసు కలకలయింది. తనకూ కండ్లల్ల నీళ్లు దిరిగాయి. కొడుకును తోలి చాయపత్త తెప్పించింది. చాయ చేసి పోసింది. గ్లాసుతో చాయ తాగుతుంటే చేతి బాధ, కన్ను బాధ, మనకు బాధ అన్నీ మాయమయ్యాయి అంతయ్యకు. మధ్యాహ్నానికి ముక్కాలి పీట పూర్తి చేశాడు.

అంతయ్య కష్టాలు రత్నవ్వకు తెలుసు. రత్నవ్వ కష్టాలు అంతయ్యకు తెలుసు. రత్నవ్వ పనిలో చెక్కపొట్టు ఒక ఊరట. అంతయ్య పనిలో చాయబొట్టు ఒక ఊరట. ఆరోజు చీకి పడి అంతయ్య దాని మీద పని చాలించాడు.

ఒళ్ళంతా నొప్పులనిపిస్తే మీద అరుగు మీద ఒరిగాడు. ఊర్లోకెళ్లిన పెద్దమనిషి ఇంటికి రాలేదు గనుక ఇంకా భోజనాలు కాలేదు. ఆయన భోంచేసిన తర్వాతనే ఇంట్లో ఎవరికైనా భోజనం. కడుపులో ఆకలవుతున్నా పడుకొని ఎదురుచూస్తూ ఏదో ఆలోచిస్తున్నాడు అంతయ్య.

మనిషి జీవితమే అంత. ఎక్కడ పుడతాడో, ఎక్కడ పెరుగుతాడో, ఎవరికి కష్టం చేసి పెడతాడో, ఎవరు అనుభవిస్తారో, ఎవరు అవుతారో, ఎవరు కారో, ఎప్పుడు ప్రాణం పోతుందో, ఎవరు మోస్తారో, ఎవరు ఏడుస్తారో, ఎవరికి తెలువదు.

ఇదో చెత్త. చెత్త పొయ్యేదాంక అవస్థ. చెత్తకోసం చెడాలె... బతకాలె... ఏడువాలె... అంతయ్య లోపల ఆలోచన్లు తెగకముందే దబదబా చప్పుడు వినబడింది. విసిరికొట్టిన చెంబు చప్పుడు... అటువైపు చెవి పెట్టాడు. మళ్లా కంచం చప్పుడు... మరింత శ్రద్ధగా విన్నాడు.

"చావు ముండా చావు. బతికి ఎవల్నుద్ధరిస్తవు. వండరాదు. పెట్టరాదు. సంసారం చెయ్యరాదు. మొగోన్ని ఎట్ల చూసుకోవాన్నో తెల్వదు. ఉత్తపులుసుతోని ఎట్ల తింటరే... అవులముండా...."

"ఊకె కూరంటవు. కూర తెచ్చి పెట్టినంక నేనొండి పెట్టలేదా"

"మల్ల మాట్లాడ్తె తంత. నేను తెచ్చి పెట్టినంక నువ్వేందే వొండేది. పొయ్యి పొయ్యి వొచ్చినోనికి గిదాయె పెట్టేది. ఆడిదెట్లుండాలె. నోట్లె నాలికె బయట కెళ్లొద్దు. ఎదురు మాట్లాడ్తవు. ఇగురం లేనిదానా... సట్టం పాడుగాను. నీ సట్టమే గంత. మంది ఉసురు పోసుకుంటరు. మంది కొంపలు ముంచుతరు".

"అన్నె మొగని – నా సట్ట గురించెత్తకు. నన్నను. పద్ద. సట్టమంటె మంచిగుండది".

"సట్టమనంగనే లావు ఎగేసుకొత్తంది. ఏం జేత్తవే. ఒకసారి గాదు వొందసార్లంట. ఇయ్యాల నువ్వన్న ఉండాలె. నేనన్న ఉండాలె".

"పోరగాండ్లు లేకపోతె మా పోదు... ఎవ్వలకు కనబడకుంట" ఏడ్చుకుంటూ అన్నది.

"పో..ఇప్పుడు పో...పీకు...చావు పో...బతికి ఎవ్వలనుద్దరిస్తవు... పోరగాండ్లు, నువ్వు యాకం యాడన్న పడి సావుపోండ్రి".

అంతయ్య మాటల్నీ వింటున్నాడు. "రత్నక్కనే తిడుతున్నాడు. బావకేం పనిలేదు. పొద్దుగూకంగనే ఇంత తాగాలె. ఒర్రాలె. పెండ్లాం

అగ్గువకు దొరుకుతది" అనుకుంటూ లేచాడు. ఆ ఇంటివైపు రాబోయి ఆగాడు. కూచున్నాడు.

తిట్లు ఆగిపోయాయి. ఏడుపు వినిపించలేదు. కొద్దిసేపటి తర్వాత తలుపు చప్పుడు వినిపించింది. ఇద్దరు పిల్లల్ని తీసుకొని రత్నక్క విసురుగా నడుస్తున్నది. చీకటి ముదిరింది. పరీక్షగా చూస్తే తప్ప కనబడటం లేదు. ఆ వాడ ఎప్పుడూ సందడిగా ఉండేది. ఇంటి ముందు ఎవరో ఒకరు కదిలేది. అందరూ తింటున్నట్టున్నారు. వంటింట్లో ఉన్నారేమో? ఎవరూ కనిపించలేదు. చీకటే. చిక్కగా చీకటొక్కటే. విసురుగా రత్నక్క. చీకట్లో ఎటు వెళ్తుంది పాపం!

చీకట్లో మూడు ఆకారాలు. రత్నక్క ఇద్దరు పిల్లలని తెలుస్తూనే ఉన్నది. అంతయ్య అంతా చూస్తూనే ఉన్నాడు. రత్నక్క చేదబావి దాకా వచ్చి ఆగిపోయింది. లోపలికి తొంగి చూసింది. పిల్లలవైపు చూసింది. చిన్న పిల్లవాడ్ని ఎత్తుకున్నది. పెద్ద పిల్లవాడు గట్టిగా ఏడుస్తున్నాడు. చీర సింగులు పట్టి ఊపుతున్నడు. చుట్టూ చూసింది. రత్నక్క ఎగ తడుతున్నది. ఏడుస్తున్నట్టు వినిపిస్తూనే ఉన్నది. కీడు తోచింది అంతయ్యకు.

"రత్నక్కా... అయ్యో రత్నక్కా... ఆగు.... ఆగు వొద్దు... వొద్దు....." అంతయ్య వేగంగా ఉరుకొచ్చాడు. పిల్లవాడ్ని రెండు చేతుల్లో పట్టుకోబోతుంటే అంతయ్య చేతులు లాగాడు. పిల్లవాడ్ని రెండు చేతుల్లో పట్టుకోబోతుంటే అంతయ్య చేతులు లాగాడు. పిల్లవాడ్ని లాక్కున్నాడు. బోరుమన్నది రత్నవ్వ. మీదపడి ఏడుస్తున్నాది.

"తప్పుగాదక్క. పిల్లలు గద. రాజులసోంటి పిల్లలు. బంగార మసోంటి కొడుకులు. తప్పు... వొద్దు... ఎప్పటికుంటయా కష్టాలు... ఎన్నిసార్లు నన్ను ఊకుంచలే. వొద్దు. మా అక్క గద.. ఊకో... అక్కా... తుడుసుకో... పిల్లల జూసుకో".

"కూర లేదట. కూరకో పంచాది. రోజో పంచాది. పోరగాండ్ల మొఖం జూసి పదుతున్న గని... ఏం బతుకిది...బతుకు పాడుగాను.."

"అంతయన్న.. వొద్దు... అంతకటీనమొద్దు... కొడ్కుల మొఖమే జూడాలె. మన రాతల గంతున్నది పడాలె... ఎల్లవొయ్యాలే...."

"వొద్దన్నంక ఏ మొఖం పెట్టుకోని ఇంట్లకు పోవాలె... నేను రాను... ఆయెనెకు సుత తెలువాలె"

"పిచ్చి... వొద్దు... నేనొస్త... బావ కాళ్లు పట్టుకుంట. బతిలాడుత. అడుగుత పా... నీ యింట్లకు నువ్వు పా"

అంతయ్య రత్నవ్వ రెట్ట పట్టుకుని ఇంటివైపు తిప్పాడు. చిన్నోన్ని ఎత్తుకొని పెద్దోన్ని చెయ్యి పట్టుకొని రత్నవ్వను తోలుకోని ఇంటెనుకనుంచి వచ్చాడు అంతయ్య. బావ కాళ్లు మొక్కాడు. బతిమిలాడాడు. ఊరి పెద్దవు. పెద్దమనిషివి. చెడ్డపేరు వొస్తుందా... సముదాయించాడు. చల్లబర్చాడు. సదిరి చెప్పాడు. కుదుట పడ్డాక వచ్చేశాడు.

--- ---- ---

పొద్దు వేగంగా నడుస్తుంది. పని జాడ్యంగా నడుస్తున్నది. కొత్తింటి పని. ఒకటందితే మరొకటందదు. మట్టిగోడల మీదికి దూలం ఎక్కించేసరికి పొద్దు నెత్తికెక్కింది. అంతకుముందు కడప పెట్టి దర్వాజ నిలబెట్టడానికి తలప్రాణం తోకకొచ్చింది. కామిరెడ్డి నరసయ్య ఇంటికి పెద్ద కొడుకే ఐనా పాత ఇల్లు నౌకరి కొడుకుకు ధర కట్టించి కొత్త ఇల్లు కట్టుకోవడానికి నిర్ణయించుకున్నాడు. ముగ్గు పోసం దగ్గర్నుంచి పనివాండ్లను పరిగెత్తిస్తున్నాడు. ఎంత పరిగెత్తించినా ఏడాది దాటనే దాటింది.

అంతయ్య పనితనమంతా చూపించి చేరెల్లు చెక్కాడు. తెల్లారకముందే దూలం ఎక్కించాలని ఎంత తాపత్రయపడ్డా సాధ్యం కాలేదు. ఎండ ముదిరితే పని మరింత మందగిస్తుందని అంతయ్య భయం. గోడపని, దర్వాజ పని అయిందంటే మొగతా పని దానంతట అదే సాగుతుంది. దూలం ఎక్కించేదాకా పచ్చి మంచినీళ్లు కూడా ముట్టడు. రెండు దూలాలు నిలబెట్టిన తర్వాత చెంబు నీళ్లు తాగాడు. బీడీ ముట్టించాడు. ఏవో లెక్కలు పెట్టుకున్నాడు. పెన్సిల్‌తో గీతలు పెట్టాడు. కింత మొగురాలు కుదిర్నాయా లేదా చూసుకొన్నాడు. దూలానికి, దర్వాజ చేరేడుకు కుంకుమ బొట్టు, పసుపు బొట్టు పెట్టాడు. కొత్త బట్టల్లో నిమ్మకాయలు కట్టి చేరేడుకు చేర్చాడు.

"మా పని పూర్తయింది. మీ పని కానియ్యండి" అన్నాడు.

కొత్త ఇంటి సంబురం. దూలం ఎక్కించిన గడియ, కడప పెట్టిన వేడుక. యాటను తెచ్చారు. తలకు నీళ్లు తడిపి దువ్వారు. జడతివ్వగానే తల తెగింది. ఎవరి పని వాళ్లు ఉత్సాహంగా చేస్తున్నారు. కొత్త ఇల్లు నిర్మాణం మొదలయితే పనివాళ్లందరికి పనికి పని, పండుగకు పండుగ. యాట మాంసం దేనికది కుప్పలు వేసి ఎవరి బొట్టు వాళ్లకు ఆకుల్లో పెట్టారు. పెద్ద మనుషులకు వెళ్లే బొట్టు, పనివాండ్లకు వచ్చే వాటా, కైకిలి వాండ్లకు దక్కే దావతు, ఇంటి యజమాని బంధువుల వేడుకకు మాంసం విడివిడి భాగాలుగా పంపకాలు జరిగిపోయాయి.

కట్టెపని సర్దుబాటు చేసి తన భాగం మాంసం తీసుకొని ఇంటికి చేరుకున్నాడు అంతయ్య. వంటింట్లో ఇచ్చాడు. స్నానానికి చేదబావి మీదికి వచ్చాడు. స్నానం పూర్తి చేసుకొని ధోతి మార్చుకొని బయట అరుగు మీద కూర్చుని మరో బీడీ ముట్టించాడు. పెద్దమనిషి అప్పటికే భోజనం చేసి ఊర్లోకెళ్లాడు. తల్లీ బిడ్డలు చర్చించుకొని తెచ్చిన మాంసం సాయంత్రం వండటానికి నిర్ణయించారు. ఉన్న భోజనం వడ్డిస్తే తిని లేచాడు అంతయ్య. చిన్న కునుకు తీసి ఇంటిపనికి బయలుదేరాడు. కొత్త ఇంటి దగ్గర ఆ పని ఈ పని చేసుకొని తిరిగి

ఇంటికి చేరుకునే సరికి చీకటి పడుతున్నది. దీపాలు ముట్టిస్తున్నారు.

రత్నవ్వ నిద్ర లేచేసరికి తెల్లారే చుక్క పొడిచింది. చీకటి మసక మసకగా వున్నది. బర్రెపాలు పిండింది. గోలెం చూస్తే నీళ్లు లేవు. బిందె పట్టుకొని ఇంటెనుక చేదబావి దగ్గరకు చేరుకున్నది. బిందె కింద పెట్టి గిరకమీద నుంచి ముందుకు చూసేసరికి ఆకారం కదులుతున్నట్టనిపించింది. ఇటు పట్టించుకోకుండా తన పనిలో మునిగినట్లు తోచింది. ఏమై ఉంటుందని పరీక్షగా చూసింది. చెట్టుకొమ్మకేదో వేలాడుతున్నది. దాని పక్కన మొద్దు మీదికెక్కి వేలాడుతున్నదాన్ని తలకు వేసుకోవటానికి అవస్థ పడుతున్నట్టు తోచింది. ఆ చీకట్లోనూ కలిసిపోయిన నల్ల శరీరం, తెల్లటి గోచీ చూస్తూ 'అంతన్నా' అప్రయత్నంగా అరిచింది రత్నవ్వ. గబగబా ఉరికింది దగ్గరికి.

"అంతన్నా... ఎంత పని చేస్తున్నవు...." చేతులు కదలకుండా పట్టుకున్నది. అంతయ్య చేత్తో రత్నవ్వను నూకేయబోయాడు. పట్టు విడువలేదు. "రామసామీ, సీతన్నా.... రాంద్రే... రాంద్రుల్లా... అయ్యో... అయ్యో.... లచ్చక్కా.. ఈరక్కా.. ఉన్నారుల్లా... " గట్టిగా అరుస్తున్నది.

"రత్నక్కా... లొల్లి చెయ్యకు... నువ్విక్కన్నుంచి పో..." చేతులు విడిపించుకొని తాడు పట్టుకున్నాడు. రత్నవ్వ అరుస్తూ ఏడుస్తున్నది. తలుపులు తెరుచుకొని ఇద్దరు ఆడవాళ్లు చేరుకున్నారు. సీతయ్య చేరుకున్నాడు. పెద్దమనిషి సిద్దయ్య, వెంట బిడ్డలు చేరారు.

"ఇంత పనికి తయారైనవా... తెల్లారనియి. నీ సంగతి చెప్త" అని బెదిరించాడు సిద్దయ్య.

"మామా... గవేనా మాటలు... అల్లున్ని పట్టుకోని నోరు పారేసుకుంటరా..." రత్నవ్వ గదమాయించింది. "పెద్ద మనిషివి, మా కుల పెద్దవు. గిదేం మాటే" సీతయ్య చీదరించుకున్నాడు.

"రత్నక్క చూడకపోతే ఎంత పనై పోయేదీ... అంతయ్యా గంత తొందరపడితే ఎట్లరా..." ఈరవ్వ మందలిస్తున్నది.

"ఇడిసిపెట్టి పోదామనుకున్నవా నా అయ్యా... బురద ఎవలికి రుద్దుదామనుకున్నవు మాయయ్య. బంగారమని ముద్దుపెట్టుకుంటె బజార్లస్తివి గద" అంతయ్య భార్య అల్లాడుతున్నది.

"తెల్లారని... నీ అయ్యను పిలుస్త. నీ చుట్టాల్ని పిలుస్త. పంచాయితి పెడుత... ఎవల మెడకు చుడుదామనుకున్నవురా...." పెద్ద మనిషి అరుపు.

ఇంటెనుక అల్లరవుతుంటే బాల్‌రెడ్డి బయటికొచ్చాడు. పెద్దమనిషి ఒక్కసారిగా గొంతు తగ్గించాడు. "ఏం జరిగింది...."

"అంతన్న ... తాడు కట్టుకోని మెడకేసుకోబోయిండు... రత్నక్క నీళ్లకు వచ్చి చూసింది..." సీతయ్య చెప్పాడు. అంతయ్య అమాయకుడు బెదిరి చూస్తున్నాడు.

"కోపతాపాల మీద మాట్లాడుకుంటే ఏం లాబం. జర కానియ్యండ్రి... ఒకల్నొకలు అనుకుంటే ఏమొస్తది? మాటకురావు... మనసుకురావు... పొండ్రి...పొండ్రి..."

అంతయ్యను చేయి పట్టి తీసుకపోయాడు బాల్‌రెడ్డి. వెనుక రత్నవ్వ వెళ్లిపోయింది. ఒకరెనుక అందరు వెళ్లిపోయారు. పెద్దమనిషి కూడా ఇంట్లోకెళ్లాడు.

"ఏమైంది అంతయ్య బావ"

అడుగుతుండగానే దు:ఖం పొంగుకొచ్చింది అంతయ్యకు. చేతులు పట్టుకొని ఏడ్చాడు. బాల్‌రెడ్డి ఊకుంచాడు. "ఎన్నిసార్లు దీం చెప్పినవు. ఇయ్యాలేమైంది" రత్నవ్వ అడిగింది... "చాయ పెట్టుపో... మొఖం కడుక్కోవోయ్. చా.. తాగుదువు"

"చాయెందుకు బావా, నా బతుక్కు... ఇసోంటి బతుకు పగోనికి సుత వద్దు". బలవంతం మీద ముకం కడుగుకున్నాడు. చాయ తాగాడు.

"నేనున్న గద... ఏం గాదు... ఏమనకుంట నేను చూసుకుంట... గని ఇగ జెప్పు..."

"ఏం జెప్పాలె.. చెప్తె జాతులిడిసిండంటరు. పులెగండోడంటరు. నిన్న కామిరెడ్డి నర్సయ్య ఇంటికి దూలం ఎక్కించి కడుప పెట్టినం గద. యాట గొడుతరుగుద. మీకు సుత బొట్టురావొచ్చు. మా పనోల్ల వాట కూర దీస్కపోయి ఇంట్ల ఇచ్చిన. ఆలెస్సెమైందని సాయంత్రం వొండుతమంటె సరేనని పనికి వొయిన. రాత్రికి పెదుతరని ఆశపడితె చిన్నముక్క గూడ పెట్టలే. చూసి చూసి అడిగిన. బలువు పని చేస్త. బాడిసె పడ్త. పెద్ద బాడిసె పడ్తె పానాలు పోతయి. రెక్కలు గుంజుతయి. ముక్క కాశపడ్తె తప్పా. కులం పాడు అను... తినే కులమాయె. తినయిద్దాయె. నేనే తెస్తి. పదిల పదకొండు. నేను తింటెనే వొడిసిపోతదా... చేసింది తిన నోసుకోకపోతె బతికి ఎందుకు? అడిగిన... అవు, బరాబరి అడిగిన. పెద్దాయినె, ఆయెనె దోస్తు ఇంట్ల అందర తింటరు. నాకు పెట్టరు. అయిపోయిందట. ఎటో అన్పిచ్చింది. నా తప్పు జెప్పాలె. పెద్దాయన మనిషి గని నేను గాదా... అన్న. గంతే. అందరొకటయిండ్రు. నన్ను కట్టేసిండ్రు. కట్టెతోని గొట్టిండ్రు. ఊకె. బతుకొచ్చిన్నంటరు. ఇల్లిటమొచ్చిన వంటరు. పడి ఉండాలంటరు. నేను మనిషిని గానా? చాయ చేసుకోని తాగుతరు. పొయ్యరు. చల్ల పోస్కోని తింటరు. నాకు బొయ్యరు. తినతందుకేం పుట్టలేదు గని – ఎన్ని తిట్లు పడాలె... ఎన్నిసార్లు ఇజ్జత్ చంపుకోవాలె. నాలుక చంపుకోవాలె. మనసు చంపుకోవాలె...."

ఎప్పుడన్న చెప్పిన్నా... ఎదిరిచ్చిన్నా.. మారు మాట ఉచ్చురిచ్చిన్నా... ఎన్నేండ్లు గిట్ల... రెక్కలర్గంగ పని చేసిన నచ్చిన బట్ట గట్టలే. నచ్చిన తిండి దినలే. సుఖపడలే బావ... ఇల్లిటపల్లుడు ఇంటికి యాకం లోకువే... బతికేం జెయ్యాలె. రెక్కల బలం లేదు... గుండెల్ల బలం లేదు... సాలనుకున్న...." బోరుమని మళ్లీ ఏడ్చాడు.

"అట్ల గాదు.... అంతయ్య... ఎందుకో అందుకు బందార మొచ్చినవు. బంగారమసోంటి పనోనివి. ఎందుకు సాలిచ్చుకోవాలె... సాగిచ్చుకోవాలె... నచ్చింది సాధిచ్చుకోవాలె... చెయ్యి... తిను... ఉండు.. పెట్టకపోతే అడుగుదాం. ఎందుకు పెట్టరు. మీద మీద దిరిగే పెద్దమనిషి తినంగలేంది నువ్వు దింటె తప్పేంది? గట్టిగ మర్లపడితె గదే చెప్పినట్టింటరు. నన్నెగ ఎందుకుండాలే అంటన్న."

"ఉంచుతరా... గట్టిగ అంటె బతకనిస్తరా... కట్టుకున్నది గూడ నన్న కనిపెట్టుకోకపోతె ఏమనిపిస్తది.... ముసలోడు యిడువడు నన్ను...."

"ఏం గాదు... అన్ని తొవ్వల బడ్తయి. అందరు తొవ్వకొస్తరు. కొడుకుకు నాయిన కావాలె గద... మీ కంసవ్వకు గూడ నాయిన ఎప్పటికుంటడా... మొగడు కావాలె.. ఏం గాదు... నేను జెప్త గద... పెద్దమనిషికి సదిరి చెప్ప"

అంతయ్య వెంట బెట్టుకొని వాళ్ల ఇంటికి వెళ్లాడు బాల్‌రెడ్డి. సగం మెత్తబడ్డాడు పెద్దమనిషి. సగం పరువు పోయి పెద్దిర్కం మెత్తబడ్డది. వాడ కూడింది. ఎర్రబడ్డ కండ్లల్ల నీళ్లు తిరిగినయి. అండలేనివాన్ని అరివంద్రం చెయ్యాలనుకుంటె తప్పు. అండ లేనివానికి వాడ అండ, ఊరు అండ.

"సిద్దయ్య నాయనా, ఊరి పెద్ద మనిషివి. అల్లున్ని మంచిగ జూసుకోకపోతే పెద్దమనిషితనం మిగులది. అల్లుడంటేంది కొడుకన్నట్టే. రేపు నీ ఇల్లు దిద్దుకొచ్చేది అంతన్నే. ఇంకా ముగ్గురు ఆడపిల్లల పెండ్లిలు చెయ్యాలె. పేరు కరావైతే పెండ్లిలెట్లయితయి? అల్లున్ని సతాయిస్తుండంటే అల్లుండ్లెట్లొస్తరు ఇంటికి. మంచిగ జూస్కో నువ్వు సుఖపడాన్నంటె పెద్ద కుటుంబం, పెద్ద బరువు తొవ్వల పడాల్నంటె అంతయ్యంత మంచల్లుడు యాడ దొరుకుతడు. ఏమవ్వ... కంసవ్వా... కష్టమో సుఖమో మొగనితోనె గని ఎవలు కారు. నాయిన నాయనే. అమ్మ అమ్మే. వాళ్లెప్పటికుండరు. మొగనితోనె సంసారం. మొగనితోనే తీగ. ఒకలెనుక అందరం పోయెటోల్లమే. ఎవలం ఎల్లకాలం బూమ్మీద ఉండరాలే. మన యాల్ల వొచ్చినప్పుడు మనం పోతం. మంచి... చెడ్డ అవే ఉంటయి. అవే మన పోరగాండ్లకొస్తయి. మంచి అనిపిచ్చుకోవాలె. మంచిగ బ్రతకాలె. మనుషులం.. మనం... మనుషుల లెక్క బతకాలె. లోకం మెచ్చాలె. అంతయ్యను మంచిక జూస్కోండ్రి. మీకే మంచి జరుగుతది" నచ్చ చెప్పాడు బాల్‌రెడ్డి. ఊపిరి పీల్చుకున్నాడు అంతయ్య. ఆలోచనలో పడ్డాడు సిద్దయ్య. తల దించుకున్నాడు. మనుషులు ఎవరైనా అంతే అనుకుంటారు. ఒకర్నొకరు కాపాడుకుంటారు.


# ఆలోకనం

**(తెలంగాణ 31 జిల్లాల చరిత్ర సాహిత్య సాంస్కృతిక సమాచారం)**

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా మూసీ మాసపత్రిక ప్రత్యేకంగా సంకలనం చేసిన గ్రంథం ఆలోకనం.

తెలంగాణ 31 జిల్లాలకు సంబంధించిన విలువైన సమాచార సూచిక ఇది.

330 పేజీల ఈ గ్రంథం విలువైన రంగు చిత్రాలతో కూడుకుని ఉన్న విశేష గ్రంథం.

అన్ని రకాల కాంపిటీషన్ పరీక్షలకు కూడా వినియోగపడే సమగ్ర సమాచార దర్పణం.

**మూసీ కార్యాలయంలో దీనిని పొందదలచిన వారికి కేవలం 300/- (అసలు 500/-) కు మాత్రమే అందిస్తున్నాం. సంప్రదించండి.**

# 'కదంబం'

**(తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు)**

**మూసీ మాసపత్రిక ప్రచురించిన ప్రత్యేక గ్రంథం**

**ప్రాచీన, అధునాతన, జానపద ప్రక్రియలన్నింటిపై ప్రత్యేక వ్యాసాలు**


(పురాణం, ఇతిహాసం, కావ్యం మొదలైన ప్రక్రియలు మొదలు నానీలు, హైకూల వరకు 82 సాహిత్య ప్రక్రియలపై ప్రముఖ సాహితీవేత్తల కలాల నుండి జాలువారిన ప్రత్యేకాంశాల సమాహారం. పోటీ పరీక్షలకు, కళాశాలలకు, వ్యక్తిగతంగా అందరికీ వినియోగపడే ఉత్తమ గ్రంథం **'కదంబం'**.

**440 పేజీలతో వెలువడిన ఈ గ్రంథం వెల రూ. 350/-**

# పద్యమనోహరం - 48

## గన్నమరాజు గిరిజామనోహర్ బాబు

వరంగల్, ఫోన్ : 994 901 3448





**"గరళంబున్ గళసీమ దాల్చియు, శశాంక భ్రాజ మానుండునై
గురు గంగా నిరతాభిషిక్తుడగు భర్గున్ మాడ్కి గర్భాన దు
ర్భర కాలాగ్నిని దాచి నిత్యము సరస్వద్వారి సుస్నాత యౌ
ధర జీవాతువు ప్రాణికోటికి జగద్ధాత్రీ! నమోవాకముల్"**

భారతీయ సంస్కృతిలో పంచభూతాలకు దైవస్థానం ఇవ్వబడింది. మానవమేదకు అందని మహాశక్తి పంచభూతాలు కలిగి ఉన్నాయన్న సంగతిని గుర్తించిన ఆర్ష విజ్ఞానవేత్తలు పంచభూతాలను దైవాలుగా ఆరాధించారు. సృష్టిలోని సమస్త ప్రాణికోటికి జీవనాధారమైన శక్తులు ఇవే. కనుక వీటిని పూజించాలి, గౌరవించాలన్న భావం మన సంస్కృతి బోధిస్తుంది.

ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణగారు గొప్ప విజ్ఞాన శాస్త్రవేత్త. భారతీయ సంస్కృతిపైన అపారమైన గౌరవం కలిగిన మహనీయులు. పద్య రహస్యం తెలిసిన వేత్త. ఎందరో మహాకవుల సాన్నిహిత్యం కలిగినవారే గాక ప్రాచీన సాహిత్య అధ్యయనం చేసిన ప్రతిభాశీలి. "సుగుణాఢ్య" శతకం వంటి కృతులే గాక "మహాదేవి మత్తేభ తారావళి", "దివాకర వృత్త తారావళి", "పావక వృత్త తారావళి" "సుజల వృత్త తారావళి" వంటి అద్భుతమైన పద్యకృతులు వెలయించిన ఉత్తమ కవులు.

పంచ భూతాల ప్రాముఖ్యాన్ని ప్రకటించాలన్న సత్సంకల్పంతో వారు వెలువరిస్తున్న "తారావళు"లలో ఇటీవలే వెలువడిన 'వసుంధరా వృత్త తారావళి'లోని పద్యాలన్నింటిలోనూ "భూమి" యొక్క గొప్పదనాన్ని, దానికి మన సంస్కృతి అందించిన మాతృస్థానం యొక్క ఔన్నత్యాన్ని గురించి, సర్వసృష్టిలోని జీవరాసులన్నీ భూమివల్ల పొందే పలు ప్రయోజనాలను గురించి చెప్పే ప్రయత్నం చేశారు. భూమి యొక్క అవసరాన్ని, దాని విషయంలో మనిషి ప్రవర్తించాల్సిన తీరును గురించి కూడా ఈ 'తారావళి'లో తెలియజేశారు.

జగద్ధాత్రి యైన ఆ భూమాతకు నమస్కరిస్తూ 'అమ్మా! కంఠంలో విషం తాను ధరించి, తన శిరస్సునలంకరించి చంద్రుని వెన్నెల చల్లదనాన్ని లోకాలకు పంచతున్న పరమేశ్వరుని వలె నువ్వు కూడా భయంకరమైన కాలాగ్ని వంటి ఎన్నో అగ్ని పర్వతాలను నీ గర్భంలోనే దాచుకొని, ఆరు కాలాలు ప్రవహించే నదీ ప్రవాహాలతో ఇక్కడి జీవజాలపు ప్రాణధాతవై నిలుస్తున్నావు తల్లీ! నీకివే నమస్సులు" అంటూ చెప్పిన వసుంధరావృత్త తారావళిలోని పద్యాన్ని రచించిన ఆచార్య అప్పాజోస్యుల వారు ప్రతి పద్యంలోను భూమి ప్రాశస్త్యాన్ని, భూమి ప్రాముఖ్యాన్ని, భూమి అవసరాన్ని అనేకవిధాలుగా పటిష్ఠమైన పద్యాల్లో వర్ణించారు.


శక్తివంతమైన పద ప్రయోగ నైపుణ్యం, ఉన్నతమైన భావధార, ప్రామాణికమైన శాస్త్రీయ దృక్పథం, సుష్ఠు సమాస నిర్మాణ చణత్వం ఆచార్యులవారి పద్యకృతులలో మనం దర్శించుకోగలిగే విశిష్ట గుణం. అపారమైన అధ్యయనశీలత కారణంగా వీరిలో ఈ విధమైన ప్రతిభ వికసించింది. దీనికి తోడు వారిలోని ఊహా చమత్కృతి, శాస్త్ర విజ్ఞాన సంపద రచనలను మరింత వెలిగించాయి. వారి పద్య నిర్మాణం పటిష్ఠత కూడా పద్యరచన చేసేవారికి మార్గదర్శనం చేస్తుంది. ఈ పద్యంలో 'సరస్వద్వారి' ప్రయోగంలోని 'సరస్వతి' శబ్దానికున్న రూఢ్యర్థం మాత్రమే గాకుండా ఆ పదానికి ప్రవహించేది అనే అసలైన అర్థాన్ని "వారి" శబ్దానికి జోడించి చెప్పడం ఒక సౌందర్యం.

సర్వ ప్రాణికోటికి జీవాతులైన భూమాత ఔన్నత్యాన్ని ప్రకటించిన ఈ 'వసుంధరావృత్త తారావళి' అపురూపమైన ఒక గొప్ప పద్యరచనగా చెప్పడం ఏమాత్రం అతిశయోక్తి కాదు.

## శిలాక్షరం

**(బి.ఎన్.శాస్త్రి సాహిత్యం - సమాలోచన)**

ప్రముఖ శాసన, చారిత్రక పరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులు కీ.శే. బి.ఎన్.శాస్త్రిగారి రచనలన్నింటిపైనా సాధికారికమైన విశ్లేషణా వ్యాసాల సమాహారం 'శిలాక్షరం'.




**సంప్రదించండి.**
**మూసీ మాసపత్రిక**
**ఫోన్ : 934 7971177**

సంపాదకులు : డా. భిన్నూరి మనోహరి
సహ సంపాదకులు : అట్టెం దత్తయ్య
వెల : 300/-

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 3  UGC Care List Approved Journal
హైదరాబాద్ జనవరి : 2024

# రైతు కథలు – భాషా విశేషాలు

డా. గంజి సుకన్య, ప్రధానాచార్యులు, వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హైదరాబాద్. ఫోన్ : 98665 26619

**పరిచయం :** 'కథ్' అనే ధాతువు నుండి కథ అనే పదం వచ్చింది. కథ అంటే చెప్పడం అని అర్థం. కథ చెప్పేవాళ్ళు ఉంటే తప్పకుండా వినేవాళ్ళు కూడా ఉండాలి. కాబట్టి కథలో చెప్పడం, వినడం అనే రెండంశాలు ఉంటాయి. "నివేదించు, ప్రకటించు, భావించు, వర్ణించు, వ్యాఖ్యానించు" ఇత్యాది అర్థాలున్న 'కథ్' మూలధాతువు ప్రసన్నం 'కథ'. కథ్యతే యితి కథా. 'కథ్' ధాతు జన్యమైనది కథా అనేవి కథకు సంబంధించిన కొన్ని వివరణలు. కథ అంటే వృత్తాంతం. కొన్ని సత్యాంశాలతో కూడుకున్న కల్పిత కథనం. మానవ సమాజం పుడుతూనే కథ అనేది పుట్టి ఉండాలి అని కొడవటిగంటి కుటుంబరావు గారన్నారు." "కుతూహలం, కల్పనాశక్తి, విచారశీలత మనిషికుండే స్వాభావిక గుణాలు. ప్రకృతిలోని సూర్యచంద్రులు, పశు పక్ష్యాదులు మానవునికి అడుగడుగునా కుతూహలాన్ని రేపాయి. కల్పనా తరంగాలను సృష్టించాయి. ప్రకృతిలోని సౌందర్యం, భీకర స్వరూపం, సుఖదుఃఖాలు మానవునికి ఎన్నో ఆలోచనలను కల్పిస్తాయి. ఆలోచనల సుడిగుండాల్లో చిక్కి మనిషి ఉక్కిరి బిక్కిరి అవుతాడు. భౌతిక వస్తువులను గూర్చి, దాని వెనుక దాగి ఉండే శక్తిని గూర్చి స్వర్గ, మర్త్య, పాతాళాలను గూర్చి మనిషి ఆలోచించాడు. అతని ఆలోచనా శక్తి ఎంతో దూరం పోలేనపుడు కల్పనా శక్తే ఎక్కువగా కాల్పనిక కథలుగా రూపుదాలుస్తాయి. మనకు తెలిసిందీ, జరిగిందీ, జరగందీ మనిషి ఎప్పుడైతే తోటివారికి చెప్పడం ప్రారంభిస్తాడో అప్పుడే కథ పుడుతుంది అని కథా రచయితలు తెలిపారు.

ప్రాచీన సాహిత్యంలోని అగ్ని పురాణంలో కథకు కొన్ని పర్యాయ పదాలు కన్పిస్తున్నాయి.

**"ఆఖ్యాయికా కథా ఖండ కథా పరికథా తథా**
**కథానికేతి మన్యంతే గద్య కావ్యంచ పంచథా"**

ప్రాచీన సాహిత్యంలో పద్య రచనలు, గద్య రచనలు ఉండేవి. ఛందస్సు ఉంటే పద్య రచన. ఛందస్సు నియమాలు లేకపోతే గద్య రచన. ఈ ఆఖ్యాయికా, కథ, ఖండకథ, పరికథ, కథానిక ఇవన్నీ గద్య రచనలే. ఇవి కథకు సంబంధించిన పర్యాయపదాలు. కథ, కథానిక అనే ఈ రెండూ చిన్న భేదాలున్న ప్రక్రియలు. కథలో వస్తువు ప్రధానంగా ఉంటుంది. కథానికలో శిల్పం ప్రధానంగా ఉంటుంది. అయినా కథ, కథానికలు ఒకటే. ఒకే విధంగా జనవ్యవహారంలో ప్రవర్తిల్లుతున్నాయి. ఈ కథానికలకే అందరూ కథ అని వ్యవహరిస్తున్నారు. కథ చివరలో పరిష్కారం చూపించవచ్చు. కథకుడు కథను పాత్రకు సంబంధించిన అంశంతో ముగించవచ్చు. సమస్యకు పరిష్కారం సూచించవచ్చు.

కథా ముగింపు రకాలు ఈ విధంగా ఉంటాయి. అవి – 1. పాత్రకు సంబంధించిన ముగింపు, 2. వస్తు సంబంధమైన ముగింపు, 3.పరిష్కారాత్మక ముగింపు, 4.ప్రతీకాత్మక ముగింపు, 5.ఆశాభావ ముగింపు. వీటిని సోదాహరణంగా చూడడం వల్ల కొంతైనా అర్థం చేసుకోడానికి వీలవుతుంది. భారతదేశంలో వ్యవసాయానికి సంబంధించిన సమాచారం సాంకేతికంగా అభివృద్ధి చెందిన ప్రసార మాధ్యమాలలో ఎక్కువ శాతం చోటు చేసుకుంది. అంతే కాకుండా ప్రచార మాధ్యమంలో కూడా దీని విస్తృతి నిరంతరంగా కొనసాగుతూనే ఉంది. అయితే సాహిత్యపరంగా చూసినప్పుడు భారతీయ భాషల్లో అనేక సాహితీ ప్రక్రియల్లో ఆయా ప్రాంతాలపరంగా వ్యవసాయానికి సంబంధించిన వివరాలను కథ, నవల, నాటకం తదితర ప్రక్రియల ద్వారా తెలియజేసినట్లే తెలుగు సాహిత్యంలో కూడా దాదాపుగా స్వాతంత్ర్యానికి పూర్వం, అనంతరం వచ్చిన రైతు సంబంధిత కథలను ఏర్చికూర్చి ఒక గ్రంథంగా గంథమనేని శివయ్య మెమోరియల్ సొసైటి తిరుపతి వారు సాకం నాగరాజు సంపాదకత్వంలో 2012లో తీసుకొచ్చారు.

ఈ గ్రంథంలో రమారమి 106 కథలు చోటు చేసుకున్నాయి. ఈ కథలు తెలంగాణ, రాయలసీమ, కోస్తాంధ్ర మూడు ప్రాంతాలకు సంబంధించిన కథలుగా తెలియజేయబడ్డాయి. ఈ కథలన్నీ కూడా దాదాపు రైతుల వ్యథలను తెలియజేసేవిగా ఉన్నాయి. ఈ మూడు ప్రాంతాల రైతు కథల్లో కథకులు వాడిన భాషావిశేషాలు రైతు జీవన విధానంలో పెనవేసుకుపోయిన విధానం, వ్యవసాయ సామాగ్రి పనిముట్లలో ఉన్న సంబంధ బాంధవ్యాలు వారు ప్రయోగించిన భాషాంశాలు పారిభాషికపదాలు, అన్యదేశ్య పదాలు, మాండలికాలు, జాతీయాలు, సామెతలు, ధ్వని అనుకరణ శబ్దాలు, ధ్వనులమార్పు మొదలైన అంశాలు అనేకం. తెలుసుకోవలసిన అవసరం ఎంతైనా వుంది. ఉదాహరణకు కొన్నింటిని పరిశీలిద్దాం.

రైతుకథల్లో కథకులు వాడిన పారిభాషిక పదాలు అన్ని కూడా అన్యదేశ్యాలలోనే వ్యాప్తంలో వుండడం మనం గమనించవచ్చు. వీరు ప్రయోగించిన పదాలు అన్ని కూడా ఆంగ్లభాష, ఉర్దూ మిశ్రమంగా చోటు చేసుకున్నాయి. పనిముట్ల విషయానికొస్తే నూర్పిడి యంత్రాన్ని ట్రాక్టరుగాను, కథకులు ప్రయోగించారు. అలాగే మిశ్రమ పదాలుగా డిస్కనాగలి, పంటకోయుయంత్రం, పవర్ స్ప్రేయర్ దీన్ని మిశ్రమపదంలో రబ్బిగోరుగా ప్రయోగించడం జరిగింది. బోదెనాగలిని కల్టివేటర్‌గాను, పత్తిగొర్రు అనే పదం బోరుడ్రిల్లింగ్‌గాను ప్రయోగితమైంది. అలాగే ఎరువుల విషయంలో వేపపిండి పొటాషియం

అయింది, నల్లుప్పు జింగ్‌సల్ఫేట్ అయింది, పెంటఎరువు సూపర్‌ఫాస్ఫేట్ అయింది. మందుల విషయంలో ఫినాయిలు, మోనో క్రోటోఫాస్, మెటాడిస్టాక్‌వంటి ఆంగ్ల పదాలే ప్రయోగంలోకి వచ్చాయి.

తెగుళ్ళ విషయంలో మొక్కతొలిచేపురుగుని మిశ్రమపదంలో నెక్కర్‌పురుగ్గా తెలియజేశారు. గొంతువాపు వ్యాధిని (జంతువుల్లో) ఆంత్రాక్స్ అని, విరోచనాలను కాలెస్టిరాల్ అని, సొంగకారణం యాంటీబాడీస్‌గాను ప్రయోగించారు. కొలతలవిషయంలో పొడవు క్వింటాల్ అయింది, వెడల్పు ఫీట్ అయింది, అడుగులు టన్ను అయ్యాయి. కలుపు మొక్కల విషయంలో గరక బౌన్‌టర్క్‌గా మారింది. ఈనాడు గ్రామీణ సమాజంలో విస్తృత వ్యాప్తంలో ఉన్న ఆంగ్లపదాలే కథకులు తమ కథల్లో ప్రయోగించారు. విదేశీ పదాలను అలాగే ఆదానం చేసుకోవడం అని గమనించవచ్చు.

### దేశ్యపదాల ప్రయోగం

ఆంధ్రాతెలంగాణా కథకులు వారి ప్రాంతాల్లో వ్యాప్తంలో ఉన్న పదాల్నే తెలియజేశారు. క్రియల పరంగా పరిశీలించినపుడు అప్పులిచ్చుడు అనే పదాన్ని ఆంధ్రాతెలంగాణా కథకులు ఒకేవిధంగా ప్రయోగించారు. అర్చుసుకొనుడు అనే పదాన్ని మర్యాదచేయడం అనే అర్థంలో తెలంగాణా కథకులు తెలియజేస్తే, ఆంధ్రా కథకులు ఎదురాడు అనే పదంలో ఇచ్చుకుపోవడం అనే క్రియ విఫలం కావడం అనే అర్థంలో తెలంగాణా కథకులు తెలియజేస్తే ఆంధ్రాప్రాంత కథకులు బుగ్గికావడం అనే పదాన్ని ప్రయోగించారు. కన్నంటుకోవడాన్ని రెండుప్రాంతాల కథకులు నిద్రలోకి జారుకోవడం అనే అర్థంలోనే తెలియజేశారు. నాభిపోవుడు అనే పదాన్ని ఎబార్షన్ అర్థంలో తెలంగాణా కథకులు తెలియజేస్తే, గడ్డిరిగింది అని రాయలసీమ కథకులు తెలియజేశారు. రైతుకథల్లో వ్యవసాయ సామగ్రి, పనిముట్లు మొదలైనవాటి పదాలు ఈవిధంగా ఉన్నాయి. గొర్రు, గూటవ, మడక, పలుగు, పార, ముల్లులగొర్ర, చలక, చేను, ఎద్దులబండి, నాగలి, ములుగర్ర, కత్తులు, బల్లెలు మొదలైనవి కన్పిస్తాయి.

### తెలుగు భాషా మాండలికాలు

కోస్తా, తెలంగాణ, రాయలసీమ, ప్రాంతాల నుండి కథకులు రైతు కథలు రాశారు. గతంలో రాయలసీమ ప్రాంతాన్ని దత్తమండలాలు అని పిలిచారు. అప్పుడు ఆ ప్రాంతంలో బళ్ళారి, అనంతపురం, కడప, కర్నూలు, జిల్లాలు ఉండేవి. అయితే భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడడం వల్ల బళ్ళారి ప్రాంతం కర్ణాటక రాష్ట్రంలో కలిసింది. ప్రస్తుతం అనంతపురం, కడప, కర్నూలు, చిత్తూరు జిల్లాలను రాయలసీమ అని పిలుస్తున్నాం.

రాయలసీమ పేరు ప్రఖ్యాతులు గడించిన కథకులు చాలా మందే ఉన్నారు. జి. రామకృష్ణ, కె.సభా, మధురాంతకం రాజారాం. రాచమల్లు రామచంద్రారెడ్డి, వల్లంపాటి వెంకట సుబ్బయ్య, పులికంటి కృష్ణారెడ్డి, సి. వేణు, కేతు విశ్వనాథ రెడ్డి, సింగమనేని నారాయణ, శాంతి నారాయణ, మధురాంతకం నరేంద్ర, నామిని సుబ్రహ్మణ్యం, దాదాహయత్, కన్నమనాయుడు, చిలుకూరి దేవపుత్ర, బండి నారాయణ స్వామి, మహేంద్ర, రాసాని, జి. ఆర్. మహర్షి, సన్నపురెడ్డి వెంకట రామిరెడ్డి, గోపని కరుణాకర్, మొదలైన రచయితలు తమ రచనల ద్వారా, కథా సాహిత్యంతో పాఠకులను ప్రభావితం చేశారు. వైవిధ్యభరితమైన ఇతివృత్తాలలో పాఠకులను చూరగొన్నారు.

తెలంగాణ ప్రాంత కథకులు తొలి, మలితరాల్లో గణనీయమైన సంఖ్యలోనే కథలు వచ్చినా మూడవ తరంలో తెలంగాణ కథ అన్ని వర్గాల నుండి ఉప్పెనలా విజృంభించింది. తెలంగాణ నుండి అన్ని తరాల్లోనూ సమకాలీన అట్టడుగు జీవితాలే కథా వస్తువులయ్యాయి. తెలంగాణ ప్రాంతం నుండి గొప్ప కథలే వెలువడ్డాయి.

మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి, కాళోజి నారాయణరావు, పి.వి, నరసింహరావు, వట్టికోట ఆళ్వారుస్వామి, గూడూరి సీతారాం. ఇల్లిందల సరస్వతిదేవి, పి.యశోదారెడ్డి, దాశరథి రంగాచార్య, కాలువ మల్లయ్య, బి.యస్, రాములు, ముదిగంటి సుజాతారెడ్డి, బోధనం నర్సిరెడ్డి, గూడ అంజయ్య, పి. చంద్, జాతశ్రీ, పంజాల జగన్నాథం, ఐతా చంద్రయ్య, పెద్దింటి అశోక్ కుమార్, మొదలైన వారు తెలంగాణ గ్రామీణ సంఘర్షణను, భూస్వామ్య వ్యవస్థ పతనం, దిక్కు పయణిస్తున్న వైనాన్ని దున్నే వాడికే భూమి చెందాలన్న భావాన్ని రైతు దృష్టికోణం లోంచి చూస్తే కథలు వివిధ వృత్తుల, కార్మికుల జీవితాలను చిత్రించే కథలు. సంస్కృతి సాంప్రదాయాలను భాషా సొగసులను చిత్రించే కథల్లో గ్యారా కద్దు బారా కోత్వాల్, ఇజ్జత్, మొదలైనవి కథలు కళ్ళకు కట్టినట్లు రచించి పాఠకుల మనస్సులను చూరగొన్నారు.

జీవద్భాషకు మార్పు సహజం, మార్పు వల్ల భాషలో బహురూపత, వైవిధ్యం ఏర్పడుతాయి. ఈ బహురూపత 1. చారిత్రకం, 2. ప్రాంతీయం, 3. సాంఘీకం ప్రాంతీయం ఒకే కాలంలో ఒక ప్రాంతంలో ఉన్న వాడుకకు మరో ప్రాంతంలో ఉన్న వాడుకకు మధ్య సమాన శబ్దాల్లోనూ, వ్యాకరణ భాగాల్లోనూ తేడా ఉండవచ్చు. ఉదా : వచ్చినాడు, వచ్చిండు, వచ్చాడు, ఇలాంటి ప్రాంతీయ బేధాలు అని భద్రిరాజు కృష్ణమూర్తి (తెలుగు భాషా చరిత్ర, 1974, పుట : 388) తెలిపారు.

అనంతపురం, కర్నూలు, మహబూబ్ నగర్ మొదలైన మండలాల్లో పడమటి దిక్కున వ్యవహృతమౌతున్న తెలుగుపై కన్నడ భాషా ప్రభావం కన్పిస్తుంది.

ఉదా :

| | | |
|---|---|---|
| ఉద్దులు | – | మినుములు, |
| గోడంచి | – | జీడిపప్పు |
| బాడుగ | – | అద్దె |
| బాలేపండు | – | అరటిపండు |
| మడక | – | నాగలి |

మొదలైన పదాలు చేరాయి అని బొడ్డుపల్లి పురుషోత్తం 'భాషాశాస్త్ర పరిచయం' తెలియజేశారు.

వ్యవసాయ సంబంధమైన మాండలీక పదాలు కొన్ని కథల్లో ఈవిధంగా ఉన్నాయి. అట్టవ అంటే ఇళ్ళు పైకప్పుల్లో వేలాడదీసే వెదురు తడక. ఉదాహరణ గొలిగాడు అట్టవ మీద తట్టనెత్తుకు పోయాడు. అంకె వేసుకోవడం అంటే కాడిమాను కిందనుంచీ ఎడ్లు తప్పుకోవడం. దీన్నే మొరాయించడం అని కూడా అంటారు. రేగడి మెట్ట కథలో రచయిత దీన్ని ప్రయోగించారు. ఉల్లారి దీన్నే దోగారి అని గూడా అంటారు. ఉల్లారి అంటే కలుపుతీసే పరికరం. కరువు కథలో రచయిత ఈ ప్రయోగం చేశారు.

జల్ల అంటే వెదురు లేదా ఈత దబ్బలతో చేసే పెద్ద గంప. ఈ ప్రయోగం కూడా విశ్వనాథ రెడ్డి 'వానకురిస్తే' కథలో తెలియజేశాడు. మేడితోక దీన్నే మేడి అని, తెలంగాణలో పాలె అని కోస్తాంధ్రలో మేడి అని పిలుస్తారు. చలక అనే ప్రయోగం రాయలసీమలో ఉంటే, తెలంగాణలో చెలుక అని ప్రయోగం వ్యాప్తంలో ఉంది కళింగాంధ్రలో వరపు అంటే కరువు. ఈ పదప్రయోగం రాయలసీమలో ఉంది.

**ధ్వనుల మార్పు**

రైతు కథల్లో పదాంత ముకారాన్ని పూర్ణబిందువుగా రాయడం

అందరం – అందరము,

ఆయాసం–ఆయాసము *(బోరుపొక్కులు)*

జొరం– జ్వరము, సెద్ది – సేద్యము *(దేవరెడ్డు)*

ఉద్దొగం – ఉద్యోగం *(పొలిమేర దాటెల్లి పోయింది)*

**పదాది ఇ/ఈ ని యి/యీ గా రాయడం :**

యిప్పుడు – ఇప్పుడు, యివ్వకుండా – ఇవ్వకుండా,

యిచ్చేస్తాడు – ఇచ్చేస్తాడు *(బతుకు)*

యిరవై – ఇరవై, యిల్లేదుకునే – ఇల్లీదుకునే *(పగలూరేయి శ్రమపడ్తున్న)*

యింతకు – ఇంతకు *(దొంగబర్రెగొడ్లు)*

**పదాది ఇ కార లోపం :**

ఇలువ – విలువ *(వఱపు)*

**పదాది 'ఉ' కారాన్ని 'వు' గా రాయడం :**

వుద్యోగం – ఉద్యోగం వుదయం – ఉదయం *(వానకురిస్తే)*

వుక్కు – ఉక్కు *(ఎండమావులు)*

**పదాది 'వ' కారాన్ని 'వొ' గా రాయడం :**

వొటింట్లో – వంటింట్లో *(స్టేటస్ సింబల్)*

వొణికియ్యక – వనికియ్యక *(వ్యక్తిగతం)*

**పదాది వకార లోపం :**

ఏరుశనగ – వేరుశనగ ఏసినాం – వేసినాం *(బతుకు)*

ఎగుసాయం – వ్యవసాయం *(పగలురేయి శ్రమపడుతున్న)*

**ధ్వన్యనుకరణ శబ్దాలు :**

టక్ టక్ *(ఊబి)* హాలో హాలో *(భూమి దుఃఖం)*

టాం టాం *(జెబులోడు)*

ఉష్పో ఉష్పో *(పగలు రేయి శ్రమపడ్తూ),*

రయ్ రయ్, *(చింతల తోపు)*

**అన్య దేశ్యాలు :**

అన్యదేశ్యపదాలు కథల్లో విడదీయలేనంతగా పెనవేసుకున్నాయి. మచ్చుకు కొన్ని.

**ఉర్దూ పదాలు :**

బందుజేసి, సమజైతలేదు, కచ్చీరు, యికమత్, *(బోరుపొక్కులు)*

పర్యానా, ముబారక్, మఖ్మల్, నజరాన – *(గ్యారా కద్దూబారా కొత్వాల్)*

జమానత్, తప్వా, జల్ది, జమాకర్ – *(తల్లీకొడుకులు)*

**ఆంగ్ల పదాలు :**

టయానికి, గ్యారంటి – *(దేవరెడ్డు)*

ఎజెంటు, బ్యాంకు – *(స్టేటస్ సింబల్)*

మిషన్, ఫైవసీ, ఇంజక్షన్ – *మృత్యువుపువ్వు*

**జంటపదాలు :** ఒకేపదం ద్విరుక్తం చేసి చెప్పడం.

గుంపులు గుంపులు, కట్టలు కట్టలు – *భూమిదుఃఖం*

బుడి బుడి – పడి పడి – *పాడె*

రాక రాక లబలబ

విస విస – *ఊబి*

బర బర లచ లచ – *కయ్యకాలువ*

**సామెతలు :**

**తెలంగాణ సామెతలు :**

నరంలేని నాలుక నాన్నా విధాలన్నట్టు – *భూమి (అల్లం రాజయ్య)*

ఊరు పొమ్మంటుంది కాడు రమ్మంటుంది – *మత్యువుపువ్వు (పంజాల జగన్నాథం)*

**రాయలసీమ సామెతలు :**

మింగమెతుకు లేకున్నా ఎచ్చులకేం తక్కువ లేదు. – *కూరాక్కు సచ్చెటోన్నా (బత్తుల ప్రసాద్)*

పేదోడి కోపం పెదవికి చేటు – *(దృశ్యాలు మూడు ఒక ఆవిష్కరణ)*

**ఉత్తరాంధ్ర సామెతలు :**

ఇంత బతుకు బతికి యింటెనకాల సచ్చినట్టు – *తిరుగుడు గుమ్మి,*

కుంచమెల్లి అడ్డల దూర వలసిన రోజులొచ్చె – *గంటేడ గౌరు నాయుడు*

**<u>కోస్తాంధ్ర సామెతలు :</u>**

ఓడలు బళ్ళవుతయ్యి బళ్ళు వోడలు అవుతయ్యి – *ఊరు పొమ్మంది (మంచికంటి)*

దశమంతుడికి ఏవూరైతేనేం మహర్ధశె పట్టుంది *(గిట్టుబాట)*

మూలిగే నక్క మీద తాటిపండు పడ్డట్లు –*(పగలూరేయి శ్రమపడుతున్న)*

తాగినోడు తాళ్ళ పన్ను కట్టుకుంటడు – *పగలూ రేమి శ్రమ పడుతున్న*

వత్తి అంటించిన చిచ్చుబుడ్డిలా – *(భూమి దుఃఖం)*

అడకత్తెర్ల పోక తీరు – *(భస్మాసురహస్తం)*

నరం లేని నాలుక నానా విధాలన్నట్టు ”

చెప్పితే విననోన్ని సెడంగ సూడాలె –*(ఇగవీడు తొవ్వకు రాడు)*

సెగలేందే పొగ ఎట్లొస్తది”

కడుపులో కొక్కులు తోడినట్లు – *(వానరాలే)*

**<u>తెలంగాణ జాతీయాలు :</u>**

1. సుడిగాలిలో ఒట్టి కాగితపు ముక్కవలె – *భూమి దుఃఖం, (రామాచంద్రమౌళి)*

2. పురాగ నల్ల పూసాయినవ్ *భస్మాసురహస్తం (కాలువ మల్లయ్య)*

**<u>రాయలసీమ జాతీయాలు :</u>**

1. ఏట్లో పిసికిన చింత పండయ్యింది – *ఊబి (సింగమనేని నారాయణ)*

2. గుడ్డొచ్చి పిల్లనెక్కిరిస్తాది – *వానకురిస్తే (కేతు విశ్వనాథ రెడ్డి)*

**<u>ఉత్తరాంధ్ర జాతీయాలు :</u>**

1. పూలమ్మె చోట కట్టలమ్మ లేమంట – *బతికి చెడిన దేశం*

2. కల్లు తాగిన కోతిలా – *తిరుగుడు గుమ్మి (గంటెడ గౌరు నాయుడు)*

**<u>కోస్తాంధ్ర జాతీయాలు :</u>**

1. తల్లో నాలుకలాగ – *ఈరడింట్లో పెళ్ళి (అక్కినేని కుటుంబరావు)*

2. వడిలేని నీటిలో తెడ్డాడిస్తూ – *చిల్ల పెంకులు (పోలవరపు కోటేశ్వర రావు*

**<u>తెలంగాణ మాండలిక పదాలు :</u>**

సక్కగ – చక్కగ, గీదానికి – ఈ దానికి,

సాల్లేదా – చాలలేదా ***(మెట్ట భూమోడు)***

సదరుకొని – సర్దుకొని, తలాయిన్ని – కొంత కొంత, ***(బోరుపొక్కలు)***

నిచ్చంగ – నిజంగా, సూయించి – చూపించి ***(భూమి)***

**రాయలసీమ మాండలికాలు :**

ఏవురేగాని – ఎవరేకాని కసువు – గడ్డి, **(నెర్లు )**

బెడదలుండవు – గొడవలుండవు సద్దూరపు మనుషులు – చాలా దూరపు మనుషులు ***– దొంగబర్రె గొడ్లు***

**ఉత్తరాంధ్ర మాండలిక పదాలు:**

గుంటడు – మగవాడు, కిడాకి – చివరకి *(తిరుగుడు గుమ్మి,)*

వరపు – వానలేమి వొగ్గేసి – వదిలేసి *(వలపు)*

**కోస్తాంధ్ర మాండలికి పదాలు :**

మురుగు – మురికికొమార్తె – కుమార్తె (కూతురు) **– రావులయ్య**

తతిమ్మ – మిగతా గంట్లెట – గట్లవెంబడి

సివంచెలం – సింహాచలం **– నిరసన**

జానపద విజ్ఞానంలో ప్రధానంగా వ్యవసాయరంగంలో మనమే నాడు కోల్పోతున్న, కోల్పోయిన అమూల్యమైన పదజాలాన్ని తిరిగి కథకులు కథల్లో ప్రయోగించి కథకు జీవం పోసారు. ఇవన్నీ రాబోయె తరానికి మార్గదర్శనం చేస్తాయన్న విషయాన్ని కథకులు పాఠకులకు తెలియజేయడం జరిగింది.

**ముగింపు :**

రైతుకథల్లో రైతుకి పనిముట్లతో ఏవిధంగా సంబంధ బాంధవ్యాలున్నాయో వాటి గురించిన వివరాలను తెలియజేయడం జరిగింది. ఉదాహరణకు పనిముట్లు, వాటిని తెలంగాణ, ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో ఏవిధంగా ఏ పేర్లతో పిలుస్తారో వాటిని కూడా కథల్లో రచయితలు తెలియజేసిన వైనాలను విశదీకరించడం జరిగింది. అలాగే కథకులు తెలియజేసిన పారిభాషిక పదాలు, మాండలిక భాషా పదాలను ప్రధానంగా తెల్పడం జరిగింది. అలాగే ఈ రైతు కథల్లో రచయితలు వాడిన సామెతలు, పొడుపుకథలు, వీటితోపాటు మాండలిక పదాల్లో కథకులు ప్రయోగించిన తీరును ఈ వ్యాసంలో తెలియజేశాను.

**ఉపయుక్త గ్రంథసూచి :**

1.అశోక్ రెడ్డి, కె. పి. కథావలోకనం, పాలపిట్ట బుక్ మలక్‌పేట, హైద్రాబాద్, 2008.

2. కృష్ణమూర్తి, భద్రిరాజు, మాండలిక వృత్తి పదకోశం, ఆ.ప్ర. సాహిత్య అకాడమి, 1962.

3. కృష్ణమూర్తి, భద్రిరాజు, తెలుగు భాషా చరిత్ర, ఆ.ప్ర. సాహిత్య అకాడమి, 1979.

4. దక్షిణామూర్తి, పోరంకి, తెలుగు పదబంధ కోశం, తెలుగు అకాడమి, హైదరాబాద్, 2006.

5. నారాయణ సింగమనేని, కథావరణం, పెన్నేటి పబ్లికేషన్స్, కడప, 2013.

6. నాగరాజు, సాకం. రైతుకథలు(సం) గంథమనేని శివయ్య మెమోరియల్ సొసైటి, బైరాగిపట్టేడ, తిరుపతి, 2012

7. మల్లయ్య కాలువ, నూట పదేళ్ళ తెలుగు కథ – విభిన్న దోరణులు, తెలుగు అకాడమి, హైదరాబాద్, 2012

8. సుబ్బారెడ్డి.సి.వి, సామెతలు వివరణ, స్వీయప్రచురణ, హైదరాబాద్, 2016.

# ఆచార్య భూమయ్య గారి 'భౌమ మార్గ విమర్శ'

**అరుణ ధూళిపాళ,** ఫోన్ : 87123 42323

కవిత్వం ఒక సృజనాత్మక ప్రక్రియ. తన అనుభవాన్ని వ్యక్తీకరిస్తూ, పాఠకులకు అనుభూతం చేయించే గొప్ప కళ. అంతరంగంలో స్పందించిన భావాన్ని అక్షర నర్తనం చేయించడంలో కవి ప్రతిభావ్యుత్పత్తులు ప్రతిబింబిస్తాయి. అలాంటి కవి కావ్యాన్ని నిర్మాణాత్మకమైన విమర్శ చేయడం సులువైన అంశం కాదు. కవి హృదయంలోకి తొంగి చూసి, కవి ఆలోచనలను ప్రతిఫలింపచేస్తూ కావ్యంలోని అంశాల గుణదోషాలను నిష్పక్షపాతంగా విశ్లేషించడం సద్విమర్శ అవుతుంది. ప్రసిద్ధ సాహితీ విమర్శకులు ఆచార్య చేకూరి రామారావుగారు విమర్శ కూడా సృజనాత్మకమే అంటారు.

అటువంటి విమర్శకులలో ఆచార్య అనుమాండ్ల భూమయ్య గారు వాసికెక్కినవారు. ఏ కావ్యాన్నయినా లోనారసి చూడడం ఆయన ప్రత్యేకత. ఎవరూ దర్శించని కోణాన్ని ఆయన లోచూపు దర్శిస్తుంది. అక్కడినుండే ఆయన విమర్శ ప్రారంభమవుతుంది. సాంప్రదాయాన్ని పాటిస్తూనే ఆధునిక కోణంలో కావ్యాన్ని ఆవిష్కరించడం ఆయన పాండిత్యానికి నిదర్శనం. ఆయన చేసిన పలు కావ్యవిమర్శలు ప్రముఖుల ప్రశంసాపాత్రమయ్యాయి. ఆయన విమర్శ పద్ధతులు రెండురకాలు.

1. భౌమమార్గ విమర్శ. 2. సైద్ధాంతిక విమర్శ

**1. భౌమమార్గ విమర్శ :** ఇది కేవలం భూమయ్యగారి విలక్షణమైన విమర్శ శైలి. ఆయన రాసిన "నాయనితో కాసేపు" రచనను చూసి చేకూరి రామారావు గారు దాన్ని "భౌమ మార్గం" అని నామకరణం చేశారు. అదే ఆయనను సాహితీ విమర్శకుల నుండి వేరు చేసి ఒక ప్రత్యేకతను ఆపాదించింది. దీనికి "Down to Earth Approach" అనే మరో అర్థం కూడా ఉంది. అదే భూమయ్య మార్గం.

**"భౌమమార్గం" సంభాషణాత్మక శైలీ విధానం.**

పురాణాల్లో, ప్రాచీన కావ్యాల్లో ఇలాంటి పద్ధతి మనకు కనిపిస్తుంది. పరీక్షిన్మహారాజుకు శుకమహర్షి భాగవత కథను చెప్పడం, మహారాజు అడిగిన సందేహాలను నివృత్తి చేయడం మనకు తెలిసిందే. కానీ భూమయ్యగారి మార్గం అలాంటిది కాదు. ఆయన దీంట్లో నవ్యతను సాధించారు. కావ్యంలోని అంశాన్ని ఉపాధ్యాయుడు విద్యార్థికి బోధించినట్లుగా ప్రశ్న జవాబు రెండూ తానై కావ్యానికి కొత్త సొబగులు అద్దుతారు. ఇది కష్టతరమైనది కూడా. విద్యార్థి స్థాయికి తగినట్టు విమర్శకుడు ఆ స్థాయిలోనే కవి ఉద్దేశ్యాన్ని ఉటంకిస్తూ, కవిత్వపు అందచందాలను, కావ్య పరిమళాలను, దాని ప్రయోజనాలను చెబుతూ కవి ఉదాత్తమైన మూర్తిమత్వాన్ని విశ్లేషించాలి. అది భూమయ్యగారికే సొంతం. అనితర సాధ్యం. ఆయన మార్గంలో వచ్చిన రచనల లోతులను పరిశీలిస్తే.......

**1. నాయనితో కాసేపు :**

నాయని సుబ్బారావు గారు గొప్ప భావ కవులైనప్పటికీ అప్పుడున్న కవులకు వచ్చిన పేరు రాకపోవడం చింతించాల్సిన విషయం. భూమయ్యగారికి పిహెచ్ డి విషయంలో కోవెల సుప్రసన్నాచార్య గారు సూచించిన పేర్లలో నాయని సుబ్బారావుగారి పేరు భూమయ్యగారు ఎంచుకోవడం ఆయనలోని నూతనాన్వేషణాసక్తికి తార్కాణం. అప్పటివరకూ ఎవరూ సుబ్బారావు గారి మీద పిహెచ్ డి చేయకపోవడం ఆయన ఆలోచనను బలోపేతం చేసింది.



నాయని సుబ్బారావు గారి శతజయంతి ఉత్సవాల సందర్భంగా వ్యాసం కాకుండా **"నాయనితో కాసేపు"** అనే పేరుతో ఆయన రచనలను విశ్లేషిస్తూ పుస్తకాన్ని రాయాలను కోవడం సుబ్బారావుగారి మీద భూమయ్య గారికున్న అత్యంత ఆదరణీయభావం.

నాయని గారి సౌభద్రుని ప్రణయయాత్ర, మాతృగీతాలు, వేదనావాసుదేవం, భాగ్యనగర కోకిల, విషాద మోహనం, జన్మభూమి కావ్యాలలోని భావుకతను ఇందులో వర్ణించారు. ''సౌభద్రుని ప్రణయయాత్ర"లో ప్రేయసిని ఆరాధించి, వియోగ దుఃఖాన్ని అనుభవించి, చివరకు ఇరువురి సంగమంలో పొందిన అనుభూతిని ఫలశ్రుతిగా రచించడం నాయని సుబ్బారావు భావుకతకు పరాకాష్ఠగా నిలుస్తుంది.

**"మత్పురానేక పుణ్య జన్మములు పండి/ ......పుడమికిన్ స్వర్గమున కొక్క ముడి రచించి"** అన్న పలుకులకు భూమయ్యగారు మురిసిపోయి దివ్యమైన ఆనందానుభూతి చెందారు.

అలాగే నాయని గారి తల్లి మరణించి నప్పుడు రాసుకున్న మాతృగీతాల్లో **"ఎవ్వడా నిర్దయస్వాంతు డెవడు.....తల్లి లేని బిడ్డల గావించి...మానసంపు టాసలన్నియు**

**నడుగంట గోసినాదు..**" అంటూ దుఃఖించిన సందర్భాన్ని తన దుఃఖంలా భావిస్తారు ఆచార్యవర్యులు.

**"విషాదమోహనం"**లో కన్నకొడుకు కాటి పాలైనప్పుడు,

**"సాహిత్య ప్రపంచ మందీ విషాద మోహనము......**

**నీ పేరు జగతి శాశ్వతమ్మై యుండు తండ్రి"** అని హృదయ విదారకంగా కన్నీటి వర్షాన్ని కురిపిస్తే చలించిపోయారు భూమయ్యగారు.

ఈ పుస్తకంలో నాయని సుబ్బారావుగారు రచించిన "జన్మభూమి" కావ్యంలో ఆయనకు మాతృభూమి అయిన 'పొదిలె' మీద ఉన్న మమకారంలో మనలను పరవశులను చేస్తారు భూమయ్య గారు. ఆ ఊరిలోని వృక్షరాజములు, దేవాలయాలు, వాటి చరిత్ర అద్భుతమైన భావకవిత్వమై నాయని గారి కలం నుండి రసగంగలా ఉద్భవించింది.

**"కరుణా కంథులు కన్నులై దమరువున్ కంజాతమున్....**

**దివ్య సుం,దర రూపమొ్మక దుద్భవించె జగదా నందమ్ముగా నచ్చటన్"** అని పొదిలె దివ్య సౌందర్య రూపాన్ని కవిత్వంగా మలిచిన సుబ్బారావుగారి కవిత్వ తపస్సు అసాధారణమైనది.

హైదరాబాదు నగరం లోని విశేషాలను తెలిపే "భాగ్యనగర కోకిల", తత్వాన్ని ప్రబోధించే "వేదనా వాసుదేవం" నిరుపమానమైన నాయని గారి కవితా సౌందర్యానికి గీటురాళ్లు. ఆ సుందరవనంలో విహరించి, పరవశించిన కవితా గంధర్వము భూమయ్యగారు.

**"చంద్ర సూర్యులు తారకా సముదయమ్ము/ పుడమియును నాకమును తక్కు భువనములును/ ప్రేమ సూత్రమ్మునం గ్రుచ్చి విశ్వకర్త/ గళమునం దాల్చు ముత్యాలు గావె తలప"** అన్న ప్రేమ సుధామూర్తి నాయని గారికి జోహారులు అర్పిస్తూ **"పరవశముపో రసజ్ఞ ప్రపంచమెల్ల. ప్రణయయాత్ర వశుడనైతి. వాసుదేవ వశు డనైతి. సమ్మోహనుడనైతి. మాతృగీత వశుడనైతి. జన్మభూమి వశు డనైతి"** అని సుబ్బారావుగారి కవిత్వ సంపదకు తాను ఎంతగా వశు లైనారో చెప్తూ ఆహా! పద్యం కదా ఇంత చేసిందని తన్మయత్వాన్ని అనుభవిస్తారు.

అభ్యుదయకవిగా పేరువడసిన శ్రీశ్రీ గారు "సౌభద్రుని ప్రణయయాత్ర చదవాలని తొందర" అన్నారంటే సుబ్బారావుగారి కవితా రవములు రసజ్ఞుల హృదయాలలో ఎంతలా మోగాయో అర్థం చేసుకోవచ్చు.

**2. ఆధునిక కవిత్వంలో దాంపత్యం :**

ఆచార్య భూమయ్యగారు ఏ రచన చేసినా అది వినూత్న పద్ధతిలో ఉండడం పరిపాటి. ఆయన కలం కదలడం అంటే ఒక నూతన ఆవిష్కరణకు శ్రీకారం చుట్టడమే. అలాగే మానవ సంబంధాలలో రూఢిగా ఉండే దాంపత్యాన్ని రుజువు చేయడం కొరకు ఈ కావ్యాన్ని రాశారనుకోవడం పొరపాటు. మునుపు వచ్చిన భావకవిత్వమంతా ప్రేయసీ ప్రియుల వియోగ సంయోగాలతో భావ కవిత్వ జగత్తులో మైమరపింప చేస్తుంది. అభ్యుదయ కవిత్వం శ్రామికవర్గ చెమటను తడి తడిగా తడుముతుంది. అంతకుముందు ఏ కావ్యంలోనైనా సందర్భానుసారంగా దాంపత్యపు విలువలు వర్ణించబడ్డాయి కానీ ప్రత్యేకంగా ఆ అంశాన్ని ఒక కావ్యంగా అవతరింపచేయడం భూమయ్య గారికే సాధ్యమయింది. కుటుంబానికి ఆధారమైన దంపతులు ఏ సమస్యనైనా కలిసి చర్చించుకుని సరియైన నిర్ణయం తీసుకుంటే ఆ కుటుంబంలో వెన్నెల విరుస్తుంది.

హృదయానుగతమైన స్త్రీ ఆలోచనలు, సూచనలు తప్పనిసరిగా అనుసరించ వలసినవని ఆయన అభిప్రాయం. **"ఆధునిక కవిత్వంలో దాంపత్యం"** కావ్యం రాయడానికి నాయని సుబ్బారావు గారు ఆయనకు ప్రేరణ. వారి "జన్మభూమి" కావ్యంలో లక్ష్మీదేవి హరి భక్తుడైన సంబురాయలను పరీక్షించడానికి శ్రీహరిని పురికొల్పిన సమయంలో ఇద్దరి మధ్య జరిగే సంభాషణ కవిగారి హృదయంలో కొత్త ఆలోచనా బీజాన్ని నాటింది.

అది కావ్యరచనకు నాంది పలికింది. ఆధునికమైన ఏ కావ్యాల్లో ఇటువంటి సందర్భాలున్నాయో వెలికి తీసి వాటిని మాలగా కూర్చారు భూమయ్య గారు. **"ఆధునిక కాలంలో దాంపత్యం"** ఆధునిక కవుల కావ్యాల్లో చిత్రించబడిన దాంపత్యపు అపురూప సన్నివేశాలను సుకుమారంగా, సున్నితంగా వర్ణించారు.

మనదేశంలో వివాహ వ్యవస్థ సర్వోన్నతమైనది. వేదమంత్రాల సాక్షిగా దంపతులు జీవితాన్ని ప్రారంభించే తొలి ఘట్టం. ఈ కావ్యంలో కవి కొన్ని కావ్యాలను ఉదాహరణలుగా తీసుకొని దాంపత్యంలో ప్రణయం, శృంగారంతో పాటు త్యాగం, ఉపదేశం, మంత్రిత్వం, ఆదర్శం లాంటి ఉదాత్తమైన ఎన్నో రూపాలను సాక్షాత్కరింపచేశారు. వీరి ప్రత్యేక శైలితో సాగిన ఈ కావ్యంలో పట్టపగలు వెంకట్రావు అనే వ్యక్తిని శ్రోతగా చేసి దాంపత్యాన్ని ముందుకు నడిపించారు.

బేతవోలు రామబ్రహ్మం గారు రచించిన "యశోధర"లో సిద్ధార్థుడు, యశోధరల ప్రణయాన్ని వర్ణిస్తూ, అంతటి అనురాగ మూర్తులైన వారి జీవితాలలో అనూహ్యంగా సిద్ధార్థుడు వైరాగ్యంతో సన్యాసాశ్రమాన్ని స్వీకరించడం యశోధర జీవన వృక్షానికి గొడ్డలివేటు అవుతుంది. **"మాంగల్య పవిత్ర గాథకు బరిష్కార మ్మిదేనా ప్రభూ"** అని దుఃఖిస్తుంది. అయినా భర్తతో తానూ వెళ్ళలేదు. కొడుకనే బంధం ఒకటి ఉంది. అందుకే సంతానం కోసం త్యాగమయి అయింది. ఇది లోకసహజంగా మనకు కనబడేదే.

కట్టమంచి వారి 'ముసలమ్మ' కూడా ఇటువంటి త్యాగజీవియే. కాకపోతే ఊరు కోసం భర్తను, పేగు తెంచుకొని పుట్టిన కొడుకును కూడా వదిలి ప్రాణాన్నే త్యాగం చేస్తుంది. ఇక్కడ అక్షరాలా ఆమె భర్త మాటను అనుసరిస్తుంది. ఆమెలోని మాటల చాతుర్యాన్ని వర్ణిస్తూ..."**జనులకు మేలొనరింపని/ తనువేలా? కాల్పదగదా?**

**తానొక్కండై/ తనవారలడల నేలా/ గున దలయెత్తి తిరుగ గూడు నరునకున్?"** అని భర్త చెప్పిన పద్యాలనే తిరిగి అప్పజెప్పి తన మాట నెగ్గించుకుంటుంది. స్వార్థరాహిత్యమైన స్త్రీగా, ఊరు క్షేమాన్ని కాంక్షించే పరోపకార పరాయణురాలిగా కట్టమంచివారు ఆమెను చిత్రించారు.

శంఖవరం రాఘవాచార్యుల గారి కావ్యం "విశ్వనాథ విజయం" కథా నాయకుడు విశ్వనాథనాయుడు. తండ్రి అయిన నాగమనాయుడు శ్రీకృష్ణదేవరాయల ఆజ్ఞను ఉల్లంఘించడంతో తండ్రి అని కూడా చూడకుండా అతడిని ఓడించి, బంధించి రాయలవారికి అప్పగిస్తాడు. అతని రాజభక్తికి, అన్యాయాన్ని సహించని గుణానికి మెచ్చి రాయలు రాజ్యాధికారాన్ని ఇస్తాడు. అలా ఆరు నెలల తర్వాత ఇంటికి తిరిగివచ్చిన భర్తకు అప్పటివరకు వియోగవేదన ననుభవించిన భార్య అమరసుఖాలను అందిస్తుంది. ఇందులో ప్రత్యేకత, వ్యతిరేకత ఎక్కడా మనకు కనిపించవు. సాధారణమైన విషయమే. ఒకవైపు నాగమ నాయుడు పశ్చాత్తాపంతో కృంగిపోతున్నాడు. కోడలుగా కుటుంబాన్ని సుఖశాంతులతో ఉండాలని ఆమె కాంక్షించింది. అందునా ఇప్పుడు ఆమె ఒక రాణి. అందుకే అటు కుటుంబ క్షేమం, రాజ్యసంక్షేమం కోసం భర్తను పురికొల్పేదిశగా ధర్మాలను బోధిస్తుంది. **"శ్వశుర పాదుల చిత్తశాంతికై శాంకర క్షీరాభిషేకమ్ము చేయవలయు"** అంటుంది. ఇంటిని దిద్దుకొని దేశాన్ని దిద్దుదామంటుంది. ఒక బాధ్యతాయుతమైన స్త్రీని ఆమె పాత్ర ద్వారా సమాజంలో నిలబెడతారు శంఖవరం వారు. సృష్టికి కారణమైన స్త్రీ, కుటుంబము, తద్వారా సమాజ పరిరక్షణలో ఎంతటి కర్తవ్య నిర్వహణ చేయగలదో ఈ పాత్ర నిరూపిస్తుంది.

"పెన్నేటి పాట"లో విద్వాన్ విశ్వం గారు నిరుపేదలైన రంగన్న, గంగమ్మల ప్రకృష్టమైన దాంపత్యాన్ని చిత్రించారు. సంపదలు, భోగభాగ్యాలు లేకున్నా ఒకరికొకరు ఆలంబనగా ఉండే అపురూప బంధం దాంపత్యం. ఇది విషయవికారాలకు సంబంధించినది కాదు. మనస్సులలోని అవ్యక్తానురాగం. గంగమ్మ మూర్ఛితురాలైనప్పుడు ప్రాణం పోతుందేమో అనుకున్న క్షణంలో రంగన్న కర స్పర్శ ఆమెలో సత్తువను కూర్చినట్లు వారి దాంపత్య జీవిత మాధుర్యాన్ని అలరింపచేస్తారు విశ్వం గారు.

డా. సి.నారాయణ రెడ్డి గారు "ఋతుచక్రం"అనే కావ్యంలో ఋతువుల వర్ణన చేస్తూనే పూలలోని దారం వలె తన దాంపత్య జీవితాన్నే చిత్రించారు. ప్రకృతిలో పరవశిస్తూనే అలకలు, కోపాలు, అనునయాలు, చిరునవ్వులు, తాపాల కలబోతగా దాంపత్యాన్ని అభివర్ణిస్తారు.

సినారె గారి మరో కావ్యం "కర్పూర వసంతరాయలు".. ఇందులో రాజనర్తకి పట్ల ఆకర్షితుడై వ్యామోహంలో పడిపోయిన చక్రవర్తిని, పట్టపురాణి వివేకంతో బయటకు రప్పించి రాజ్యక్షేమాన్ని కాపాడిన గొప్ప పాత్రను చిత్రీకరించారు. దానికోసం ఆమె ఎంతగా తపించిందో ఈ కావ్యం తెలుపుతుంది. భర్తను కాపాడుకోవడం భార్యగా ఆమె ధర్మం. దాన్ని పాటించి తద్వారా సామ్రాజ్యాన్ని కాపాడిన వ్యక్తిత్వం ఆమెలో దృశ్యమానమవుతుంది.

నాయని సుబ్బారావు గారి "సౌభద్రుని ప్రణయ యాత్ర" ఆయన జీవన దాంపత్య కావ్యమే. మేన మరదలితో పెళ్లి నిశ్చయం, వీగిపోవడం, తిరిగి మరదలితోనే పెళ్లి జరగడం అనే అంశంగా రచించిన కావ్యం. ఇందులో ప్రణయం, వియోగం రెండూ అద్భుత భావనా మకరందాలై కవి కలం నుండి జాలువారుతాయి. వియోగం, సంయోగం జంటగా ప్రేమామృతాలై వర్షిస్తాయి. **"ఈ వినూతన భావముల్ తావి లేని/ పువ్వులని**




**అంధలోకమ్ము నవ్వనిమ్ము/ నీ దృగంత ప్రణయరేఖ పాదులైన/ మధువు లూరించుబో నాడు హృదయమందు"**... అంటూ తమ భావజగత్తులో తాము తన్మయులవుతారు నాయని గారు.

విశ్వనాథ వారి "కిన్నెరసాని"...భర్తకు వలపు పూబోణి. అందమైన దంపతులు. కానీ అత్తగారు కేవలం సూటి పోటి మాటలే కాక ఆమె శీలాన్ని శంకించింది. ఏ స్త్రీకి అయినా అపనింద మోయడమంత భారం మరొకటి ఉండదు. అందుకే కిన్నెరసాని దుఃఖానికి అంతులేకుండా పోయింది. భర్తకు ఆమె అంటే ప్రాణం.

కానీ తల్లిని ఏమీ అనలేని నిస్సహాయత అతనిది.చేసేది లేక కిన్నెరసాని ఇంటి నుండి వెళ్ళిపోతుంది. భర్తపై ప్రేమ లేక కాదు. నిందలకు అడ్డు చెప్పనందుకు శిక్ష ఇది. ఆమె ఒక నీటి ప్రవాహంగా మారిపోతుంది. అతడు ఆమె వియోగాన్ని తట్టుకోలేక బండరాయిగా మారినాడు. ఇద్దరూ పశ్చాత్తాప తప్తులయ్యారు. తీవ్రదుఃఖంలో మునిగారు. అయినా ప్రయోజనం శూన్యమే కదా! కాపురంలో ఇద్దరూ ఎప్పటికప్పుడు మనసులు విప్పి మాట్లాడుకుంటే దూరాలు పెరగవని ఈ కావ్యం ద్వారా విశ్వనాథ వారి సందేశాన్ని మనకందిస్తారు భూమయ్యగారు.

గుఱ్ఱం జాషువా గారి "ముంతాజ్ మహల్" చిన్న కావ్యమైనా వాసిలో గణుతికెక్కింది. దాంపత్య ప్రణయంలో వారిని మించినవారు లేరన్నట్లు ఒకరికొకరు ఎదురాడని సహవాసం వారిది.

**"ఆ సతీ పతుల గాఢాశ్లేషముల నుండి/ జారిపోయిన నిమేషంబు లేదు/ ఆ దంపతులకు నాహ్లాదంబుగూర్చక/ తొలగిన వెన్నెల తునుక లేదు.........వారి కూర్మి పెంపు వలచి వర్ణన జేసి/ సుప్రసిద్ధి గనని సుకవి లేదు"** అంటారు జాషువా గారు.

ముంతాజ్, షాజహానుల ప్రేమాధిక్యతను కవులెందరో తమ కావ్యాల్లో ముద్రించుకున్నారు. అకస్మాత్తుగా రోగగ్రస్తమై ఆమె **"కలుషం బింతయులేని నీ మధుర ముగ్ధంబైన చిత్తంబు లోపల నిద్రింతు ననారతంబు"** అంటూ భర్త కౌగిలిలో మరణించింది. ఆయన రోదన మిన్నంటింది. అందుకే ఆమె స్మృతి చిహ్నంగా తాజ్ మహల్ కట్టించాడు. మరణం ప్రాణికి సహజమైనా స్మృతులు నిలిచే వుంటాయి శాశ్వతంగా.

భూమయ్య గారు ఈ విధంగా కావ్యాలలోని దాంపత్యాన్ని వివిధ దశలుగా విశదీకరించారు. కేవలం అది అనురాగ పురస్సరమైనదిగానే కాకుండా జీవితాన్ని పంచుకున్న దంపతులు ప్రేమతో పాటు బాధ్యతలు, బరువులు, కష్టాలు, కన్నీళ్లు, అన్నింటినీ పంచుకుంటూ సమాజ శ్రేయస్సుకు తోడ్పడాలనే సందేశాన్నిస్తారు.

### 3. కర్పూర వసంతరాయలు– కథా కళా ఝంకృతులు :

డా. సి. నారాయణరెడ్డి గారు రచించిన "కర్పూరవసంతరాయలు" కావ్యానికి ఎనలేని గౌరవ ప్రపత్తులు సమర్పించుకుంటూ భూమయ్యగారు రాసిన విమర్శ కావ్యమిది.

"కర్పూర వసంతరాయలు" అని బిరుదు పొందిన మహారాజు కుమారగిరిరెడ్డి. ప్రతి ఏడు జరిగే వసంతోత్సవ వేడుకల్లో 'లకుమ' అనే నర్తకిని చూసి ఆమె వ్యామోహంలో చిక్కుకుంటాడు. "రాజనర్తకి'ని చేసి ఆమె సమ్మోహనాస్త్రానికి వశుడై "వసంత రాజీయమ"నే కావ్యాన్ని రాసి ఆమెకు అంకితం ఇస్తాడు. రాజ్యాన్ని, ప్రజలను మరచిపోతాడు.

ప్రజల క్షేమంకోసం రాణి కంకణ బద్ధురాలయింది. లకుమ పాదాలపై వాలింది. ప్రాణమైనా ఇస్తాననన్న వాగ్దానం ఆమె నుండి గ్రహించింది. రాజ్యంలోని పరిస్థితులను వివరించి రాజ్యం కోసం, ప్రజల కోసం రాజును త్యాగం చేయమని కోరుతుంది. అంగీకరించిన లకుమ రాజు ముందు అభినయం చేస్తూ పిడి బాకుతో పొడుచుకుని రాజు ఒడిలో ప్రాణాలు వదులుతుంది. గొప్ప త్యాగధనురాలు ఆమె. మహారాణిగా ప్రజల క్షేమాన్ని అరసి ఒక రాజ నర్తకి పాదాలపై మోలిన ఉదాత్త పాత్ర ఒకవైపు, ప్రజల కోసం తాను ఎంతగానో ప్రేమించిన, తనను అంతగా ప్రేమించిన రాజునే త్యాగం చేసిన నర్తకి మరోవైపు..ఈ కావ్యానికి వన్నె తెచ్చారు. దారులు వేరైనా ప్రజా సంక్షేమమే వారి పరమావధిగా భావించారు.

ఇందులో కావ్యంలోని కథ, కవిత్వ విశేషాలను, సినారె గారి కావ్య సౌందర్యాన్ని అభివ్యక్తీకరించారు భూమయ్యగారు. రాజు లకుమ కోసం వసంతరాజీయమనే కావ్యాన్ని రాయడాన్ని విద్యార్థికి వివరించినట్టు చెబుతూ ఇదే సందర్భంలో సారంగు తమ్మయ రచించిన "వైజయంతీ విలాసం" గుర్తుకు తెచ్చుకుంటారు. ఇందులో విప్రనారాయణుడు అనే బ్రాహ్మణుడు దేవదేవి అనే వేశ్య సాంగత్యంలో తన నైష్ఠిక కర్మలను త్యజించిన విషయాన్ని చెబుతూ కుమారగిరిరెడ్డి రాసింది లకుమ కోసమే అయినప్పటికీ ఒక నాట్యశాస్త్ర గ్రంథంగా దానిని ఆవిష్కరించాడు. వ్యామోహితుడైనా అతనిలోని కళా ప్రియత్వం సర్వజన సామాన్యం కాదని నిరూపించుకున్నాడు.

ఆమెకు ఆ కావ్యాన్ని అంకితమిస్తూ "నీ వూదిన ఉపిరియే/ ఈ వసంత రాజీయము" అంటాడు

**"నీ సంగతి నా సుషుప్త/ వాసన లుద్బుద్ధమయ్యె / గాలి తాకిడికి వీణియ/ ఆలపించిన కైవడి"** ఇందులో ప్రస్ఫుటంగా ఆయనలో నిద్రాణమై యున్న కళాభినివేశము ఆమె వల్ల జాగృతమైంది. అంతే కాని అది ఆమె వల్ల లభించినది కాదు.

నారాయణరెడ్డి గారు కుమారగిరిరెడ్డి చరిత్ర చదువుతున్నప్పుడు "కర్పూర వసంతరాయలు" బిరుదాంకితుడని తెలిసి ముగ్ధుడైపోయి ఈ కావ్యం రాశారు. "సహస్ర మల్లికల సౌరభం" ఒక్కసారి వీచినట్లనిపించి ఆయనలోని కవిత్వ సృజనాత్మకత శక్తి సహస్ర ఫణములుగా విప్పుకొని కావ్యంగా అవతరించిందంటారు భూమయ్యగారు.

ఆమె ప్రణయంలో అతనికి కాలం తెలియడం లేదు. **"ఆమె కన్నులు విరిసి/ నంత సేపతడు పగ లనుకొనును/ ఆమె కన్నులు మోడ్చి /నపుడె రాతిరి యయ్యె ననుకొనును.....** ఈ మాటలకు భూమయ్య గారు సౌందర్యలహరి శ్లోకాన్ని జ్ఞాపకం తెచ్చుకుంటారు.

**"నిమిషో న్మేషాభ్యాం ప్రళయ ముదయం..... ధరణి ధర రాజన్య తనయే..."** పార్వతీ దేవి కనులు మూస్తే లోకానికి ప్రళయం. తెరిస్తే ఉదయం. వసంతరాయలకు లకుమను దేవతగా ఆరాధించాడు.

అలాగే లకుమ నాట్య ప్రదర్శనలో ఆమె రాజువైపు చూస్తూ హస్తముద్రల ద్వారా ఆయన పట్ల తనకున్న ఆరాధనా భావాన్ని తెలపడం, అది చూసిన వసంతరాయలు పులకాంకితుడవడాన్ని బట్టి నాట్యశాస్త్రంలోని ఆయన పాండిత్యం దృగ్గోచరమవుతుంది.

ఎఱ్ఱన నృసింహ పురాణంలో నరసింహావతార ఘట్టంలో "యోగి మనస్సరసీ పరిస్ఫుర ద్భోగ మరాళ నాథుడని వర్ణిస్తే, సినారె గారు వసంతరాయలు అహోబిల నరసింహుని దర్శించినపుడు "ముని మనస్సరోవర ఖేలన మరాళరాజమైన నరసింహుని'' అని స్తుతించడంలో ఎఱ్ఱన ప్రభావం సినారె గారి మీద ఉన్నట్లు అనేక తార్కాణాలు చూపుతారు.

మానవతావాది, రాజ్యసభ సభ్యులు అయిన నారాయణరెడ్డి గారు దేశ రక్షణ ప్రధాన లక్షణంగా యుద్ధాలు వద్దంటూ " వ్యష్టి కన్నను దేశ దృషియే గరిష్ఠ మని" సందేశం ఇచ్చారు. ఆయనకు శిష్యులైన భూమయ్యగారు ఈ కావ్యాన్ని ఆయనకు అంకితమిచ్చి గౌరవాన్ని చాటుకున్నారు. **(సశేషం)**

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 3  హైదరాబాద్ జనవరి : 2024

# భావి తరాలకు సాహితీ మార్గదర్శి 'గురజాడ'

**ఆచార్య ఎం. గోనానాయక్,** హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, ఫోన్ : 98490 93300



నవ్య సాహిత్యానికి, అభ్యుదయ సాహిత్యానికి నాంది పలికిన మహాకవి ఆధునిక యుగకర్త, నవయుగ వైతాళికుడు గురజాడ. ఆయన కవిగా, తత్త్వవేత్తగా, శాసస పరిశోధకునిగా, వకీలుగా, చరిత్రకారునిగా పత్రికా సంపాదకునిగా బహుముఖ ప్రజ్ఞాశాలి. తన కాలం నాటి కన్యాశుల్కం, బాల్య వివాహాలు, జాతి విభేదాలు, కృత్రిమ గ్రాంథిక భాషా రచనలు, సమాజంలో ఉన్న అవిద్య, అజ్ఞానము, సంస్కార విహీనత, మూఢ విశ్వాసాల వంటి దురాచారాలపై తన రచనాస్త్రాలను ప్రయోగించారు. గురజాడగారు సంస్కరణోద్యమ భావాల్ని ప్రజల దగ్గరకు తీసుకెళ్ళడానికి సాహిత్యాన్ని ఆధారంగా చేసుకున్నారు. అందుకే –

**"కొత్త తరానికి గురువెవరంటే**
**గురజాడే అని నేనంటాను"**


అని దాశరథి కృష్ణమాచార్య అన్న మాటలు అక్షర సత్యాలు నిజానికి సాహిత్యానికి, సమాజానికి, భాషకు గురజాడ చేసిన కృషి సదా చిరస్మరణీయమైనది. కందుకూరి, గురజాడ, గిడుగులను తెలుగు ప్రజల నవయుగవైతాళికులుగా చెప్పవచ్చు. కందుకూరి వీరేశలింగం పంతులు గారు ఆధునిక భావాలను తన రచనల ద్వారా ప్రచారం చేశారు. గిడుగు రామ్మూర్తిగారు భాషా సంస్కరణకు తమ జీవితాన్ని పూర్తిగా అంకితం చేశారు. అలాగే గురజాడ అప్పారావుగారు వ్యావహారిక భాషలో తన రచనల ద్వారా అభ్యుదయ భావాలను ప్రచారం చేశారు. అందుకే ఆరుద్రగారు **"ఆధునిక సాహిత్యంలో అభ్యుదయ భావాలు గురజాడ వచనంలోకి అంకురించాయి"** అని అన్నారు. వాడుక భాషలో రచనల ద్వారా గురజాడ సృష్టించిన సాహిత్యం అభ్యుదయ భావాలు ఆధునిక సాహితీకారులకు మార్గదర్శకంగా నిలిచాయి.


**వ్యావహారిక భాషవాదిగా గురజాడ**

**"కవుల యుక్తి విశేషమే కావ్యమగును**
**భాషయేదైనా నదియే కావచ్చుగాక"** అని రాజశేఖరుని సూక్తి.

గురజాడ అప్పారావుగారు వ్యావహారిక భాషోద్యమానికి తన రచనలను సాధనంగా చేసుకున్నారు. వాడుక భాష, గ్రాంథిక భాషోద్యమానికి ముందు చూసినట్లైతే 1906లో తెలుగు భాషారంగంలో మౌలికమైన మార్పులు జరగటానికి కారణభూతమైన సంఘటన ఒకటి జరిగింది. ఆ సంవత్సరం గంజాం, విశాఖపట్నం, గోదావరి జిల్లాల పాఠశాలలపై పరీక్షాధికారిగా జె.ఎ.ఏట్స్ అనే ఆంగ్లాధికారి నియమించబడ్డాడు. ఆయన తెలుగు నేర్చుకునేటప్పుడు మాట్లాడేభాషకు, రాసేభాషకు తేడాను గుర్తించి విశాఖపట్నం కాలేజి ప్రిన్సిపాల్ పి.టి. శ్రీనివాసయ్యంగార్‌ను ప్రశ్నించాడు. ఆయన వీరి ప్రశ్నలకు సమాధానం వెంటనే చెప్పలేక తన మిత్రులైన గురజాడ అప్పారావుగారిని విజయనగరంలోను, గిడుగు రామ్మూర్తిని పర్లాకిమిడిలోను కలుసుకొని ఈ విషయం చర్చించమన్నారు. అప్పారావుగారిని ఏట్స్ దొరా కలుసుకున్నారు. వ్యావహారిక, గ్రాంథికభాషల విభేదాలను అప్పారావుగారు 1892లోనే గుర్తించారు. సర్వజన సామాన్యమైన స్పష్టమైన భాషను ఆనందగజపతి ప్రోత్సహిస్తున్న రోజులలోనే అప్పారావుగారు నాటక రచనకు వాడుకభాష అన్ని విధాలా యోగ్యమైనదని విశ్వసించి 'కన్యాశుల్కాన్ని' వాడుక భాషలో రచించి మన్ననలు పొందారు. కావ్యశైలి వాడుక భాషకు దగ్గరగా ఉండాలన్న తమ వాదాన్ని ఏట్స్ దొరకు చెప్పారు. గురజాడ తరువాత వాడుకభాషకు ప్రాధాన్యతను కల్పిస్తు రచనలు చేశారు.

వ్యావహారిక భాషావాదము మొదలైన తొలి రోజుల్లో వ్యావహారిక భాషను గ్రాంథికవాదులు "గ్రామ్యము" అని పేరుపెట్టి దూషించేవారు. గిడుగు, గురజాడలను గ్రామ్యవాదులు అని నిరసించేవారు. జి.వి. అప్పారావు, జి.వి. రామ్మూర్తి అని పిలిచేవారు. ఈ పేర్లలో "జి" అంటే 'గ్రామ్యమనీ', 'వి' అంటే వాది అని గ్రాంథికవాదులు సభలలో హేళన చేసేవారు. అలాగే గురజాడ అప్పారావు, గిడుగు రామ్మూర్తి, పి.టి. శ్రీనివాసయ్యంగార్, జె.ఎ.ఏట్స్‌లను దుష్టచతుష్టయంగా పిలిచి విమర్శించేవారు. గ్రామ్యము, గ్రాంథిక భాష విభేదాలలో చిన్నపాటి కురుక్షేత్రమే జరిగేది. గురజాడవారు కన్యాశుల్కం రెండో కూర్పు పీఠికలో **"గ్రాంథిక భాషవాదులను ఉద్దేశించి గ్రాంథిక భాషను సంకెళ్ళు ప్రియంగా చూసుకునే వారిని పూజించనివ్వండి"** అని తమకు సజీవమైన తెలుగు భాషే కావాలన్నారు. ఒకరకంగా వాడుకభాషను వాంఛించే వారంతా ఏకము గండు, మీకు పోయేది గ్రాంథిక




సంకెళ్ళేతప్ప మరేంకావు అన్న భావాలను ఎలుగెత్తి చాటారు.

తరువాత కాలంలో గ్రామ్య, గ్రాంథికవాదుల మధ్య అనేక వాదోపవాదాలు జరిగాయి. గురజాడ వాడుకభాషలో తన రచనల ద్వారా తన తరవాత తరంలోని కవులందరికి ఒక కొత్త ఒరవడిని సృష్టించారు. నిజానికి మార్పు అనేది సహజ జీవన లక్షణం అది మనిషిని ఎంతగా వర్తిస్తుందో భాషకు అంతగానే వర్తిస్తుంది. ఇదే విషయాన్ని గురజాడ కన్యాశుల్కం మొదటి కూర్పులో **'సమర్థుడైన రచయితలు పూనుకోవాలి కానీ ఒక కొత్త మాండలికాన్ని సులభంగా నెలకొల్పవచ్చు'** అని అన్నారు. వాడుకభాష కోసం కృషి చేసిన గురజాడ పాతకొత్తల మేలు కలయికలో ఉత్తమ మార్గాలను పెంచుకున్నాడు. భాషను, సాహిత్యాన్ని సంస్కరించి రచనా విధానంలో నవ్యరీతుల్ని ప్రవేశపెట్టాడు.

**స్త్రీవాదిగా గురజాడ**

**"ఎక్కడైతే స్వేచ్ఛ హరించబడుతుందో అక్కడి నుంచి ఆ బంధనాలను విముక్తి చేసే ఉద్యమం ఆవర్భవిస్తుంది"** అనటానికి ఆధునిక కాలంలో వచ్చిన వివిధ సాహిత్య ఉద్యమాలు ఒక నిదర్శనం.

ఏ ఆధునిక రచయిత వ్యక్తిత్వానైనా పరిశీలించే సమయంలో స్త్రీల పట్ల ఆ రచయిత భావాలను కూడా విధిగా పరిగణనలోకి తీసుకోవలసి ఉంటుంది. స్త్రీకి శతాబ్దాల దాస్యం నుంచి విముక్తి లభించాలని క్రమ క్రమంగా పురుషునితో పాటుగా అన్ని రంగాలలో సమాన స్థానాన్ని పొందాలని హృదయ పూర్వకంగా కోరి రచయితలలో గురజాడ అప్పారావుగారు ముందుంటారు. అందుకే 'దిద్దుబాటు' కథలో **'భగవంతుని సృష్టిలో అతి విలువైన వస్తువు విద్య నేర్చిన స్త్రీయే'** అని పలికిస్తాడు.

వీరి రచనలలో స్త్రీ పాత్రలైన 'దిద్దుబాటు' కథానాయిక కమిలిని, మీ పేరేమిటి కథానాయిక నాంచారమ్మ, పూర్ణమ్మ, కన్యాశుల్కంలోని మధురవాణి, బుచ్చెమ్మ, మీనాక్షీ, పూటకూళ్ళమ్మ. అలాగే కొండుభట్టీయంలో మంజువాణి, సంస్కర్త హృదయంలోని సరళ, ముత్యాల సరాలు, కథలలోను గల స్త్రీ పాత్రలు వేటికవే ప్రత్యేకమైనవి, గొప్ప వ్యక్తిత్వంతో కూడినవి. స్త్రీలు తమపై జరిగే అన్ని విధాలైన దోపిడిని చైతన్యవంతంగా ఎదిరించి పోరాడాలని ఆయన తన రచనల ద్వారా ప్రబోధించాడు. వీటికి దోపిడి స్పృహ నుండి పోరాట చైత్యనం దాకా విస్తరించి ఉన్న ఈ సాహిత్యంలో వ్యక్తిగతంగా పురుషాధిపత్యాన్ని వ్యతిరేకించే ధోరణి నుండి వ్యవస్థాగతమైన రాజకీయాలలో సంఘర్షించే వరకు స్త్రీ వాదులు లింగ సమానత్వం (Gender equality) కోసం చేస్తున్న పోరాటాలను గురజాడ వారు. నిజానికి కవి, తత్త్వవేత్త, తమ కాలం కంటే ముందుంటారు అనటానికి ఇది ఒక నిదర్శనం.

'ఆధునిక మహిళలు మానవ చరిత్రను తిరిగి రచిస్తారు' అనటానికి నేటి కాలంలో వస్తున్న లింగ సమానత్వ (Gender equality) మార్పులు కూడ సూచిస్తున్నాయనటంలో సందేహం లేదు.

**సామాజిక చైతన్యవాదిగా గురజాడ**

రచయితలు ఆలోచనాపరులుగా తాత్త్వికులు అయ్యేకొద్దీ లేదా రచయితలుగా ఉన్న తమపాత్ర ప్రచారకులుగా గురుతరమైందని గుర్తించే కొద్ది వాళ్ళు దృష్టిలో కల్పన కన్నా కర్తవ్యానికి ప్రాధాన్యత నిస్తారు. గురజాడ కూడా సమాజంలో సామరస్యాన్ని పెంపొందించాలి సాహిత్యం మనిషి మనుగడని మహిమాన్వితం చేయాలి అనే లక్ష్యంతో రచనలు చేశారు.

**"మతములన్ని మాసిపోవును జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును"**

**"ఎల్లలోకములొక్కయిల్లై, వర్ణభేదములెల్ల కల్లై"** –అంటూ విశ్వకుటుంబ భావనను చాటాడు.

సాంఘిక సమస్యలు ప్రధాన ఇతివృత్తంగా గల రచనల్లో వ్యక్తికి అతడి చుట్టు ఉన్న సమాజానికి మధ్య జరిగే పోరాటం చోటు చేసుకుంటుంది. దీనిలో రచయిత జీవితానికి అతని రచనకు ఒక అవినాభావ సంబంధం ఉంటుంది. వారు స్పందించిన జీవితమే ప్రత్యక్షంగానో, పరోక్షంగానో వారి రచనల నిండా పరుచుకొని వుంటుంది. గురజాడ కూడ తన రచనలలో మూఢవిశ్వాసాలను, కన్యాశుల్కం, బాల్యవివాహాలు వంటి దురాచారాలను నిరసిస్తూ స్త్రీ చైతన్యాన్ని, భాషా సంస్కరణను, సమాజ చైతన్యాన్ని కాంక్షించారు.

కులమత సమస్యలను, సమాజంలో స్త్రీలను ఎదురౌతున్న సమస్యలను, మానవీయ విలువలను, ప్రగతిశీల భావాలను తన రచనలలో చిత్రించిన అభ్యుదయవాది. వాటి నిర్మూలనకు పాటుపడిన మహనీయుడు. నాటి సమాజంలో పేరుకుపోయిన నీచ సంస్కృతులను, బహుదేవతాస్తుతిని, మూఢాచారాలను, ఛాందస భావాలను, విగ్రహారాధనను ఖండించారు. **"మనిషి చేసిన రాయి రప్పకి మహిమ కలదని"** సాగి మొక్కె అజ్ఞానాన్ని తీవ్రంగా నిరసించాడు. అందుకే సాహిత్యంలో సంఘ సంస్కరణ విషయంలో సమాజానికి సాహిత్యానికి మధ్య వున్న సంబంధాన్ని గుర్తించడంలో,

సమాజంలో స్త్రీ స్థానాన్ని గుర్తించటంలో ఆర్థిక సాంఘిక దృక్పథంలో అన్నింటిలోనూ గురజాడది ముందు చూపు అనటంలో సందేహం లేదు.

గురజాడ వారు భాష, సమాజం, సాహిత్య దృష్టికోణాలతో చేసిన రచనలు నేటికి భవిష్యత్ తరాలకు సాహిత్య మార్గదర్శకాలుగా నిలిచాయి. ఆధునిక తెలుగు సాహిత్య వికాసానికి, భాష, సంఘసంస్కరణకు గురజాడ చేసిన కృషి ఎన్నటికి మరువలేనిది. గిడుగురామ్మూర్తిగారన్నట్లు "తెలుగు ప్రజల స్మృతిపథంలో అప్పారావు సదా జీవిస్తాడు. చనిపోయినప్పటికి అతను జీవిస్తున్నాడు..!"

**కాలంకంటే వేగంగా పయనించిన గురజాడ**

తెలుగు కథా సాహిత్యంలో గురజాడకు ప్రత్యేక స్థానం ఉంది. **"ప్రాచీన కాలంలో తిక్కన, మధ్యకాలంలో వేమన, ఆధునిక కాలంలో గురజాడ మహాకవులు"** అని శ్రీశ్రీ అంటాడు. దీనిని బట్టి సాహిత్యంలో ఆయనకు గల స్థానాన్ని మనం అర్థం చేసుకోవచ్చు. సామాజిక సమస్యలను వస్తువుగా తీసుకుని కథలను చక్కగా తీర్చిదిద్దారు. సంస్కరణోద్యమాన్ని బలోపేతం చేసేందుకు ఈ కథలు ఎంతగానో ఉపయోగపడతాయి.

విశ్వాసాలు, కులవైషమ్యాలు, మతభేదాలు, అజ్ఞానం ముఖ్యంగా స్త్రీలు ఎదుర్కొనే అన్యాయాలను, అక్రమాలను, వివక్షతలను వివిధ కోణాల్లో చక్కగా ఆవిష్కరించారు. సమాజాభివృద్ధి స్త్రీ చైతన్యంతోనే సాధ్యమని సందేశమిచ్చిన మహోన్నతమూర్తి గురజాడ. ఒక్కొక్క కథలో ఒక్కో సమస్య కథావస్తువుగా తీసుకొని చిత్రికరించారు. కథానికాంశాల్లో సామాజిక వాస్తవికత అవశ్యకతని స్పష్టీకరిస్తూ వీరు రాసిన కథానికలు కథకులకు మార్గనిర్దేశం చేశాయి. వీరు రచించిన కథలలో దిద్దుబాటు, మీ పేరేమిటి, మెటిల్డా, పెద్దమసీదు, సంస్కర్తహృదయం, మతం–విమతం, కొండుభట్టీయం, బిల్హణీయం. కథలు వేటికవే ప్రత్యేకమైనవి. వీరి కాలంలో వేశ్యసమస్య ప్రధానమైనది. అందుకే వేశ్యా ఇతివృత్తంతో రచనలు చేసి వేశ్యకు సాహిత్యంలో ప్రముఖ స్థానం కల్పించాయి.

వీరి దిద్దుబాటు కథలను గురించి మధురాంతకం రాజారాంగారు "తెలుగులో పద్యవిద్యకు వాగనుశాసనుడెలాగో కథాసాహిత్యానికి గురజాడ వారధి అన్నది పెద్దలందరూ ఒప్పుకొన్న మాట. మంత్రం ఉచ్చరించగానే తెరుచుకున్నా మాయకవాటంలా, గోపాలరావు "తలుపు తలుపు" అనగానే తెరుచుకున్నది. అతని ఇంటి తలుపులు మాత్రమే కాదు కథాసాహిత్య జగత్తు తలుపులు కూడా" అంటారు.

**భాషా పరిరక్షకుడిగా గురజాడ**

ఉద్యమాలు జాగృతం చేసిన చైతన్యం వల్ల కొన్ని విలువలు స్థిరమవుతాయి. అవి తరువాత వచ్చేవాళ్ళకి పునాది పీఠాన్ని అందిస్తాయి. ఈ విషయంలో గురజాడ తరువాత తరానికి అందించిన పునాది భాష. విజయనగర సంస్థాన అధిపతి అభినవభోజుడు




ఆనందగజపతి రాజుగారు తన సంస్థానంలో సహజమైన గ్రామ్యభాషను ప్రోత్సహించేవారు. విజయనగర మహారాజు కొలువులో పని చేసిన గురజాడ వారిలో కూడా ఆదే భావాలు చోటుచేసుకున్నాయి. ఒకరిది ప్రేరణ, మరొకరిది ఆచరణ. ప్రాచీన కాలాన్ని చూస్తే దేశంలో వర్ణవ్యవస్థ మూలభూతంగా ఉండేది. దాన్ని కాపాడటం రాజుల కర్తవ్యంగా ఉండేది. భారతాంధ్రీకరణకి కూడా ఈ ధర్మరక్షణ ఒక కారణం అని అంటారు. అలాగే బాల్యవివాహాలు, సతీసహగమనం సమస్యలాంటివి ఆచారాల్లో ఉండేవి. అందుకే గురజాడ **"మంచి గతమున కొంచెమేనోయ్ మందగించక ముందు కడుగేయ్"** అంటారు గురజాడ.

కాలపరిణామంలో తెలుగు సాహిత్యంలో అనేక పరిణామాలు చోటు చేసుకున్నాయి. సాంఘికంగా ఎన్నో మార్పులు వచ్చాయి. వీటి వలన జీవిత సకల పార్శ్వాలు ప్రభావితం అయ్యాయి. సాహిత్యపరంగా చూస్తే పోషకుల వినోదం కోసం గర్భకవిత్వాలు, బంధకవిత్వాలు, చిత్రకవిత్వాలు ప్రయోగాలు చొచ్చుకు వచ్చిన దశలోనే కవిత్వధాతువు లుప్తమైపోయింది.

ప్రజాసామాన్యం కోసం కవిత్వం అనే మాట అసలు వినిపించదు. అలాంటి నేపథ్యంలో సాంఘికంగా వచ్చిన మార్పులు అన్ని రంగాలను ప్రభావితం చేశాయి. సాంఘికంగా వచ్చిన మార్పుల వలనే సాహిత్యంలో పునర్వికాసం నూతన రీతుల్లో వెల్లివిరిసింది. వీటి ప్రభావం వలన రచనలలో వస్తువు, భాష, వ్యక్తీకరణ పద్ధతి, శైలి అన్ని మారాయి. గురజాడ కవిత్వంలో తెచ్చిన మార్పులు ముత్యాల సరాల రూపంలో క్రొమ్మెరుంగులు చిమ్మినాయి. అంతకు ముందు ఎన్నడూ లేనంతగా కవిత్వంలో మార్పు వచ్చింది. అలాగే భాషలో, భావంలో, ఛందస్సులో కూడా గురజాడ తరువాత తరానికి సాహితీ మార్గ నిర్దేశం చేశాడు. గురజాడ, సాహిత్యాన్ని అంతఃపురాల నుంచి బంధ, చిత్రరీతుల నుంచి ప్రజాహితం కోసం ప్రజాపరం చేశాడు. గురజాడ అందించిన ఛందస్సులో భాషా పరమైన సహజ నుడికారమే వుంటుంది. ఆ దృష్ట్యా చూస్తే గురజాడది తిరుగులేని ఆధునిక భాషా చైతన్యం.

**ఆధార గ్రంథాలు :** 1. గురజాడ రచనలన్నీ.

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 3  UGC Care List Approved Journal
హైదరాబాద్ జనవరి : 2024

## ఆదిత్య హృదయ మహిమ

**“ఆదిత్య హృదయం పుణ్యం సర్వశత్రు వినాశనమ్**
**జయావహం జపం నిత్యమక్షయం పరమం శివమ్”**


**సర్వ మఙ్గల మాఙ్గల్యం సర్వపాప ప్రణాశనమ్**
**చిన్తాశోక ప్రశమన మాయుర్వర్ధన ముత్తమమ్॥**

**2. సర్వశత్రు వినాశనమ్ :** సర్వశత్రువులను వినాశం పొందించేది. శత్రువు అంటే శాతనం చేసేవాడు. మనలను చంపటానికి అన్ని హంగులూ కూర్చుకొని సిద్ధంగా ఉన్నవాడు. పారమార్థిక జీవన యాత్రలో శత్రువులను లేకుండా చేసికోవటం ప్రథమ కర్తవ్యం. లేకపోతే వారు యాత్రను సుఖంగా సాగనివ్వరు. గమ్యానికి చేరుకో నివ్వరు. అందువలలనే గీతలో భగవంతుడు “జహి శత్రుం మహా బాహో! కామరూపం దురాసదమ్” ‘కామరూపుడూ, ఒక పట్టాన అణపరానివాడూ అయిన పగవానినని చంపి వెయ్యి’. ఇక్కడ అగస్త్యుల వారు కూడా మహాబాహో! అని సంబోధించడం ఆ దృష్టితోనే. సర్వ శత్రువులు అంటే బాహ్యవ్యక్తులతో పాటు అంతరంగ శత్రువులైన కామాదులు కూడా పరిగణనకు వస్తాయి. ఆదిత్యహృదయం అనే పేరుతో నేను నీకందిస్తున్న జ్ఞానపేటిక నీ సర్వశత్రువులను సంహరించి వేస్తుంది అని అగస్త్యుల అభిప్రాయం. అది ఎలా? ముందుగా శ్రీరాముని హృదయంలోని చింతను తొలగించి వేస్తుంది. దానితో అతడు కర్తవ్యం నిర్వహిస్తాడు. దానితో రావణసంహారం జరుగుతుంది. మానవజాతి పరంగా అది సర్వశంకలను తూర్పార బట్టి పురోగతికి తోడ్పడుతుంది. దానికి ప్రధానకారణం తత్త్వజ్ఞాన లబ్ధి. రావణుని కంటె బలవత్తరమైన కామశత్రువును నశింపజేస్తుంది.

**3. జయావహమ్ :** జయం కలిగిస్తుంది. శ్రీరామచంద్రునికి జయమంటే దేవభావాలకు గెలుపు చెప్పారు. దైవ సంపత్తును అసుర సంపత్తు చెడగొట్టటానికి ప్రయత్నిస్తుంది. కానీ ‘దైవ’ బలంతో దానిని గెలవాలి. ఆ గెలుపు తత్త్వజ్ఞానం వల్లనే కలుగుతుంది. ప్రకృతం అగస్త్యులవారు ఉపదేశిస్తున్న ఆదిత్య తత్త్వజ్ఞానం అసుర సంపదను రూపుమాపడం ద్వారా దైవసంపత్తును సమున్నత స్థానంలో నిలుపుతుంది. మానవుడు కర్తవ్య పరాఙ్ముఖుడయితే అది సంభవించదు. శ్రీరామచంద్రుణ్ణి కర్తవ్యానికి ఉన్ముఖంగా చేయడం అగస్త్యుల ఉద్దేశం. అయితే ఈ జయం కేవలం మానసిక పరితృప్తికి సంబంధించినది కాదు. జగత్తునకు యోగక్షేమాలు కలిగించేది.

(సశేషం) (ఆచార్య శలాక రఘునాథ శర్మగారి ‘ఆదిత్య హృదయం’ నుండి)

## సత్సంగం




### ధ్యానం

ధ్యానమంటే ఏమిటి? ధ్యానానికీ, ఏకాగ్రతకీ తేడా ఉంది. ఏకాగ్రతలో మనస్సుని ఏదో ఒకదానిపైనే కేంద్రీకరించటం జరుగుతుంది. మిగిలినవన్నీ ప్రక్కకు పోతాయి. అంటే ఏదో ఒక విషయం పైనే లగ్నమవటం అన్నమాట. మన పనులు చేసుకోవాలంటే ఏకాగ్రత అవసరం. ఏకాగ్రతంటే, ఎంతో తీవ్రంగా ఒకదానిపై శ్రద్ధ వహించడం. సంగీతం వినేప్పుడు ఒకోసారి కళ్ళు మూసుకుంటాం. ఆ అనుభూతికి ఏ దృశ్యమూ అంతరాయం కలిగించకుండా ఉండడానికి. అంటే మనం వినేదానిపై లగ్నమవాలని ప్రయత్నిస్తామన్నమాట. ఏకాగ్రత వల్ల ఇతర విషయాలని వదిలి ఏదో ఒక విషయం గురించి తీవ్రమైన ఎరుక కలుగుతుంది.

ధ్యానం ఆత్మవిచారం. దానివల్ల ఆత్మజ్ఞానం కలుగుతుంది. ఏకాగ్రతలో దేనినో అన్వేషిస్తాడు. ధ్యానంలో మనిషి తనని తాను అన్వేషించుకొంటాడు. దేనినీ వదలడు. ధ్యానం వల్ల మనల్ని మనం అర్థం చేసికోగలుగుతాం. ధ్యానంలో చిట్టచివరికి మనస్సు ఆత్మలో లీనమయిపోతుంది. ధ్యానమంటే భావాలనుంచి విముక్తి చెందటం, మనస్సు మౌనమవటం.

ఒక్కోసారి ధ్యానం చేసుకుందామని కూర్చున్నప్పుడు ఏవేవో రకరకాల ఆలోచనలు వస్తాయి. మనం ఎదురు చూస్తున్న శాంతి లభించడం లేదే అని చికాకుపడతాం. కాని, మన ఎరుకలేకుండానే ఏదో శాంతి మనల్ని ముంచివేస్తుంది. దానిని అట్లాగే ఉంచుకుందామని ప్రయత్నిస్తే, అంతర్ధానమవుతుంది. పిలువకుండా వస్తుంది. చెప్పకుండా పోతుంది!



శ్రీ భగవాన్‌ని ఎవరో అడిగారు, ధ్యానం చేయటానికి ప్రయత్నిస్తున్నప్పుడు అన్ని ఆలోచనలను ఎందుకు వస్తుంటాయని. వారు ‘నిజమే, ధ్యానంలో అన్ని రకాల తలపులూ వస్తుంటాయి. అది సహజమే. నీలో దాగి ఉన్నదంతా బయటకు వచ్చేస్తోందన్నమాట. అట్లా బయటకి రాకపోతే అవి ఎట్లా నశిస్తాయి?’ అన్నారు.

సుషుప్తిలో మనం మహదానందాన్ని అనుభవిస్తాం. మనస్సు ఆత్మలో విలీనమైన స్థితి అది. గాఢనిద్ర పట్టిన తర్వాతే మనకు ఎంతో హాయిగా ఉంటుంది. మంచి పరుపు మీద ఎనిమిది గంటలు పడుకున్నా మనస్సుకి విశ్రాంతి లేకపోతే ఈ హాయి ఉండదు. కేవలం శరీరానికే విశ్రాంతి కలుగుతుంది.

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 3 (33) హైదరాబాద్ జనవరి : 2024

# పౌరాణిక ప్రవచన భీష్మాచార్యుడు – మల్లాది చంద్రశేఖర శాస్త్రి

**ఎ. మారుతి,** తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 81421 41008

ఆధునికలలో చాగంటి, గరికపాటి మొదలైన వారికంటే ముందుతరం వారు కీ.శే. మల్లాది చంద్రశేఖర శాస్త్రి గారు. ప్రసారమాధ్యమాలు అంతగా లేనిరోజుల్లో, జ్ఞానధారని అందించడానికి నడుంకట్టిన విశిష్టవ్యక్తి. కథా రచయితలలోని నాటకీయ శిల్పం, స్టేజి డ్రామాస్థాయి కంచుకంఠం, ప్రాతిపదిక నుండి పరమార్థం వరకు భాషాజ్ఞానాది విశేషగ్రంథసమాచారం. ఆబాల గోపాలాన్ని మెప్పించే కొసమెరుపులు, చమక్కులు, చురుకలు, అంతకుమించిన వినయం వెరసి శాస్త్రిగారు.

ధర్మభూమి అయిన భారతదేశంలో ప్రతి పౌరుడి జీవితంలో ధర్మాచరణ అంతర్భాగం. మనిషి మనో వికల్పముల చేత ఆ ధర్మదృష్టి తప్పినప్పుడు శాస్త్రం, పురాణం, వేదం మొదలైన గ్రంథాలు మార్గదర్శనం చేస్తాయి. బాధ నుంచి విముక్తి చేస్తాయి. కొన్నిసార్లు కనువిప్పు కలిగిస్తాయి. మరికొన్నిసార్లు ఆనందాన్ని, ఉత్సాహాన్ని ఇస్తాయి. వీటన్నింటినీ జనుల దగ్గరికి తీసుకెళ్లాలి. అంటే వేదం మొదలుకొని పురాణాది గ్రంథములలో వ్యాస, వాల్మీకాదుల హృదయం తెలిసి ఉండాలి. పురాణమిత్యేవనసాధు సర్వం... అనే మాట విమర్శకులే అన్నప్పటికీ.. అందులోని సాధుత్వాన్ని సమాజ హితం కోసం ధర్మప్రచారం కోసం విరివిగా ఉపన్యాసాల రూపంలోనే చెబుతూ ఉండాలి. దానికోసం జీవితాన్ని త్యాగంచేశారు మల్లాది చంద్రశేఖర శాస్త్రి గారు. వారి వర్ధంతి సందర్భంగా వారి గురించి కొంత ముచ్చటించుకుందాం.

**1. అపోహలు తొలగించారు.**

సంస్కృత భాష అన్వయ క్రమాన్ని అనుసరించి పదాలలో ఉండే శ్లేషలతో మహాభారతంలో సుమారు 1000, చిక్కు శ్లోకాలు ఉండేవి.. వాటిలో అర్థం మార్మికంగా ఉండడంతో లోక వ్యవహారంలో వ్యతిరిక్త అర్థం స్థిరపడింది. అటువంటి వాటిలో, కర్ణరాయబారంలో 'షష్ఠేకాలే' –అనే మాటకు ఆరవకాలం అని కాకుండా ఆరవభర్తగా ద్రౌపది కోరుకున్నదని తప్పుడు అర్థం ప్రచారంలోకి తీసుకొచ్చారు. సత్య ప్రచారానికిగాను అతి అరుదుగా దొరికే దేవనాగరి ప్రతులను పరిశీలించి, పరిశోధించి స్పష్టమైన సమాచారాన్ని ఉపన్యాసం అనే మాధ్యమం ద్వారా లోకంలోకి చేరవేర్చారు శాస్త్రిగారు. శకుని కౌరవులమీద పెట్టుకున్న పగ, శశిరేఖ పరిణయం, తులాభారం... మొదలైనవి మూలంలో లేవనే స్పష్టత వీరి ద్వారానే వచ్చింది అనడంలో అతిశయోక్తి లేదు. హరికథల ద్వారా వచ్చిన అభూత కల్పనలు, రకరకాల సినిమాలో నాటకాలలో చేర్చిన అంశాలని సప్రమాణంగా స్పష్టం చేశారు.





**2. ఒరవడి**


మల్లాది వారి కంటే ముందు విశేషప్రజ్ఞ చూపిన ప్రవచనకారులు లేకపోలేరు. సుమారు ఆరు భాషలలో ఉండే రకరకాల సాహిత్య విశేషాలను, ఇటు వేదమంత్రాలను కలుపుతూ ఎన్నో శాస్త్రాలను కలగలుపుతూ అద్భుతమైన వాగ్ధారతో తిరుప్పావై మొదలైన ఉపన్యాసమిస్తూ ఆకాశవాణిలో ప్రసిద్ధుడైన వ్యక్తి ఒకరున్నారు. ఆయన **కె.వి. సంతాన గోపాల చారి**. తెలుగునాట అంతస్థాయిలో మరొక వ్యక్తి ఉన్నారు. పురాణ ప్రతీకలను అర్థం చేసుకోవడానికి నామవాచకాలు, సంఘటనలు వాటివాటి శబ్దవివేచన ద్వారా ప్రతీకలను వివరిస్తూ, సంస్కృతంలో తెలుగులో అనర్గళమైన సమాచారాన్ని ఆశువుగా వివరిస్తూ, వాడిన పదం వాడింది వాడినట్టు వాడకుండా వాడే జ్ఞాన సముద్రం, కాకినాడ నివాసి కీర్తిశేషులు **శ్రీభాష్యం అప్పలాచార్యులు**. వీరి ఉపన్యాసాలు కొన్ని అంతర్జాలంలో, యూట్యూబ్‌లో దొరుకుతున్నాయి. సుమారు వారి కాలంలో ప్రారంభమైనా తమదైన ఒరవడిని, విలక్షణతను ఏర్పరచుకొని ప్రవచన చక్రవర్తిగా నిలిచిపోయిన అపూర్వ జ్ఞానఖని మల్లాది చంద్రశేఖర శాస్త్రి గారు.

**3. కంచు కంఠం – ధర్మప్రచారం.**

విద్యుత్ దీపాలు లేని సమయాలలో కూడా ఊరూరా తాను స్వయంగా వెళ్లారు. ధార్మికనిష్ఠ ఎంత అవసరమో, మానవ సంబంధాలలో సామరస్యం ఎంత ముఖ్యమో ఆత్మజ్ఞానంతో సమానమని బోధిస్తారు. ఆయన గ్రంథంలో వినియోగించే గ్రాంథిక, గంభీరభాషని అవసరమైతేతప్ప వినియోగించరు. శ్రోతలు ఎక్కువగా గ్రామీణులయి ఉంటే, వారికి తెలిసిన వారికి నచ్చిన ఉపన్యాస



కథన పద్ధతిని కథాపద్ధతిలోకి మార్చుతారు. మామూలు విషయాన్ని అయినా ఎలా చెబితే నచ్చుతుందో ప్రవచనకర్తకి ఒక ఊహ ఉండాలి. చెప్పే విషయానికి నిడివి ఉండాలి. అది ఆ పరిమితకాలం లోనే పూర్తిఅవ్వాలి అంటే ఎంతో ప్రణాళిక ఉండాలి. వీటికి సంబంధించి శాస్త్రి గారు ఎంతో కృషి చేశారు. మహాభారతం మొదలైన వాటిల్లో ఒకే ధర్మం గురించి ఎక్కువసార్లు వచ్చినప్పుడు ఒక క్రమ పద్ధతిని పాటించి చెబితే శ్రోతకి ఎలా అర్థం అవుతుందో ఆయన గ్రహించేవారు. దానివల్ల శ్రోతకి మరింత జిజ్ఞాస ఏర్పరిచారు. ఒకచోట సన్నివేశానికి సందేహం, పూర్వసమాచారం, కథలో మరెక్కడైనా ఇదేవిషయంగా ఉన్న చర్చ ఉంటే ఆ సమాచారాన్ని కూడా అక్కడే గుర్తుచేసి, మళ్లీ కథలోకి రావడం విశేషం. కొన్ని వేదికల మీద మైక్ సహాయం లేకున్నా తన కంఠస్వరంతో ఆయన ఎక్కువమందికి వినిపించేలాగా చెప్పే ప్రయత్నం చేశారు. ఆయనది కంచుకంఠం. తొమ్మిది దశకాలు దాటినా ఆ కంచు కంఠాన్ని అలాగే నిలుపుకున్నారు. ఒక శబ్దానికి రకరకాలైన అర్థాలు ఉండవచ్చు. దానికి ధాతువు ప్రాతిపదిక స్థాయి నుండి అర్థం చేసుకోవాలి అని అంటే, సంస్కృత భాషమీద ఎంతో పట్టు ఉండాలి. ఇతర గ్రంథాలు పరామర్శగా తీసుకోవాలన్నా దేవనాగరిలో గ్రంథాలే మల్లాది వారి కాలంలో ఎక్కువగా ఉండేవి. అటువంటి ప్రామాణిక గ్రంథాలను మాత్రమే అనుసరిస్తూ, మూలాన్ని మాత్రమే గౌరవిస్తూ, మూలంలో ఉండే అర్థాన్ని చెడకుండా రాసిన ఇతర పద్యాలనే స్వీకరిస్తూ ఆశువుగా సందర్భసంబంధమైన మాటని, ఉపమానాన్ని, పద్యాన్ని, శ్లోకాన్ని రకరకాల శాస్త్రగ్రంథాల నుంచి స్వీకరిస్తూ ఆధునికులైన ఎంతోమంది ప్రవచనకారులకు ఆదర్శంగా నిలిచిన మహానుభావులు శ్రీ మల్లాది వారు.

### 4. సభారంజకత్వం

**ప్రథమం కళ్లుజాపటం చ ద్వితీయం కునుకురావటం**
**తృతీయం త్రుళ్ళిపడటం చ చతుర్థం చంపవాయడం**
**పంచమం పారిపోవటంచ పురాణం పంచలక్షణం..** ఇది ఆయనే రాసుకున్న పేరడీ శ్లోకం.. ఒకప్పుడు ఆధ్యాత్మిక ఉపన్యాసాలు ఖాళీగాఉండే వాళ్లకోసం, వృద్ధులకోసం, అందులోని వ్రతాలు పూజల వివరణల కోసం, పరిమితంమై ఉండేవి. కొందరు అమర్యాదగా కాళ్లు చాపుకొని వినేవాళ్లైతే, ఇంకొందరు నిద్రపోతూ, మరికొందరు తుళ్లుతూ కొందరు విసుక్కుంటూ, చాలామంది ప్రసాదంకోసం అన్నట్లు ఉండేవి. ఆగ్రంథాలలో ఉండే పునరుక్తులు పరిహరించక పోవడం ఒక కారణం. గ్రాంథిక భాషలో ఉండే “యొక్క, మరియు, అటువంటి, ఆ విధంగా” అనే పదాలను సరళీకృతం చేయకపోవడం మరొొకకారణం. సమకాలీన ఉపమానాలకు ఆధునిక ఉపమానాలతో సమన్వయం చేయకపోవడం. గంభీరమైన వేదాంతం కూడాతేలిక ఉదాహరణలతో అర్థం చేయించడానికి ప్రయత్నం అంతగా లేకపోవడం మొదలైనవి పూర్వపు ప్రవచనాలలో కద్దు.

### 5. ఇతర విశేషాలు

మల్లాది వారి కుటుంబం దత్తాత్రేయ సంప్రదాయాన్ని అనుసరించి ఉపాసిస్తారు. దత్తప్రార్థనతోనే మొదలుపెడతారాయన. వారి పూర్వీకుల్లో కొందరు యతి ధర్మాన్ని స్వీకరించారు. మల్లాది చంద్రశేఖర శాస్త్రి గారు **మహాభారత ధర్మ సూక్ష్మ దర్శనము, శ్రీ రామాయణ రహస్య దర్శిని, ధర్మ ప్రబోధం**.. మొదలైన గ్రంథాలను రచించి ప్రచురింప జేయించారు. మహాభారతం విషయంగా ద్రౌపది పంచభర్తృక, ఏకలవ్యుని బొటన వేలు కథ మొదలైన ఎన్నో విషయాలు కూలంకషంగా చర్చించారు. షోడశి అనే పేరుతో శేషేంద్ర గారు రాసిన రామాయణ విశేష వ్యాసగ్రంథం లాగా, చంద్రశేఖర శాస్త్రిగారు రాసిన రామాయణ రహస్యదర్శిని గ్రంథంలో ధర్మ విశేషాలతోపాటు ఎన్నో ప్రతీకలను చర్చించారు.

వేదాధ్యయనం చేసినప్పటికీ పురోహితాన్ని నమ్ముకోలేదు, జ్యోతిషాది గ్రంథాలు చదివినప్పటికీ దానిమీద ఆధారపడలేదు. జీవనభృతిని కేవల పురాణం మీదే నడిపి, నడిచారు శాస్త్రిగారు. తనవంటి మరెంతోమందికి స్ఫూర్తిదాయకంగా పురాణాన్ని ఒక కోర్స్‌గా నేర్చుకునే వాళ్లకు మార్గదర్శకులు అయ్యారు. తెలుగు వారికి సర్వదా పూజనీయులయ్యారు.

గ్రంథాంతరంగం 30

# షితాబుఖాను అను సీతాపతి రాజు

**శ్రీ ఘట్టమరాజు, బెంగుళూరు,** ఫోన్ : 9964082076

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణ సాహిత్య చరిత్రను అపూర్వంగా రాసే ప్రయత్నాలు కొంతమంది విద్వాంసులు చేశారు, ఇంకా కొనసాగిస్తుండటం కూడా ప్రశంసనీయం. కాని ప్రత్యేక తెలంగాణ సమగ్ర చరిత్ర నిర్మాణానికి ఏ సంస్థ కాని, వ్యక్తులు కాని శ్రీకారం చుట్టినట్లు కనపడక పోవడం చింతనీయం. అయితే నూరేళ్ల క్రితమే కొంతమంది మహనీయులు తెలంగాణ చరిత్రను తవ్వి తీసి, వెలుగు లోకి తెచ్చే సత్కార్యం తలపెట్టిన సూచనలు, శుభారంభాలు దృగ్గోచరం అవుతున్నాయి. కొమఱ్ఱాజు లక్ష్మణరావు, జయంతి రామయ్య పంతులు, శేషాద్రిరమణ కవులు, సురవరం ప్రతాపరెడ్డి, ఆదిరాజు వీరభద్రరావు, డా. మారేమండ రామారావు, డా. నేలటూరి వేంకట రమణయ్య, బి.ఎన్.శాస్త్రి, డా. పి.వి.పరబ్రహ్మశాస్త్రి మొదలైన హేమాహేమీలు తెలంగాణ చరిత్ర నిర్మాణానికి రాళ్లెత్తిన కృషీవలులే, ప్రాతః స్మరణీయులే.



ఘట్టమరాజు అశ్వత్థ నారాయణ

ఈ దిశలో హైదరాబాదులో స్థాపింపబడిన లక్ష్మణరాయ పరిశోధక మండలి చేసిన కృషి అవిస్మరణీయమైనదీ, అనుసరణీయమైన దీనూ. ప్రసిద్ధ పరిశోధకులైన కొమఱ్ఱాజు లక్ష్మణరావుగారి అడుగుజాడల్లో నడచి, తెలంగాణ చరిత్రలోని అజ్ఞాత అధ్యాయాల్ని వెలుగులోకి తెచ్చిన ఆదిరాజు వీరభద్ర రావుగారు షితాబుఖాను రాజు గురించి పరిశోధన వ్యాసాల్ని పత్రికల్లో ప్రచురించడమే కాకుండా వివిధ ప్రదేశాల్లో ఉపన్యాసాలు ఇచ్చి తెలంగాణీయుల్లో చారిత్రక స్పృహ జాగృతం చేయగలిగారు. కొమఱ్ఱాజు లక్ష్మణరాయ పరిశోధక మండలి ఆధ్వర్యంలో 'తెలంగాణ శాసనములు- రెండవ సంపుటము' అనే అమూల్య గ్రంథం ప్రచురించిన తర్వాత 1961లో 'షితాబుఖాను అను సీతాపతి రాజు' అనే విలువైన పుస్తకం వెలువరించారు. Shitabu khan alias seethapathy raju of Warangal అనే ఇంగ్లీషు నామాంతరం గల ఈ చారిత్రాత్మక పుస్తకానికి ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనంగారు విషయ ప్రధానమైన విశ్లేషణాత్మక భూమిక రాశారు. దీన్ని గ్రంథకర్త ఆదిరాజు వీరభద్రరావుగారు తమ పీఠికలో ఇలా పేర్కొన్నారు. **"ప్రకాశమానమైన ఈ యుపోద్ఘాతమునందు షితాబుఖాను చరిత్రమును పెక్కు దృక్కోణముల నుండి చర్చించి, సమకాలిక చరిత్రాంశములను క్రోడికరించి, సమన్వయ పరచి విషయమునకు వన్నె దెచ్చి యున్నారు."** (పేజి: xix) ఆచార్య ఖండవల్లి వారి 14 పేజీల ఈ సుదీర్ఘమైన ఆంగ్ల పీఠిక 'షితాబుఖాను అను సీతాపతి రాజు' పొత్తం పసిడికి పరిమళం అబ్బ చేసింది.

ఆదిరాజు వీరభద్రరావుగారి ఈ చరిత్రాత్మక కృతిలో పది ప్రకరణాలున్నాయి. 1. ప్రవేశిక 2. ఓరుగల్లు 3. శాసన పాఠము 4. చరిత్ర కారుల వ్రాతలు 5. కైఫియ్యతులు 6. ఆంధ్ర కావ్యములు 7. హిందువా? ముసల్మానా ? 8. ఇద్దరు షితాబుఖానులు 9. షితాబుఖాను హిందువే 10. ఉపసంహారము

ఆదిరాజు వీరభద్రరావు గారు ఈ పుస్తకం రాయడానికి కొమఱ్ఱాజు వారి రచనల్ని, ప్రఖ్యాత పురాతత్త్వ శాస్త్రవేత్త డా. హీరానందశాస్త్రి (ఈయన సుపుత్రుడే జ్ఞానపీఠ పురస్కార గ్రహీత హిందీ కవి అజ్ఞేయ) రచనల్ని, బ్రిగ్స్ రచించిన 'గింప్లెస్ ఆఫ్ ది నిజామ్స్ డొమినియన్, స్థానాపతి విశ్వనాథ నాయకుని 'రాయవాచకము', చరిగొండ ధర్మన్న కావ్యం 'చిత్రభారతము', కుమార ధూర్జటి కావ్యం 'కృష్ణరాయ విజయము', అద్దంకి గంగాధర కవి 'తపతీ సంవరణోపాఖ్యానము', శాసనాలు, కైఫియత్తులు మొదలైన వాటిని లోతుగా అధ్యయనం చేసి 'షితాబుఖాను అను సీతాపతి రాజు' పరిశోధనా గ్రంథాన్ని వెలయించారు.

**మొదటి ప్రకరణం - ప్రవేశిక :** షితాబుఖానుగా పేరొందిన హిందూవీరుడు సీతాపతి రాజు జీవితం, సాధనల్ని వెలుగు లోకి తెచ్చిన మహానుభావుడు కొమఱ్ఱాజు లక్ష్మణరావు గారిని, పిమ్మట డా. హీరానంద శాస్త్రిగారిని ఆదిరాజు వారు ఈ ప్రకరణంలో పేర్కొన్నారు.

**రెండవ ప్రకరణం - ఓరుగల్లు :** ఇందులో గ్రంథకర్త ఓరుగల్లు, కాకతీయ రాజుల పాలన ఉత్థాన పతనాల్ని వివరించి, చిత్తాపఖాను ఉదంతం చెప్పారు. కాకతీయ వంశ చరిత్ర ప్రతాపరుద్రుని అస్తమయంతో దాదాపు ముగిసినట్లే అని, అతని వారసుల చరిత్ర చర్చనీయాంశమనీ చరిత్రకారుల అభిప్రాయాల్ని మనవి చేశారు. 1422లో కాకతి సామ్రాజ్యం బహమనీ సుల్తానుల వశమై ఆ సుల్తానుల ఆస్తి పంపకం జరిగిన తర్వాత ఓరుగల్లు నిజాం పాలకులైన కుతుబ్‌షాహి నవాబుల పాలయ్యింది. షితాబుఖాను వరంగల్లు ప్రాంతానికి అధిపతిగా, కుతుబ్‌షాహీ నవాబుల అధీనస్థుడిగా వుండి స్వతంత్ర పాలకుడయ్యాడు. ఇతని పాలనలో వరంగల్లు,

ఖమ్మంమెట్టు, బెల్లంకొండ, మొదలైన ప్రదేశాలుండేవి. ఓరుగల్లు కోటలో 'షితాబుఖాన్ దర్బారు హాలు', పాకాల చెరువు దగ్గర 'షితాబు ఖాన్ చబుతరా' (అరుగు) నిర్మింపబడటం వల్ల, షితాబుఖన్ ఓరుగల్లు సరదారుగానో, రాజుగానో వుండి వచ్చునని ఆదిరాజుగారు వూహించడం సబబుగానే వుంది. షితాబుఖాను వరంగల్లు జయించిన తర్వాత 1504లో కోటలో వేయించిన శిలాశాసనం అతని బలపరాక్రమాల్ని గొప్పగా చాటుతుంది.

**మూడవ ప్రకరణం – శాసనపాఠం :** గ్రంథకర్త ఈ శాసన సంస్కృత పాఠాన్ని, తెలుగు అనువాదం సహా ఇచ్చి, సీతాపతి రాజు వివరాలు పాఠకులకు తెలియ చేశారు. ఇతను గౌరాంబ, మానయల కుమారుడు. ఇతనికి దేవాంబిక ద్వారా అవధూత ఖాను, రెండవ భార్య అనుమాంబ ద్వారా అమరుడు, భోగి, రాముడు అనే ముగ్గురు కొడుకులున్నట్లు ఈ శాసనం తెలుపుతుంది. ఈ శాసనాన్ని సంస్కృత శ్లోక రూపంలో రచించిన మాధవుడనే బ్రాహ్మణుడు చిత్తాపఖాను తురుష్కులు నాశనం చేసిన ఓరుగల్లును పునఃస్థాపితం కావించిన వీరైక చూడామణి' అని పేర్కొన్నాడు. ఈ శాసనం 1504 ప్రతిష్ఠింపబడింది. వరంగల్లు కోట శాసనం వల్ల షితాబుఖాను జీవితం వివరాలు ఎన్నో తెలిశాయని చెప్పొచ్చు.

**నాల్గవ ప్రకరణం – చరిత్రకారుల వ్రాతలు :** ఈ అధ్యాయంలో గ్రంథకర్త తాము పరిశీలించిన డా. హీరానంద శాస్త్రి, బ్రిగ్స్ మొదలైన చరిత్రకారుల రచనల్ని చదివి షితాబుఖాను చరిత్ర శకలాల్ని క్రోడీకరించారు. 'తారీఖీ మహమ్మద్ కుతుబ్ షాహి' పర్షియన్ గ్రంథాన్ని ఇంగ్లీషులోకి అనువదించిన బ్రిగ్స్ గ్రంథం నుంచి వీరభద్రరావు గారు విషయ సేకరణ చేశారు.

షితాబుఖాను ఖమ్మం మెట్టు, బెల్లంకొండ, ఓరుగల్లు గిరి దుర్గాధిపతి. ఇతని వద్ద పన్నెండు వేల పదాతి దళం వుండేది. ఈ సైనికులు విలువిద్యా ప్రవీణులు. ఖడ్గ విద్యా నిపుణులు కూడా. సుల్తాను కులీకుతుబ్‌షా (1512–43)తో జరిగిన ఘోర యుద్ధంలో సీతాపతిరాజు సేనలు వీరోచితంగా పోరాడినా ఓడిపొయ్యాయి. రాజుగారి అపార సంపద. యుద్ధ సామగ్రి సుల్తాన్ వశమయ్యింది. ఖమ్మంమెట్టు వద్ద జరిగిన మరో సంగ్రామంలో కూడా షితాబుఖాన్, అతనికి తోడ్పడిన సమీప పాలకులు పరాజయం చవి చూశారు. షితాబుఖాను కళింగరాజు రామచంద్ర దేవ గజపతి సహాయం అర్థించగా, అతను మూడు లక్షల కాల్బలం. ముప్పైవేల అశ్వికులతో కొండపల్లి వద్ద యుద్ధ భేరీ మోగించాడు ఆ భీకర యుద్ధంలో కూడా కులీకుతుబ్ షానే విజయలక్ష్మి వరించింది. సుల్తాను – షితాబుఖానుల మధ్య సంధి కుదిరింది.

**ఐదవ ప్రకరణం – కైఫియ్యతులు :** కిమ్మూరు కైఫియత్తు లభించక పోవడంవల్ల ఆదిరాజు వీరభద్రరావు గారు సర్కారు వారి శాసన గ్రంథం ఇంగ్లీషు ప్రతి నుండి షితాబుఖాను వృత్తాంతం గ్రహించారు. ఇతను బోయకులానికి చెందినవాడు. కిమ్మూరికి దగ్గరగా వున్న రాజపూడి గ్రామనివాసి. అవసరాల పెద్దిరాజనే నియోగి బ్రాహ్మణుని పసులు కాచే ఉద్యోగంలో చేరాడు సీతడు. అతని చురుకుదనం గమనించి, అతనికి విలువిద్య నేర్పించి గోలకొండ సుల్తాను సైన్యంలో చేర్పించాడు. సీతడు త్వరలోనే శౌర్య ధైర్యాలు ప్రకటించి, సుల్తాను మెప్పు పొంది, జగ్గంపేట, పొదిలి కొండ కోయలను జయించి, సైన్యాధికారియై రాజపూడి అరణ్య ప్రాంతంలో రాతికోట కట్టుకొని అధిపతి అయ్యాడు. సీతడు చితాపుఖాను బిరుదుతో అలంకరింప బడ్డాడు. తనకు విద్యాబుద్ధులు నేర్పించిన అవసరాల పెద్దరాజును దివానుగా నియమించుకుని విరాజిల్లాడు. షితాబుఖాను కూతురు అప్పలమ్మ పెద్దిరాజును ప్రేమించి విఫలురాలై చాడీలు చెప్పగా, అతను నిరపరాధియని చెప్పి. రాజు ముందరే తన కళ్లు పొడుచుకొని నిజం నిలకడ మీద తెలుస్తుందని చెప్పి వెళ్లి పొయ్యాడు. తర్వాత పెద్దిరాజు ప్రతీకార వాంఛతో రగిలి రగిలి రాజమహేంద్రవరం వెళ్ళి అక్కడి సేనాపతీ అలీకులీఖానుతో చేతులు కలిపి రాజపూడికి వెళ్ళి పెద్ద సైన్యంతో షితాబుఖానుతో యుద్ధం చేసి తాటపల్లి లొద్ది వద్ద చంపివేశాడు. ఏకాశిలానగరము కైఫియత్తు షితాబుఖానును హిందూద్వేషిగా, కాకతీయ రాజుల శత్రువుగా పేర్కొనింది.

**ఆరవ ప్రకరణము – ఆంధ్ర కావ్యములు :** చరిగొండ ధర్మన్న రచించిన 'చిత్రభారతము' చితాపుఖాను శౌర్యపరాక్రమాల్ని వర్ణించే కావ్యం. **"…….అంగనా పంచబాణు దతుల ధైర్యాభిభూత హిమాచలుండు– మాన భూపాల చిత్తాంబుఖాన ఘనుడు"** గా (పేజి: 36) ధర్మన్న కవిచంద్రుడు. చిత్తాపుఖాను ప్రచండ సూర్యుణ్ణి ప్రశంసించాడు. అద్దంకి గంగాధరకవి 'తపతీ సంవరణోపాఖ్యానము' లో షితాబుఖాను గురించి ప్రస్తావించాడు. కుమార ధూర్జటి 'కృష్ణరాయ విజయము' కావ్యంలో చితాపుఖాను అరవై వేల సైనికులతో శ్రీకృష్ణదేవరాయలతో 1515–16 పోరాడినట్లు చెప్పబడింది. స్థానాపతి విశ్వనాథనాయకుని వచన గ్రంథం 'రాయవాచకము'లో కూడా ఈ యుద్ధ ప్రస్తావన కనపడుతుంది.

**ఏడవ ప్రకరణం – షితాబుఖాను హిందువూ? ముసల్మానా? :** అను విషయం చర్చించబడింది. శాసనాల, కైఫియత్తుల, ముస్లిం చరిత్రకారుల అభిప్రాయానుసారం షితాబుఖాను పుట్టుకతో హిందువే అని ప్రసిద్ధ చరిత్రకారుడు డా. హీరానందశాస్త్రి నిర్ధారించారు. ఆదిరాజు వీరభద్రరావుగారు కూడా ఈ అభిమతంతో ఏకీభవించారు.

**ఎనిమిదవ ప్రకరణం – ఇద్దరు షితాబుఖాను :** చరిత్రలో ఇద్దరు షితాబుఖానులు కపడుతున్నారనీ, చిత్తాపుఖానుగా ప్రసిద్ధి కెక్కిన వీరుడు సీతడు. సీతాపతి రాజుగా పేరు గల వ్యక్తి 1450–1520 మధ్య కాలంలో వెలసిన వ్యక్తి అనీ, మూడవ షంషుద్దీన్ అహమద్ ఇతని శౌర్య సాహసాలకు మెచ్చి, ఇతనికి 'ఖాను' అనే


బిరుదాన్నిచ్చాడని చరిత్ర కారులు చెప్పుచున్నారు. ఇతను జన్మతః హిందువే అనీ. ఓరుగల్లును పునరుద్ధరించిన వీరవర్యుడని ఆదిరాజువారి నిశ్చితాభిప్రాయం.

గోలకొండ సుల్తాను ఇబ్రహీం కులీషా (1551–81) కాలం నాటి షితాబుఖాను జన్మతః మహమ్మదీయుడనీ, ఇతనికీ చరిత్ర కెక్కిన చరితార్థుడైన షితాబుఖాను అను సీతాపతి రాజుకు లంకె వేయడం బేసబబని గ్రంథకర్త అభిప్రాయపడ్డారు.

**తొమ్మిదవ ప్రకరణం – షితాబుఖాను హిందువే** అన్న అంశం నిర్ధారింపబడింది. ఇతడు సీతాపతి పేరుతో వర్ధిల్లిన బోయ వీరుడే తన అవక్ర పరాక్రమం వల్ల సుల్తానులచే షితాబ్ (అభ్యుదయం) ఖాన్ (వీరుడు) బిరుదం పొంది చరిత్ర ప్రసిద్ధి పొందినాడని గ్రంథకర్త నొక్కి చెప్పారు. ఓరుగల్లు కోటలోని శిలా శాసనం (1504) వరంగల్లు కైఫియ్యతుల ప్రకారం సీతాపతి రాజు షితాబుఖాను పేరుతో వర్ధిల్లిన హిందూరాజే అని నిస్సంశయంగా నిర్ధారింపబడింది. సుప్రసిద్ధ చరిత్ర కారులైన ఆదిరాజు వీరభద్రరావు గారు షితాబుఖాను ఘనతను ఈ విధంగా ఉగ్గడించారు– **"ప్రాచీన హిందూరాజుల వలె దేవ ప్రతిష్ఠలు చేసి, దాన ధర్మా లొనర్చుటయే మహదాశయముగా గలిగి, తన ఆశయ సిద్ధిని సంపూర్ణముగా బడసిన యీ తారాజువ్వ వీరుని వంటి వారికి ఈ ఆరేదేండ్ల కాలము ఇంత తక్కువ కాలము కాదేమో!"** (పేజి: 49) కృష్ణరాయ విజయము, రాయవాచకముల ఆధారంగా షితాబుఖాను 1516 వరకు జీవించి వున్నట్లు చివర ఆయన ఇట్లు చెప్పారు– **"ఇతడు కృష్ణదేవరాయల తోటి యుద్ధము నందు వీరశయనము చెందినాడేమొ యని అనుమానము కలుగుచున్నది. లేదా, తర్వాత ఎప్పుడో, ఎట్లో సీతాపతి షితాబుఖాను జీవితము ముగిసియుండును."** (పేజి: 50)

**పదవ ప్రకరణం – 'ఉపసంహారము' :** గ్రంథకర్త ఆదిరాజు వీరభద్రరావుగారి నిజాయితీని, సౌజన్యాన్ని చాటుతుంది. షితాబుఖాను శాసనగ్రంథం 'వరంగల్ షితాబుఖాను' వ్యాఖ్యాత డా. హీరానంద్ శాస్త్రిగారిని వినమ్రంగా కృతజ్ఞతలు తెల్పి కృతార్థులయ్యారు ఆదిరాజుగారు.

ఆదిరాజు వీరభద్రరావు గారు రచించిన ఈ 'షితాబుఖాను అను సీతాపతి రాజు' పరిశోధన గ్రంథం కాకతీయుల తర్వాతి కాలంనాటి ఒక వీరుని శౌర్యచరిత్ర, తెలంగాణ చరిత్రలోని ఒక స్మరణీయ అధ్యాయం. తెలంగాణలోని ఒక నిరుపేద మనిషి, వీరోచిత విద్యలు నేర్చి, ఓరుగల్లు గద్దెనెక్కి, అల్పకాలంలోనే అనల్ప కీర్తి ప్రతిష్ఠలు ఆర్జించిన అసమాన శూరుని పరాక్రమ గాథ ఈ పుస్తకం. అరవై మూడు సంవత్సరాల క్రిందట వెలువడ్డ ఈ విలువైన పుస్తకాన్ని తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రచురిస్తే అటు తెలంగాణ చరిత్రకు, ఇటు పరిషత్తుకు ఉభయతారకంగా వుంటుంది. (నాకీ పుస్తకం జెరాక్సు ప్రతి పంపిన యువ మిత్రులు డా. టి. సతీశ్ (న్యూఢిల్లీ) గారికి మనఃపూర్వక కృతజ్ఞతలు).


TU 09043

షితాబుఖాను అను సీతాపతిరాజు

ఆదిరాజు వీరభద్రరావు

ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం, ఎం. ఏ.

ప్రకాశకులు:
లక్ష్మణరాయ పరిశోధక మండలి, హైద్రాబాదు
1961



**బురదలోన ఉంటున్నా తరగదు పద్మం విలువ**
**తాటాకున పడివున్నా తగ్గదు పద్యం విలువ**
**అసలు సిసలు పసవుంటే అవరోధించేదెవరు–**
**అరసికులేమంటున్నా చెరగదు గానం విలువ**
**మూర్ఖులు ముంచేస్తున్నా మునగదు జ్ఞానం విలువ.**

**(ప్రపంచ పదులు**
**– డా. సి. నారాయణ రెడ్డి)**

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక  సంపుటి -27 : సంచిక - 3  38  హైదరాబాద్  జనవరి : 2024

# మానవతకు సంకేతం మార్గళీ వ్రతం

ఆచార్య శ్రీవత్స, తిరుపతి, ఫోన్ : 9000324024

**"శృంగార వతియైన శ్రీ కుంభుని తనూభ**
**వు నెదపై శ్రీశుండు పవ్వళించ**
**తన్మయమొందిన దామోదరుని గాంచి**
**'ఆముక్తమాల్యద'యై తెలిపెను**
**వీనులవిందుగా వేదాన్త సార రూ**
**పమ్ము 'ద్రవిడ వేద' పదము పాడి**
**పుష్పమాలికలతో పురుషోత్తమునితోడ**
**సంయమనము నొందె జలజనేత్రి**
**స్వామి శ్రీ చరణాలకు శరణుజొచ్చి**
**భక్తితో మ్రొక్కె కృష్ణుని ఆశ్రయించి**
**అట్టి 'గోదమ్మ' తల్లికి యంజలింతు**
**స్మరణ చేసి కొలిచెదను సాగిలపడి"**

శ్రీ పరాశర భట్టరు వారు ఆనతిచ్చిన తనియనకు పద్యానువాదం.

(శ్రీకుంభుని తనూభవుని = యశోదాదేవి సోదరుడగు శ్రీకుంభుని కుమార్తె అయిన నీళాదేవి. తెలుపు = మేలుకొలుపు, ఆముక్తమాల్యద = తాను ధరించి విడిచిన పూమాలను స్వామి స్వీకరించుట, ద్రవిడ వేదము = తమిళంలో ఆశువుగా చెప్పిన పాశురాలు (తిరుప్పావై) సంయమనము = బంధము (కట్టుట), సాగిలపడి = సాష్టాంగ నమస్కారము చేసి)

**అవతారిక**

సృష్టిలోని అనంతకోటి జీవరాశులకు వెలుగును, శక్తిని, ఆరోగ్యాన్ని ప్రసాదించే సూర్య భగవానునని గమనానికి సంబంధించిన ధనుస్సంక్రమణం నుండి ప్రారంభమవుతుంది ధనుర్మాసవ్రతం. దీనికే 'శ్రీవ్రతం' అనీ, 'కాత్యాయనీ వ్రతమ'ని పేర్లు కలవు. ద్వాపర యుగంలో శ్రీకృష్ణపరమాత్ముని అర్ధాంగి, పట్టపురాణియైన రుక్మిణీదేవి ఆచరించిన వ్రతమే శ్రీవ్రతము. ఈ వ్రతాన్నే తులసీమాత వ్రతమని అంటారు.

పారమార్థిక సంపదతో 108 ఉపనిషత్తుల సారాన్ని తిరుప్పావై పాశురాలతో నేర్పింది. రోజుకొక్క పాశురం చొప్పన 30రోజులు 30 పాశురాలను గానం చేసింది. తాను ధరించి ధరింపచేసిన పుష్పమాలికలతో ఆనంద కిశోరుణ్ణి (శ్రీకృష్ణుణ్ని) కట్టివేసి భక్తితత్త్వాన్ని అనుభవింపచేసింది. అటువంటి ఆండాళ్ తల్లికి (గోదాదేవి) నమస్కారములు.

శ్రీ గోదాదేవి అంటే ఎవరు....? ఆమెలోని భక్తితత్త్వం ఏమిటి? ఆమె ఆచరించిన మార్గళీ వ్రత వైశిష్ట్యం ఏమిటి....? ధనుర్మాసంలోనే ఎందుకు ఆచరించాలి...? ఇలాంటి ప్రశ్నలు ప్రతి మానవునిలో తలెత్తక మానవు.

వీని స్వరూప స్వభావాలు దర్శించి ఆచరించ కల్గినపుడు నిజంగా మానవునిలోని 'మానవత' దైవీభూతమై భూలోకాన్ని స్వర్గం కన్నా మిన్నగా చేస్తుంది.

**మానవుని ప్రవర్తన**

మనం చేసే ప్రతి పనికి పర్యవసానమంటూ ఒకటి ఉండితీరాలి కదా! అయితే దాన్ని మనం అనుభవించి తీరాల్సి ఉంటుంది. ఒక్కొక్కప్పుడు మనం చేసే పని వల్ల లభించిన ఫలితాన్ని మరొకరు ఎదుర్కొనవలసి యుంటుంది. మనం నిర్వర్తించే పని ఫలితం నైతిక విధానంపై ప్రభావంచూపుతుంది. వ్యక్తులు మారినా వారు చేసే పని (కర్మ) ప్రభావం ప్రాపంచిక నీతివర్తనంపై ఉండి తీరుతుంది. కనుక ప్రతి ఒక్కరూ నైతిక విలువలకి ప్రాధాన్యమిచ్చి ప్రవర్తించాలి.

**కర్మ సిద్ధాంతం**

అందుకే ధర్మశాస్త్రాలు చెబుతున్నాయి

**"స్వ కర్మణా భవేత్ దు:ఖం, సుఖంతేనైవ కర్మణా**
**తస్మాచ్ఛపూజ్యతే కర్మ సర్వం కర్మణి సంస్థితమ్"**

మానవునిక తన పనుల మూలాన్నే దు:ఖమూ, సుఖమూ కూడా కలుగుతవి. అందుచేతనే కర్మ అందరిచేతా పూజింపబడుతుంది. 'కర్మ'లోనే సమస్తమూ గర్భితమైయుంది.

**"కర్మణా జాయతే భక్తి: భక్త్యా జ్ఞానం ప్రజాయతే**
**జ్ఞానాత్ ప్రజాయతే ముక్తి: ఇతి శాస్త్రార్థ సంగ్రహ:"**

కర్మవల్ల భక్తి కల్గుతున్నది. భక్తివల్ల జ్ఞానమున్నూ, దానివల్ల మోక్షమున్నూ కల్గుచున్నవని శాస్త్ర నిర్ణయము. కనుకనే గీతాచార్యుడు "శ్రద్ధావాన్ లభతే జ్ఞానం" అని విశ్లేషించాడు.

**మార్గశిరమాస వైశిష్ట్యం**

సూర్యభగవానుడు ధనురాశి నుండి మకర రాశిలో ప్రవేశించే సమయాన్ని 'మకర సంక్రమణం' అంటారు. దీన్నే 'సంక్రాంతి' పర్వం అంటారు. ఈ క్షణం నుండి ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభ మవుతుంది. మానవులోని దైవీభూత శక్తులు కూడా ఈ ఉత్తరాయణ పుణ్యకాలంలోనే మేల్కొనుట జరుగుతుంది. ఈ సమయానికి ముందున్న సమయం అనగా 'మార్గశిర మాసం' బ్రాహ్మీ ముహూర్తం వంటిదన్నమాట!

సత్కార్యాల గురించి ఆలోచించే సాత్త్విక సమయం, బ్రాహ్మీ ముహూర్తం అనగా మార్గశిరమాసం. సంవత్సరంలో మానవుడు జీవితానే చరితార్థం చేసుకునే పనులకు అనువైన సమయం మార్గశీర్షం. అందుకనే గీతాచార్యుడు శ్రీకృష్ణ పరమాత్మ తన భగవద్గీత విభూతియోగంలో 'మాసానాం మార్గశీర్షోహమ్' అని వక్కాణించి యున్నాడు.

కాలానుగుతంగా ఉత్తరాయణం దేవతలకు పగటి సమయం. దక్షిణాయనం రాత్రి సమయంగా విశ్లేషిస్తారు కోవిదులు. దక్షిణాయనంలో చివరిదైన ధనుర్మాసం దేవతలకు బ్రాహ్మీ ముహూర్తం వంటిదనియు, ఉత్తరాయణ పుణ్యకాలానికి మార్గశిర మాసం ఉషస్సు వంటిదనియు ఆధ్యాత్మిక పండితులు వివరిస్తున్నారు. ఈ సమయమే సాత్త్విక సాధన విశేష ఫలితాన్ని ఇస్తుందని పురాణాలు చెబుతున్నాయి.

**"వాసుదేవ తరుచ్ఛాయా నాతి శీతాన ఘర్మదా"** శ్రీకృష్ణ పరమాత్మ అను వృక్షచ్ఛాయ అతిశీతలం గాక, అత్యుష్ణం కాక సమంగా ఉంటుంది. అది గ్రీష్మ తప్తులకు శీతలంగాను, శీత పీడితులకు ఉష్ణ కరం గానూ ఉంటుంది. అట్లే విష్ణు స్వరూపమైన మార్గశిర మాసం కూడా సమశీతోష్ణమై ఉంటుంది. అభివృద్ధికి, అభ్యుదయానికి యుక్తమైన కాలమిది. ప్రజలు దానాది సత్కర్మల వల్ల తమ పాపాల్ని పోగొట్టుకొనే కాలమిది. సస్యశ్యామలమై ఫల పుష్ప భరితమైన ప్రకృతి వలె గోపికల మనోక్షేత్రం కూడా శ్రీకృష్ణ ప్రేమతో సస్యశ్యామలమై, శ్రీకృష్ణ సమాగమాన్ని మధురఫల రసాస్వాదన కుద్యుక్తుల్ని చేసి తరింపజేసే తమో రహితమైన బంగారు కాలం. అదియే కదా! నిజమైన సుప్రభాతం.

### శ్రీవ్రతం విశిష్టత

'తిరు' అనగా 'శ్రీ' అనియు, 'పావై' అంటే 'పాట' మరియు 'వ్రతం' అనియు శ్రీవైష్ణవ సంప్రదాయంలో చెప్తారు. 'తిరుప్పావై' అనగా 'శ్రీపాట'గా వర్ణిస్తూ విశేష భాష్యాన్ని చెప్తారు. ద్వాపర యుగంలో ద్వారకలో మహాలక్ష్మి అంశంలో జన్మించిన రుక్మిణీదేవి తులసీ వ్రతాన్ని ఆచరించిందని ఆండాల్ తల్లి తన తండ్రి వల్ల వ్రతవిధానాన్ని తెలుసుకుంది. ద్వాపరంలో శ్రీకృష్ణ సంశ్లేషమును పొందగోరిన గోపకన్యలు వ్రేపల్లెలో కాత్యాయనీ వ్రతాన్ని చేశారని విని, తానూ అలాగే చేయాలనుకుంది.

తానున్న విల్లి పుత్తూరు వ్రేపల్లెగను, శ్రీవిష్ణు చిత్తులను శ్రీనందుని గను, తన్ను ఒక గోపకన్యకగను, తన స్నేహితురాళ్ళను వ్రజ కన్యలు గను భావించి, తాను గొల్ల కన్య రూపాన్ని ధరించి విల్లిపుత్తూరులో వేంచేసి యున్న వటపత్రశాయినే శ్రీకృష్ణునిగా భావించి, అతి శ్రేష్ఠమైన మార్గశీర్ష మాసాన 'ధను' సంక్రమణం మొదలు వ్రతాన్ని ఆరంభించింది.

సూర్యుడు వృశ్చికరాశి నుండి ధనురాశిలోనికి ప్రవేశించడాన్ని 'ధనుస్సంక్రమణం' అని అంటారు. ఇదే సౌరమానం. ధనుస్సంక్రమణం మొదలు మకర సంక్రమణం వరకు ఉన్న నెలరోజులు ధనుర్మాసమని పేరు. తులసీ వ్రతాన్నే కాత్యాయనీ వ్రతమనియు, శ్రీవ్రతమనియు, మార్గశీర్ష స్నానంతో చేసే వ్రతానికే మార్గళీ వ్రతమనియు చెబుతుంటారు శ్రీవైష్ణవ కోవిదులు.

### పొందాలనే కోరిక కల్గడమే గొప్ప యోగ్యత

శ్రీకృష్ణ పరమాత్మునికి సంబంధించిన జ్ఞానం కల్గిన రోజే మంచిరోజు. భగవానుని ఎదిరించక ప్రేమించే జన్మయే జన్మ. ఆ విశ్వాసాన్ని పెంచే కాలమే ధనుర్మాసం. అది గుర్తించడమే మార్గళీవ్రత ఆంతర్యం. ఈ వ్రతాన్ని ఆచరించాలని అనే కోరిక కలగడమే గొప్ప అదృష్టం. దీనిని పొందడానికి జాతి కుల మత లింగ వయో తారతమ్యాలేవీ అడ్డు రావు. 'బాగు పడాలి' అనే కోరిక ఒక్కటి చాలు.



**"మాసాల్లో విశిష్టత కలిగిన మాసం మార్గశీర్షమాసం. ఈ మాసంలో ఉష:కాలమందు మార్గళీవ్రతం చేయవలసి యుంది. కనుకనే వ్రేపల్లెలో నివసించు కన్యలారా! గొల్ల పడుచుల్లారా! తొందరగా రండి. ఆ నారాయణుడే మన వ్రత సాధనమగు 'పర' అనే వాద్యాన్ని మనకిచ్చిన మన అభీష్టాన్ని తీర్చేవాడు. జగతి యావత్తూ సంతోషించే విధంగా మనమీ వ్రతాన్ని చేద్దాం రండి"** అని ఆండాళ్ తల్లి ప్రబోధింపచేసింది.

ధనుర్మాస వ్రతాన్నీ, వ్రత ఫలితాన్ని తెలిపి ఎవరు అర్హులో కూడా తెలిపి, ఫలింపచేసేదెవరో తెల్పింది. **"భక్తితో భగవంతుణ్ని పొందాలనే కోరిక కల్గడమే గొప్ప యోగ్యత సుమా!"** అని గోదాదేవి వివరించింది.

### మధుర సుధా రస భరితం శ్రీ గోదాచరితం

పాండ్యదేశంలో 'శ్రీవిల్లి పుత్తూరు' అను ఒక దివ్యక్షేత్రం ఉంది. అక్కడ 'పెరియాళ్వారు' అను పేరొందిన విష్ణుచిత్తుడున్నాడు. అతడు శ్రీహరి భక్తుడు. ఆళ్వారు అంటే పరమ భక్తుడనియు, పరమాత్ముని కొరికకే జీవించువాడనియు అర్థం. 'పెరియ' అనగా 'పెద్ద' అని అర్థం. ఏ శాస్త్రాలు



చదువుకోని విష్ణుచిత్తుడు భగవత్కటాక్షాన శాస్త్రవేత్తల నోడించి పరతత్త్వాన్ని స్థాపించాడు. అతడు 'భట్టనాథ' బిరుదాంకితుడై పరమాత్ముని దర్శన భాగ్యాన్ని పొంది, ఆళ్వారుల్లో శీర్ష స్థానాన్ని పొంది 'పెరియాళ్వారు'డయ్యాడు.

శ్రీ విల్లిపుత్తూరనే దివ్యక్షేత్రంలో శ్రీవట పత్రశాయిని ఆరాధిస్తూండేవాడు. అంతేకాక విష్ణుచిత్తుడు ప్రతిరోజూ పువ్వులతో చక్కగా మాలలు కూర్చి నిత్యం మాలా కైంకర్యమొనరించుటయే అతని విధి. అతడు తులసీవనాల్ని పెంచుట పూలు కోయుట, మాలలు కట్టి స్వామికర్పించుట అతని నిత్యకృత్యాలు. ఒకరోజు విష్ణుచిత్తుడు తులసీవనంలో మొక్కలకు పాదు చేస్తుండగా ఒక చిన్నారి పరమాత్మునికి ప్రియాతి ప్రియమైన 'తులసీ' మూలాన సలక్షణమై లోక విలక్షణమై అయోనిజయై నల నామ సంవత్సరం పూర్వఫల్గుణీ శుభ నక్షత్రయుక్త కర్కాటక లగ్నమందు మానవాళిని తరింపచేయుటకు అవతరించింది. అందుకే శ్రీవైష్ణవులిలా స్తుతిస్తున్నారు.

**"కర్కటే పూర్వఫల్గుణ్యాం తులసీ కాననోద్భవాం**
**పాండ్యే విశ్వంభరాంగోదాం వందే శ్రీరంగనాయకీం**

ఆ బాలికను విష్ణుచిత్తులవారు 'కోతై' అని పిలిచేవారట. ఆ నామమే క్రమక్రమంగా 'గోదా'గా మారింది. 'గోదా' అనగా 'భూదేవి' యనియు 'పుష్పమాలిక' అనియు అర్థాలున్నాయి. ఈ గోదాదేవిని 'ఆండాళ్' అని పిలుచుట పరిపాటియైనది.

ఈమె బాల్యం నుండి సహజ పరిమళం గల తులసి వలె (తులసి అనగా జీవులందు కలుగు సమస్త రోగాల్ని నిర్మూలించేది) జ్ఞాన, భక్తి వైరాగ్యాన్ని కలిగి భగవద్గుణాలయందు ఆసక్తురాలై ఉంది. ఈమె షోడశ కళలతో దినదిన ప్రవర్ధమానయై పూర్ణ చంద్రునివలె ప్రకాశిస్తూంది. ఆమె మనస్సు వటపత్రశాయికి నెలవై స్వామి గుణగణాన భవాన దివ్యదీప్తిని వెలుగొందుచుండెను.

గోదాదేవి తండ్రి చెంత కూర్చొని తాను మాలలూ కట్టుచూ ఆ స్వామిని ఆ మాలల్లో ఊహించుకొనుచుండేది. యుక్తవయస్కురాలైన గోదాదేవి మనస్సునందు ఒక విలక్షణమైన భావం ఉదయించింది. ఆమె తాను కట్టుమాలలనే కాక తనకు తానే భగవంతునికి సమర్పించుకుంది. ఆ శ్రీమన్నారాయణుని తప్ప అన్యుల్ని పతిగా నొల్లనని నిశ్చయించుకుంది. తన తండ్రి అర్చించుచున్న వటపత్ర శాయి యెడ వాల్లభ్య భావాన్ని పెంచుకుంటూ సర్వదా సర్వావస్థల యందును స్వామియందే మనస్సు లగ్నం చేసి స్వామి కల్యాణ గుణ సంకీర్తనం చేస్తూ కాలం గడుపుతూంది.

స్వామిని తనకు పతిగా ఊహించుకొనుట, పుష్పమాలాలంకృతుడై ప్రకాశించుచున్న స్వామి చెంత, స్వామి ప్రక్కన తానెట్లు ఉండునో తాను ఊహించుకొనుట, స్వామికై కూర్చిన పుష్పమాలల్ని తాను ఒకపరి ధరించి అద్దంలో తన ప్రతిబింబాన్ని చూచుకొనుచు ఆండాళ్ తల్లి ఆనందించుచుండెడిది. ఇది యొక అలవాటై ఆమె ప్రతిదినం ఆ మాలను తాను ధరించిన పిదపనే స్వామికి సమర్పిస్తూండేది. ఇట్లు చేయుట దోషమని గోదాదేవికి తోచలేదు. అటువంటి భావన ఆమెకు లేదు.

ఈవిధంగా ఆండాళ్ తల్లి ఇచ్చిన పుష్పమాలలే విష్ణుచిత్తుల వారు స్వామికి సమర్పిస్తున్నారు. స్వామి ఈ పుష్పమాలికలు సౌఖ్యదాయకములై అత్యంత ఆనందాన్ని కలిగించేవి. సుగంధ పరిమళాలు వెదజల్లు ఈ పుష్పమాలికలు చూచినవారికి ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నాయి. పెరియాళ్వారు పరమభక్తుడు కావున ఆ పుష్ప మాలికలు భక్తి పరిమళంలో ఉన్నాయని భావించారు. గోదాదేవియు ప్రతిదినం పుష్పమాలికల్ని ముందుగా తాను ధరించి ఆ ఆముక్తమాల్యాలనే స్వామికి పంపుచుండెడిది. ఒకరోజున స్వామికి సమర్పించిన మాలలందు ఒక పరిమళ భరితమైన ఒక వనితాకేశం (స్త్రీ తలలోని వెంట్రుక) కనిపించింది. అర్చక స్వాములు దాన్ని చూసి కోపంతో పెరియాళ్వారుల్ని పిలిచి అడిగారుట. ఆ మాలల్ని విసరి పారవైచారు. అంతట పెరియాళ్వారు బాధపడ్డాడు. అతడు వేదన పడుచున్న సయమంలో యథావిధిగా గోదాదేవి చేయు పనిని (ప్రతిరోజూ తాను ధరించు మాలల్ని) చూసి ఆశ్చర్యపోయారు. వెంటనే పెరియాళ్వారు (విష్ణుచిత్తుడు) ఆండాళ్ తల్లిని పిలిచి **"అమ్మా! నీవిట్లు చేయుట తగునా?"** అని ప్రశ్నించారు. కానీ ఆనాటికి స్వామికి పుష్పమాలల్ని స్వామికి సమర్పించలేదు. విష్ణుచిత్తులవారు చింతాక్రాంతులై నిదురించారు.

స్వప్నంలో స్వామివారు సాక్షాత్కరించి **"విష్ణుచిత్తుల వారితో గోదాదేవి ధరించి ఇచ్చిన పుష్పమాలికలే నాకు చాలా ఇష్టం. ఎటువంటి అనుమానం లేక వానినే నాకు సమర్పించుము."** అని చెప్పి విష్ణుభగవానుడు అంతర్ధానమయ్యాడు.

విష్ణుచిత్తుల వారు **"స్వామి దివ్యాజ్ఞ"**ను అనుసరించారు. ఒకరోజున విష్ణుచిత్తులవారు యుక్త వయస్కురాలైన గోదాదేవితో వివాహ ప్రసక్తి చేయగా ఆమె తన మనస్సు నిండా భగవానుడే

నిండియున్నాడని చెప్పింది. వెంటనే పెరియాళ్వారు (శ్రీవిష్ణ చిత్తుల వారు) **"శ్రీమన్నారాయణుడు ఈ భూలోకమందు 108 దివ్యక్షేత్రాలందు అర్చామూర్తియై నెలకొని యున్నాడు కదా! నీవు ఏ రూపాన నున్న ఆ స్వామిని వివాహం చేసుకొందువని"** ప్రశ్నించగా–

**"తండ్రీ! నీకు తెలిసిన ఆయా రూపాలను వర్ణించి చెప్పుము. అందు ఏ రూపం నాకు ప్రియమగునో నా మనస్సుకు హత్తుకొనునో ఆ రూపాన్నే నేను వివాహమాడెద"**నని పల్కింది. ఆవిధంగా శ్రీ విష్ణుచిత్తులవారు శ్రీమన్నారాయణుని రూప విశిష్టతను విశదీకరించగా శ్రీరంగమందలి రంగనాథుణ్ని (శ్రీమన్నారాయణుని అవతార విశేషం) రూపమందు గోదాదేవి మనస్సు లగ్నంచేసింది. గోదా విష్ణుచిత్తులవారికి తన మనస్సులోని కోరికను చెప్పింది. శ్రీ గోదాదేవి తండ్రి వల్ల రంగనాథుణ్ని చేసించే విధానం గ్రహించింది.

వెంటనే గోదాదేవి **"తనను కూడా ఒక గోపస్త్రీ వలె భావించు కుంది. తాను నివసించే విల్లిపుత్తూరును గోకులంగా భావించుకుంది. తన చెలికత్తెల్ని గోపస్త్రీలుగా భావించుకుంది. శ్రీరంగనాథుణ్ని శ్రీకృష్ణునిగా భావించుకుంది".** పరమాత్మను చేరుటకు వ్రతాన్ని సంకల్పించుకుంది. స్వామియే తన పతి కావలెనని భావించింది. కనుక గోదాదేవి గొల్లపడుచుల్ని ఆదర్శంగా తీసుకుంది. ఆమె భావనా ప్రకర్షచే గోపకన్య అయ్యింది. గొల్లకట్టు కట్టింది. గొల్ల కొప్పు పెట్టింది. గొల్లభాష నేర్చింది. స్వామిని చేరుటయే తన జీవిత ప్రయోజనం, సార్థకత అనుకున్నది. ఇంతలో ఆమె సంకల్పానికి తగినట్లు ధనుర్మాసం రానే వచ్చింది.

### బ్రాహ్మీ ముహూర్తంలోనే ఎందుకు నిద్ర లేవాలి?

సర్వ సాధారణంగా ఈ ప్రశ్న ఈనాటి చాలామందిలో ఉన్న ధర్మ సందేహం.

**"యదీచ్ఛేత్ శాశ్వతీం సిద్ధిం యమస్యాదర్శనం తథా ।**
**సతతం తేన కర్తవ్యో బ్రాహ్మే కాలే ప్రజాగర:**
**ప్రత్యూషకాలే నిద్యాంచ కురుతే సర్వదాతుయ:**
**అశుచిం తం విజానీయాత్ అనర్హ: సర్మకర్మసు**
**బ్రాహ్మే ముహూర్తే యానిద్రా సా పుణ్యక్షయ కారిణీ"**

అని స్మృతులంటున్నాయి. సూర్యోదయానికి ముందున్న అరజాములో రెండు ముహూర్తాలుంటాయి. మొదటిది బ్రాహ్మము. రెండవది రౌద్రము అని పరాశరుని మాట.

నిద్ర లేవగానే మనస్సులో ఇష్టదైవాన్ని స్మరించి నమస్కరించాలి. మౌనంగా ప్రవర్తించాలన్నదే స్మృతి ఉద్బోధిస్తుంది. ధనుర్మాసం అంటే సూర్యుడు వృశ్చిక రాశి నుండి ధనురాశి లోనికి ప్రవేశించే సమయం నుండి ప్రారంభమవుతుంది. ఇదే సూర్యమానం. అయితే చాంద్రమాన ప్రకారం మార్గశీర్షంలో వస్తుంది. ఏ మాసానికా మాసం



ప్రాముఖ్యమున్నదే అయినా ఈ మాసం శ్రీకృష్ణ భగవానుని ఉపాసించి చరితార్థం చేసుకునేందుకు అనువైన కాలంగా పేర్కొంటారు.

ఆండాళ్‌తల్లి **'తన ప్రయత్నమే వ్రతమన్నది'.** వ్రతమంటే **'ప్రజఘుస్మృత: భక్షణ భేదే ఉణాది పుణ్య సాధనే ఉపవాసాది నియమనుభేదేచ'** అనగా పుణ్య సాధనానికై ఉపవాసాది నియమాలచే చేయు కార్యానికి వ్రతమని అర్థం. ఈవిధంగా వాచస్పత్య నిఘంటుకారుడు తారానాథ తర్కవాచస్పతి విదీకరించారు. ఈ వ్రతమే దీక్ష తపస్సు అని చెప్పింది.

తండ్రి వల్ల విధానం తెలుసుకున్న శ్రీగోదాదేవి ప్రతిరోజూ బ్రాహ్మీ ముహూర్తంలో నిదుర లేచి అభ్యంగన స్నానాదులు పూర్తిచేసి శ్రీవైష్ణవ స్వరూప రూపధారి అయ్యింది. పూజాద్రవ్యాలతో ధూప దీప నైవేద్యాలతో రంగనాథుణ్ని సేవించింది. ఆశువుగా శ్రీకృష్ణభక్తి తత్వాన్ని రోజుకొక పాశురమాలిక (తిరుప్పావై)గా సమర్పించింది.

### తిరుప్పావై విశిష్టత

శ్రీ గోదాదేవి గోవిందుణ్నే పతిగా కోరింది. తమిళంలో పాశు రాలను రచించింది. వాటిని గానం చేసి తరించింది. రోజుకొక పాశురం చొప్పున ముప్పది పాశురాలు రచించి పరమాత్మ పదకంజాతాలకు సమర్పించింది. అవి భక్తి పరిమళ భాసురాలై తమిళ సాహిత్యంలో నిత్య పారాయణులుగా భక్తులను అనుగ్రహిస్తున్నాయి. ఇవి భక్తి భావ గాంభీర్యాన్ని సంతరించుకున్నాయి. ఆండాళ్ దివ్య ప్రబంధంగా ఎంతో ప్రసిద్ధికెక్కాయి. ఈమె రచించిన తిరుప్పావై పాశురాలను మూడు దశలుగా విభజించి ఆధ్యాత్మిక తత్త్వవేత్తలు ఆస్వాదిస్తున్నారు.

**మొదటి దశ – అభిముఖ్య దశ :** మొదటి పాశురం నుండి అయిదవ పాశురం వరకు ఆచరించవలసిన నియమాలు, కర్మసిద్ధాంతం, నామ సంకీర్తనంతో పాటు జ్ఞానమార్గం చూపించుట.

**రెండవ దశ – ఆశ్రయణ దశ :** ఆరవ పాశురం పదిహేను పాశురం వరకు భగవదనుభవంలో మున్గి తేలుతున్న పదిమది ఆళ్వారుల్ని మేల్కొల్పుట.




**మూడవ దశ – అనుభవ దశ :** పదహారవ పాశురం నుండి చివరి పాశురం వరకు (30వ పాశురం) ఆచార్యుడైన నందగోపుణ్ని, యశోదను, బలరాముణ్ని, కాపలా వారిని, నీళాదేవిని, శ్రీకృష్ణ పరమాత్మను పొందే లక్ష్యం వైపు నడవాలని ప్రబోధించింది.

ఈ వ్రతాన్ని ఆచరించడానికి జాతి కులమత భేదాలు లేవని విశ్లేషించింది. తన ప్రయత్నమే వ్రతమన్నది. అదియే దీక్ష. తపస్సు అని పల్కింది.

**శరణాగతి :** "అన్యథా శరణం నాస్తి, త్వమేవ శరణం మమ" అని భక్తుడు (జీవుడు) పరమాత్మను (భగవంతుడు) శరణాగతి ద్వారా ఆరాధిస్తే పరమాత్మ జీవుల వశమవుతాడని ఆండాళ్ తల్లి అనుభవ పూర్వకంగా లోకానికి ప్రబోధాత్మకంగా సందేశాన్ని ఇచ్చింది. భగవంతుణ్ని చేరడానికి ఈ విశిష్ట వ్రతం జీవునికి మూడు దృఢ విశ్వాసాలను తెలియజేస్తుంది.

**1. అనన్య శేషత్వం :** పరమాత్మకే తప్ప ఇతరులకు చెందిన వాడను కాను.

**2. అనన్య శరణత్వం :** భగవంతుడే తప్ప ఇతరమైనవి ఉపాయాలు కావనే బుద్ధి.

**3. అనన్య భోగత్వం :** భగవంతుణ్ని పొందడం తప్ప మిగతా విషయాలు నాకు రుచించవు అనే మనస్సు.

వీటిని అకారత్రయమని అంటారు. ఇవే శ్రీవైష్ణవ సంప్రదాయానికి ప్రతీకలు. ఈ జ్ఞానాన్ని కలిగి భగవత్ సాయుజ్యం (మోక్షం) పొందడమే వ్రతసిద్ధి అని చెప్పింది మన ఆండాళ్ తల్లి. అంతేకాక జీవుడు ఆచార్యుని ద్వారా పరమాత్ముని సన్నిధికి చేరుకొనుట అతి సులభమని అనుభవ పూర్వకంగా చెప్పింది.

**శ్రీ గోదా రంగనాథుల కల్యాణం – కమనీయం**

శ్రీరంగంలో శ్రీరంగనాథుడు గోదాదేవితో వివాహం చేయమని విష్ణుచిత్తుణ్ని స్వప్నంలో ఆజ్ఞాపించాడు. బంధుమిత్ర సపరివారమంగా గోదాదేవిని నవ వధువుగా అలంకరించి, శ్రీరంగధామానికి పరమాత్మ పంపిన ముత్యాల పల్లకీలో తీసుకువచ్చారు. బ్రహ్మాది దేవతలు తమ తమ వాహనాలపై శ్రీరంగనాథుని చెంత చేరారు. సరస్వతీ పార్వతులు మొదలుగా గల దేశాగన గణాలు పూర్వం జరిగిన సీతారాముల వివాహ గీతాన్ని పాడుచుండగా 'ఏకావళీ' మొదలుగా గల చెలికత్తెలు వింజామరలు వీచుచుండగా, అరుంధతి మున్నగు ఋషిపత్నులు ఆ గోదేదేవిని దీవిస్తూ, పసుపు నీళ్ళతో నలుగులు పెట్టి పన్నీటితో స్నానం చేయించి భూనభోంతరాలు నిండిన మంగళ వాద్యాల మధ్య పెళ్లికూతుర్ని చేశారు. కాళ్ళకు పారాణి రాశారు. నవరత్న ఖచిత బంగారు ఆభరణాలతో ఒప్పారుతూ తెల్లని పట్టుచీరతో ప్రకాశిస్తుండగా విష్ణుచిత్తుడు షోడశోపచారాలతో శ్రీరంగనాథునికి శ్రీ గోదాదేవి కన్యాదానం చేశాడు.

ముహూర్త సమయాన వేదమంత్రోచ్చారణ రవళుల మధ్య శ్రీ గోదా రంగనాథులు జీలకర్ర బెల్లంతో కలిపిన ముద్దను నెత్తిపైన ఒకరిపై నొకరు పెట్టుకోగా బ్రహ్మాది దేవతలు ఆశీస్సుల నింపారు. అనంతరం ముత్యాల తలంబ్రాలు పోసుకోవడంతో సశాస్త్రీయంగా వైవాహిక ఘట్టం పూర్తి కాగా జీవాత్మ(గోదాదేవి) పరమాత్మ (రంనాథుని)లో ఐక్యం చెందింది.

ఇంతటి వైశిష్ట్యం కల్గిన ఆ గోదా అమ్మవారిని అన్నమయ్య తన మధురగానంతో ఆశువుగా ఇలా కీర్తించాడు.

**"చూడరమ్మ సతులాల సోబాన పాడరమ్మ**
**కూడున్నది పతి చూడి కుడుత నాంచారి**
**శ్రీమహాలక్ష్మియట సింగారాలకే మరుదు**
**కాముని తల్లి యట చక్కదనాలకే మరుదు**
**సోముని తోబుట్టువట సొంపుకళలకే మరుదు**
**కోమలాంగి ఈ చూడి కుడత నాంచారి"**

అన్నమయ్య దృష్టిలో ఈ రస సృష్టిలో శ్రీ వేంకటేశ్వరుడే ఆ ఆదిలక్ష్మియే ఈ ఆండాళ్ తల్లి. ఈ కవియుగంలో కన్నతల్లి గొప్పదనాన్ని శక్తిని రుచి చూపించాడు.

శ్రీ విల్లిపుత్తూరులో విష్ణుచిత్తుల తులసి వనంలో అయోనిజమై ఆవిర్భవించినది శ్రీమహాలక్ష్మి. ఆమెయే 'ఆండాళ్'గా పిలువబడే గోదాదేవి. తాను ధరించిన మాలల్ని 'చూడకుడుత్త నాంచారి'అని కీర్తింపబడుతున్నది. మోక్షమనెడి కాంతి జీవాత్మకు సంప్రాప్తమైంది. కనుక అది సంక్రాంతి. ధనుర్మాసం ముప్పదిరోజులు గోదాదేవికి గోవులు సహకరించినందువల్ల 'కనుమ పండుగ' జరిపి పశువులకు పండుగ జరుపుట అని ఆధ్యాత్మిక కోవిదులు సందేశంగా గైకొంటారు.

శ్రీవ్రతాన్ని విన్నవారు, కన్నవారు కూడా వ్రత ఫలితం దక్కుతుంది. వివాహం కాని స్త్రీలకు వివాహం జరుగుతుంది. దరిద్రం పోయి అష్టైశ్వర్యాలు కలుగుతాయి.

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 3  UGC Care List Approved Journal
హైదరాబాద్ జనవరి : 2024

# స్వాతంత్ర్యోద్యమంలో తెలంగాణ గీతాలు

**డా. ఘనపురం సుదర్శన్**, ఫోన్ : 90004 70542

చారిత్రక గాయాల గాథలు గీతాలైనపుడు ప్రజా జిహ్వలపై అవి నాట్యమాడుతాయి. ఒక నూతన వైపల్యానికి దారి వేస్తాయి. స్వేచ్ఛా, స్వాతంత్ర్యాల వైపు నడిపిస్తాయి. ఇది సాహిత్యంలోని గేయానికి లేదా గీతానికి ఉన్న గొప్ప విశేషం. ఈ విశేషం భారత స్వాతంత్ర్య పోరాటంలో ప్రజా బాహుళ్యాన్ని భాగం పంచుకునేలా ప్రేరేపించింది. తమ జాతితో బంధం పెంచుకునేలా చేసింది. దేశంలో అది ఉత్తర భాగమైనా, దక్షిణ భాగమైనా, మరే భాగమైనా గానీ తరతరాలుగా వస్తున్న బానిసత్వాన్ని బద్దలు కొట్టేందుకు సామాన్య ప్రజలను మేల్కొల్పిన సాహితీ ప్రక్రియలలో గీతమూ కీలక పాత్ర పోషించింది. బెంగాల్ లో రవీంద్రుడు కావొచ్చు, బంకించంద్ర ఛటర్జీ కావొచ్చు, తమిళ నాట చిన్నస్వామి సుబ్రహ్మణ్య భారతి కావొచ్చు. ఇలా దేశ వ్యాపితంగా భిన్న ప్రాంతాల వారీగా రచయితలు సామాన్య ప్రజలను అసామాన్య పోరాట యోధులుగా తీర్చిదిద్దడానికి ఈ ప్రక్రియనూ ఒక సాధనంగా మలుచుకున్నారు. ఇటువంటి ప్రజాగణమే, ఇటువంటి సాధనమే హైదరాబాద్ రాష్ట్రంలోని తెలంగాణలోనూ జీవం పోసుకున్నది.

తెలంగాణ ప్రాంతం నుంచి బ్రిటీషు ప్రభుత్వానికి ప్రత్యక్ష తిరుగుబాట్లు జరిగినా అవి కొన్ని గ్రంథాలలో మాత్రమే నమోదయ్యాయి. ఆ తిరుగుబాట్లను వస్తువుగా రచయితలు వివిధ సాహిత్య ప్రక్రియలలో రచించినా అవి కొన్ని మాత్రమే లభించాయి. అయితే తెలుగులో పరిశోధన కోసం కొంతమంది విద్యార్థులు చేపట్టిన అన్వేషణలో కొన్ని, భారత ప్రభుత్వం ఇటీవల చేపట్టిన అజాదీకా అమృత మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మరికొన్ని రచనలు ఈ మధ్యనే వెలుగు చూశాయి. వాటిలో భారత స్వాతంత్ర్యోద్యమాన్ని, అందులో భాగంగా జరిగిన ఉప ఉద్యమాలను ప్రతిబింబించిన రచనలు ఇంకొన్ని బయటపడుతున్నాయి. ఈ లెక్కన చూస్తే తెలంగాణ ప్రాంతం నుండి భారత జాతీయోద్యమాన్ని గీతాలలో అక్షరీకరించిన గీత కర్తల సంఖ్య అర్ధశతానికి సమీపంగానే ఉన్నది. ఇందులో కొందరు నిత్యం స్మృతిలోకి వచ్చే వారైతే, ఇంకొందరు విస్మృత గీత కర్తలు. వారిలో ప్రధానంగా, ప్రాథమికంగా, కచ్చితంగా స్మరించదగిన పేరు అడ్లూరి అయోధ్య రామయ్య. స్వాతంత్ర్య సాధన కోసం తన చదువును, కుటుంబాన్ని, ఆస్తిని ధారాదత్తం చేసిన మహనీయుడు అయోధ్య రామయ్య. అప్పటి వరంగల్ జిల్లా వ్యాప్తంగా పేరెన్నికగన్న స్వాతంత్ర్య సమరయోధుడు అయోధ్య రామయ్య. ఈయన రచించిన జాతీయ గీతాల ప్రభావం ఈనాటికి కూడా పాఠకులపై ప్రసరిస్తూనే ఉంటుంది. అటువంటి ప్రభావిత గీతాల్లో..



**"కింగు కోఠివైపు పదవోయి పదవోయ్/స్టేట్ కాంగ్రెస్ శంఖమూదోయి ఊదోయి.**

**సైనికులం మేం సేవకులం/ జాతీయ భారత సైనికులం/ స్వచ్ఛంద కాంగ్రెస్ సేవకులం"** వంటి గీతాలు రాశాడు.

కాంచనపల్లి వెంకటరామారావు **"ఓహోహో మానవుడా!/ చెరసాలల జముదూతల/బందిఖానలా? భటులా?/రక్షణమా? రక్షణమా?/వంచె జూతువె? ప్రాణుల/ఓర్పు హద్దు మీరెనోయి"** అని జాతీయోద్యమంలో పాల్గొన్న సగటు మానవుణ్ణి స్పృశించారు.

ఏదైనా ఒక ప్రాంతంలో ఉద్యమం జరుగుతున్నప్పుడు సహజంగానే దాని పరిసర ప్రాంతాల మద్దతు రచనా రూపంగానో, ఆత్మస్థైర్య సహకార రూపంగానో ఉండి ఉంటుంది. అటువంటి మద్దతునే ఇస్తూ బ్రిటీషాంధ్ర రచయితలు సైతం పలువురు రచనా సహకారం అందించారు.

**తెలుగు బిడ్డా! మేలుకోవోయ్!**
**నైజాము తెలుగు బిడ్డా! లేచిరా.**
**తెలుగునదులు, నగములు, గనులు, – నల్ల నల్ల భూములూ**
**కలవు నీ దేశాన – గంజి నీళ్ళే కరవ?**
**దున్ని చెమటోడ్చి ఈ – మన్ను బంగరు జేసి**
**కరువుతో జచ్చేటి – గతి ఏమి పట్టినది..** అని సుంకర సత్యనారాయణ ఇక్కడి ప్రాంతీయ వైభవాన్ని జాతి జనుల చైతన్యానికి సూచికగా ఈ గీతం రాశాడు.

వారణాసి వెంకట నారాయణ **"కరువు"** పేరుతో రాసిన గీతంలో..

**"కరువు వచ్చి నైజాములో కాలు పెట్టిందీ**
**బెంగాలు ప్రజలవలెను పీల్చి వేసిందీ**
**మాయదారి ప్రభుత్వము మాడ్చి వేసిందీ**
**కూడులేని ప్రజల మృత్యుముఖము జూపిందీ**
**రెండవ యుద్ధముతోటి లెవీ పుట్టింది.."** అని దారిద్ర్యం, పన్నుల

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 3  హైదరాబాద్ జనవరి : 2024




పుట్టుకను తెలుపుతూ 1947 లో ఈ గీతాన్ని రాశాడు.

**'లంచాలు మెండాయెరా'** అనే పేరుతో వట్టికొండ రామకోటయ్య రాసిన గీతంలో..

**పంటకళ్ళములోనె - పంటఫలహారమై**
**ఆలుపిల్లలుతోడను - ఓరైతా! అలమటించుచుంటివా?**
**జీవనదినీటితో - చెరువులన్ నింపితె**
**పంటకొల్లగబండురా- ఓరైతా ఇంటధాన్యములుండురా?**
**ఆంధ్రమహాసభయే - అన్నింట తోడ్పడును**
**అందులో చేరవలెరా - ఓరైతా! హక్కులు పొందవలెరా? ..**

ప్రజలకు అభయమిస్తూ అన్నింటికీ ఆఖరి దారి ఆంధ్రమహాసభనే అని అదే మనకు ఆపన్న హస్తం అని తెలిపాడు.

**"స్వతంత్ర యుద్ధం స్వతంత్ర యుద్ధం/ స్వతంత్ర యుద్ధం సాగింది.**
**అనాహారముగ ఆహోరాత్రములు /బాధలు పడుతూ పరులకు దాస్యము**
**చేసీ చేసీ చివికి కృశించిన /బానిస జాతుల బంధము లూడ్చే**
**స్వతంత్రయుద్ధం స్వతంత్రయుద్ధం /స్వతంత్రయుద్ధం సాగింది..**

వట్టికొండ రంగయ్య 1942 లో రాశాడు. అలాగే ఐక్యమత్యం తాలూకు గొప్పదనాన్ని చెప్తూనే అదే గనక ఉంటే ఎంతటి కష్టాన్నైన దాటగలమనే ఆత్మ సంకల్పంతో మరో గీతం రాశాడు.

**ఓ భారతీయ వీరులారా /ఐక్యతే మన - ఆయుధంబోయీ**
**మనలో మనకున్నట్టి భేదాల్- మానుకొని యొకబాటనదువ**
**దేశ సేవకులయ్యి - తరలండీ. ॥ఓ॥**
**లీగు కాంగ్రెసు లేకముఖమున - సాగి జాతీయప్రభుతదేగ**
**నాయకుల నడిపించరండోయి. ॥ఓ॥**
**క్షామమను పెనుగొంపినుండి- సకలమనుజులనుద్ధరింప**
**చెట్టపట్టాల్ - బట్టి కదలండోయ్ ॥ఓ॥**
**ఐక్యతే సామ్రాజ్యవాదుల ఆటలను గట్టించగలది.**
**అందుకై ముందడుగు చేయండోయ్. ॥ఓ॥**
**దేశ స్వాతంత్ర్యంబుగోరీ - దేశ భక్తులంతగలసి**
**దేశదాస్యము దీర్చరండోయ్. ॥ఓ॥**

నైజాంకి వ్యతిరేకంగా స్వాతంత్ర్యం కోసం జరిపిన ఉద్యమాలలో ఒకటి వెట్టిచాకిరి వ్యతిరేక ఉద్యమం. ఈ వెట్టిచాకిరి అంతరించాలని, దాన్ని అంతమొందించాలని పలు కులాల, వృత్తుల వారిని మేల్కొల్పుతూ సుద్దాల హనుమంతు తన బాణీని ఈ క్రింది విధంగా వినిపించారు.

**"వెట్టి చాకిరి విధానమో రైతన్న**
**ఎంత జెప్పిన తీరదో కూలన్న**
**మాదిగన్న, మంగలన్న, మాలన్న, చాకలన్న**
**వంద్రంగి వడ్డెరన్న వసిమాలిన బేగరన్న**
**కుమ్మరన్న, కమ్మరన్న కూలన్న రైతన్న**
**అన్ని పనులు వాళ్ళతో - దొరలందరు చేయించుకొనేడి."** అని వెట్టిచాకిరి కష్టాన్ని వివరిస్తూనే దాన్ని అంతం చేయాలని హితవు పలికారు.

ప్రజల రాజ్యం రావాలని పోరాడుతున్న ప్రజలపై నిజాం సర్కారు చేపట్టిన చర్యల గురించి..

**"నైజాము సర్కారురా, ఓరన్న/నాజీల మించిందిరా**
**ప్రజా రాజ్యానికై పోరాడు ప్రజలపై/ రాక్షస చర్యలను రకరకాల్ చేస్తుండే."**. అని తిరునగరి రామాంజనేయులు వర్ణించాడు.

నిజాం కర్కశత్వ పాలనను తన సాహిత్యంతో తూర్పార పట్టిన దాశరథి కృష్ణమాచార్య, మిగతా కవుల కంటే ఒక అడుగు ముందుకు వేసి సాహసోపేతమైన రచనలు రాశాడు. సూటిగా నిర్మొహమాటంగా అనేక గీతాలలో విమర్శించాడు. వాటిలో..

**"ఓ నిజాము పిశాచమా! కానరాడు**
**నిన్ను బోలిన రాజు మాకెన్నడేని**
**తీగెలను తెంపి అగ్నిలో దింపినావు**
**నా తెలంగాణ కోటి రత్నాల వీణ.."** అని దాశరథి ఏమాత్రం వణుకు లేకుండా ప్రశ్నించడం నిజాం ప్రభుత్వానికి చెంప దెబ్బ లాంటిదైతే, ప్రజానీకానికి చైతన్య గీతం లాటింది.

నిరంకుశత్వం నశింపు కోసం నిరంతరంగా పోరాడుతున్న ప్రజలలో ఒక్కొక్కరు ప్రభుత్వ తూటాలకు బలైపోతుంటే, ప్రజలలో ఎక్కడ ఉద్యమ ఆవేశం సన్నగిల్లుతదన్న ఆందోళనతో వారిలో మరింత ఉత్తేజం కలిగించడానికి ఆవంత్స సోమసుందర్..

**"ఒక వీరుడు మరణిస్తే వేలకొలది ప్రభవింతురు**
**ఒక నెత్తుటి బొట్టులోనే ప్రళయాగ్నులు ప్రజ్వరిల్లు**
**కబడ్దార్! నైజాం పాదుషాయే.."** అని హెచ్చరించాడు.

పైకి పరమత సహనాన్ని పాటిస్తున్నట్టు కనబడిన నిజాం, లోలోపల మాత్రం మహమ్మదీయులకే రాజ్యం ఉండాలని ఆశించిన ఆయన ధోరణిని హీరాలాల్ మోరియా ఈ క్రింది గీతంలో బట్టబయలు చేశారు

**"ఈ కనులవోలెనే హిందూ ముసల్మాను**
**లిరుపక్షములు నేత్రములు రెండు నాకంచు**
**అమిత ప్రేమ నటించి సమత మంత్రము పఠించి**
**వంచించినావురో ఓ నిజాము నియంత..** అని నిజాంకున్న తన మత అసహనాన్ని ప్రశ్నించారు.

నిజాం సర్కారు ప్రజలను తన ఆధీనంలోకి తెచ్చుకునేందుకు ఎన్ని కుటిల ప్రయత్నాలు చేసినా, ఎన్ని ఆయుధాలను చూపి బెదిరించినా ప్రజలు మాత్రం నిన్ను ఎండగతారని హెచ్చరించిన బండి యాదగిరి..

**"బండెనక బండి కట్టి పదహారు బండ్లు కట్టి/ ఏ బండ్ల పోతవు కొడుకో నైజాం సర్కరోడా.."** అనే గీతం రాశాడు.

**"వీరోచిత తెలంగాణ సాయుధ పోరాట సాహిత్యాన్ని సృజించిన కవులను, రచయితలను నాలుగు ప్రధాన శ్రేణులుగా వర్గీకరింప వీలున్నది. 1. ప్రావాహికులు 2. ప్రవాహ ప్రభావితులు 3. ప్రవాహ ప్రేరితులు 4. తటస్థులు"** (చూ. తెలుగులో ఉద్యమ గీతాలు, పుట 157). నిజాం రాష్ట్ర తెలంగాణలో బ్రిటీషు ప్రభుత్వానికి పరోక్షంగా, నిజాం సర్కారుకు ప్రత్యక్షంగా జరిగిన జాతీయోద్యమ వార్తలను రేడియో ద్వారా, పత్రికల ద్వారా, సంచార మానవులు చెప్పిన సమాచారం ద్వారా తెలుసుకున్న బ్రిటీషాంధ్ర రచయితలు సానుభూతితో సహకారం అందిస్తూ ఉద్యమ ప్రేరేపిత రచనలను రాశారు. వీరిని ఎస్వీ సత్యనారాయణ సూచించినట్టు ప్రవాహ ప్రేరితులుగా భావించాలి. వీరిలో ఆరుద్ర, కుందుర్తి, సుంకర సత్యనారాయణ, కోగంటి, తెన్నేటి సూరి, తుమ్మల వెంకట్రామయ్య, సోమసుందర్ లాంటి వారెందరో ఉన్నారు. వీరు రాసిన ప్రేరేపిత రచనలు తెలంగాణ జాతీయోద్యమంలో ప్రజలను ప్రేరేపించడంలో కీలమైన పాత్రనే పోషించాయి.

ఒకవైపు ప్రత్యక్ష పోరాటంలో ఉంటూనే, మరోవైపు తమ రచనల ద్వారా ప్రజలను చైతన్య పరిచిన ప్రావాహికులు అనేక మందే ఉన్నారు వారిలో.. మద్దోజు సత్యనారాయణ (చందూరు), ధవళా శ్రీనివాస రావు, వేముగంటి నరసింహాచార్యులు- సిద్దిపేట, కోగంటి దుర్గా మల్లిఖార్జునరావు- గ్రంథాలయోద్యమంలో పాల్గొన్నారు. దేవులపల్లి రామానుజరావు, రావెల వెంకట సీతారామారావు, బిరుదురాజు రామరాజు, గడియారం రామకృష్ణ శర్మ, బెల్లంకొండ చంద్రమౌళి శాస్త్రి, అద్లూరి అయోధ్యరామకవి, దాశరథి కృష్ణమాచార్య, కాంచనపల్లి చినవెంకటరామారావు, తిరునగరి రామాంజనేయులు, సుద్దాలహనుమంతు, వెంకట రాజన్న అవధాని వంటి కవులు క్లిష్ట పరిస్థితుల్లో కుటుంబానికి అండగా ఉండక జాతి స్వాతంత్ర్యం వైపు వెళ్ళడమే ముఖ్యమని భావించి తామనుకున్న మార్గంలో ముందుకు పయనించి అనేక మందికి మార్గదర్శకులయ్యారు. అంధకారం ఆవహించిన తెలంగాణకు దారిదీపం అయ్యారు. స్వాతంత్ర్య సమరయోధులై ప్రజల నాలుకలపై జీవిస్తున్నారు. భారత స్వాతంత్ర్య పోరాటంలోంచి వచ్చిన తెలంగాణ గీతాల్లో, గీతాల కర్తలలో స్మరించబడుతున్న వారి కంటే విస్మరించబడ్డవారి సంఖ్యనే అధికంగా ఉన్నది. అలాంటి వారిని స్మరణకు తేవడం ఈ వ్యాసం ప్రాథమిక ఉద్దేశ్యం.

**ఆధార గ్రంథాలు**


1. జాతీయ గీతాలు - గురజాడ శ్రీ రామమూర్తి
2. తెలుగులో ఉద్యమ గీతాలు - ఎస్వీ సత్యనారాయణ
3. స్వాతంత్ర్య సమరయోధుడు-అద్లూరి అయోధ్యరామయ్య - ఘనపురం సుదర్శన్
4. అభ్యుదయ మాస పత్రిక

**శిలాక్షరం**

**(బి.ఎన్.శాస్త్రి సాహిత్యం - సమాలోచన)**

ప్రముఖ శాసన, చారిత్రక పరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులు కీ.శే. బి.ఎన్.శాస్త్రిగారి రచనలన్నింటిపైనా సాధికారికమైన విశ్లేషణా వ్యాసాల సమాహారం 'శిలాక్షరం'.

సంపాదకులు : డా. భిన్నూరి మనోహరి
సహ సంపాదకులు : అట్టెం దత్తయ్య
వెల : 300/-




**సంప్రదించండి.**
**మూసీ మాసపత్రిక**
**ఫోన్ : 934 7971177**

**మూసీ**

**సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక**
**మూసీ మాస పత్రిక సభ్యులుగా చేరండి**
**వెంటనే శాశ్వత చందాదారులు కండి.**
**సాహిత్య రంగంలో వెలువడుతున్న ఒకే ఒక**
**పరిశోధనాత్మక వ్యాసాల మాస పత్రిక**
**యూజీసీ కేర్ లిస్ట్‌లో చేరిన తెలుగు పరిశోధనా పత్రిక**
**శాశ్వత సభ్యత్వం (10 సం॥లు)... 2500/-**
**సంప్రదించండి. మూసీ మాసపత్రిక... ఫోన్ : 934 7971177**

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 3 46 హైదరాబాద్ జనవరి : 2024

# దొరకునా ఇటువంటి సేవ !

వేముల ప్రభాకర్, ఫోన్ : 93986 61025

శాసనాల సేకరణ ,చరిత్ర గ్రంథ రచనకు జీవితకాలం కృషిచేసిన బి ఎన్ శాస్త్రిగారు!

తెలుగు భాష, సాహిత్యము, చరిత్ర, సంస్కృతుల కోసం విశేషంగా కృషిచేసిన పత్రిక కాశీనాథుని నాగేశ్వర రావు గారు స్థాపించిన భారతి మాస పత్రిక (1924–1991). పంతులు గారు, వారి వారసులు ఆంధ్ర పత్రిక, అమృతాంజనం వంటి సంస్థల అధిపతులు కాబట్టి సేవాభావంతో 'భారతి' ని దాదాపు ఏడు దశాబ్దాలపాటు నడుపగలిగారు.

నేటి యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ గ్రామంలో పుట్టి పెరిగిన భిన్నూరి నరసింహ శాస్త్రి (1932–2002) గారు భిన్నమైన వ్యక్తి. ఆయన సంపన్నుడు కాదు గానీ జ్ఞానసంపద పుష్కలంగా ఉన్నవాడు.


భారతి మార్గంలో ఒక పత్రిక నడపాలన్న పట్టుదలతో 1980 లో 'మూసీ' పేరుతో సాహిత్య, సాంస్కృతిక, చారిత్రక తెలుగు మాస పత్రికను స్థాపించి దానికి అన్నీ తానై దాదాపు 6 సంవత్సరాలపాటు నిర్వహించాడు. అలా ఆర్థిక ఇబ్బందులతో ఆగిపోయిన మూసీ పత్రిక వారసత్వాన్ని 1992 నుండి కొనసాగిస్తున్న వ్యక్తి శ్రీ సాగి కమలాకర శర్మ గారు.

నేను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార యూనియన్ ఎం డి గా వున్న (2002–2004) కాలంలో ఒకసారి శర్మ గారిని కలుసుకోవడం జరిగింది. తెలంగాణ, ఆంధ్ర మారుమూల ప్రాంతాలకు వెళ్లి సేకరించిన ఎన్నో అమూల్యమైన శాసనాలను పరిష్కరించడంలో, గ్రంథ ప్రచురణలో, మూసీ పత్రిక నిర్వహణలో శ్రీ బి ఎన్ శాస్త్రి గారు పడ్డ శ్రమను, చివరి రోజుల్లో వారు ఎదుర్కున్న ఆర్థిక ఇబ్బందులను గూర్చి మొదటిసారి కమలాకర శర్మ గారి ద్వారా తెలుసుకొని చలించిపోయాను. ఆరోజుల్లోనే 'సహకారం' గురించి శాస్త్రి గారు ఒక నాటిక కూడా రచించడం విశేషం.

అప్పుడే శాసనాల శాస్త్రి శ్రీ బి ఎన్ గారి అభిమానిగా వారి గ్రంధాలను మా సంస్థ గ్రంథాలయం కోసం సేకరించాము.

ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు శ్రీ రావి నారాయణ రెడ్డి లాంటి వారితో కలిసి నిజాం వ్యతిరేక పోరాటంలో పాల్గొన్నవాడు, అజ్ఞాతవాస జీవితం గడిపినవాడు బి ఎన్ శాస్త్రి గారు.

శాస్త్రి గారు తెలుగు, సంస్కృతం మాత్రమే కాదు పాళీ భాష కూడా తెలిసినవాడు, భారతదేశ చరిత్ర విశేషించి తెలంగాణ చరిత్ర సంస్కృతులను బాగా అధ్యయనం చేసిన వాడు, అంతేకాదు వారు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం పాటుపడ్డ వారు కూడా.



ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి **'శాసనములలో తెలుగు భాషా పరిణామము'** అన్న విషయంపై పి హెచ్ డి లో భాగంగా శాస్త్రి గారు ఎంతో శ్రమించి ఎన్నో ప్రాంతాలకు వెళ్లి పెక్కు శాసనాలను సేకరించి అధ్యయనం చేశాక **'ఆదికవి నన్నయ్య కాదు అంతకు ముందువాడైన నన్నెచోడుడు'** అన్న నిర్ణయానికి వచ్చి వారు చేసిన సిద్ధాంత గ్రంథ రచన ఎందుకో ఆరోజుల్లో యూనివర్సిటీ వారికి మింగుడుపడలేదట.

అయినా నిరాశ చెందకుండా వారు తమ శాసన, చరిత్ర అధ్యయనాన్ని, గ్రంథ ప్రచురణను జీవితాంతం కొనసాగించారు.

చరిత్రలోవిష్ణుకుండినుల రాజధాని అమరావతి, విజయవాడ కాదు అదే ఇంద్రవర్మ నిర్మించిన ఇంద్రపాలనగరం. నేటి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని తుమ్మలగూడెం అని తేల్చిచెప్పారు శాస్త్రి గారు.

విష్ణుకుండినులు, కందుకూరిచోళులు, కళ్యాణిచాళుక్యులు, కాకతీయులశాసనాల సంపుటి, వేములవాడ చరిత్ర శాసనాలు, గోలకొండ చరిత్ర సంస్కృతి శాసనాలు వంటి ఎన్నో గ్రంథాలు ప్రకటించారు.

వారి కృషి వల్ల 1993 లో మహబూబ్ నగర్ జిల్లా సర్వస్వము వెలువడింది.

భారత దేశ చరిత్ర సంస్కృతి

ఢిల్లీ సుల్తానుల నుండి మొదలు పెట్టి సంస్థాన పాలకుల వరకు 21 భాగాలలో వెలువరించారు.

పి ఎస్ ఆర్ తెలుగు విశ్వ విద్యాలయం 1997 లో బి ఎన్ శాస్త్రి గారిని విశిష్ట పురస్కారం తో గౌరవించింది.

విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు చేయాల్సిన కృషిని ఎక్లాచలో! అంటూ ఒక్కడే చేసి భావితరాల కోసం ఎంతో అమూల్యమైన చరిత్రను సేకరించిపెట్టిన శ్రీ బి ఎన్ శాస్త్రి గారి జన్మధన్యం!

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 3

UGC Care List Approved Journal
హైదరాబాద్ జనవరి : 2024

# మహాభారతం: 'ధర్మ' ప్రశ్నలు – 'భీష్మ' సమాధానాలు

**డా. అట్టెం దత్తయ్య** , సహాయాచార్యులు, ఎస్వీ కళాశాల, ఢిల్లీ విశ్వవిద్యాలయం. ఫోన్ : 9494715445

**ఉపోద్ఘాతం:** మహాభారతం వివిధ రకాల ఆలోచనలు గల వ్యక్తులకు వివిధ రకాలుగా కనిపిస్తుంది. భారతం ఒక గ్రంథమే అయినప్పటికి అది అనేక శాస్త్రాల సమ్మేళనం. అందుకేనేమో నన్నయ **"ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని, యధ్యాత్మవిధులు వేదాంతమనియు, నీతి విచక్షణుల్ నీతి శాస్త్రంబని..."** (శ్రీమదాంధ్ర మహాభారతము, ఆది. 1. 32) అనే పద్యంలో ధర్మతత్త్వజ్ఞులు, ఆధ్యాత్మికవేత్తలు, నీతివిచక్షణులు, కవులు, లాక్షణికులు, ఐతిహాసికులు, పౌరాణికులు మొదలైన వర్గీయులందరికి మహాభారతం వారికి కావల్సిన రీతిలో ధర్మశాస్త్రంగా, ఆధ్యాత్మిక శాస్త్రంగా, నీతిశాస్త్రంగా, మహాకావ్యంగా, లక్షణశాస్త్రంగా, ఇతిహాసంగా, పురాణంగా గోచరిస్తూ సమాధానాన్ని ఇస్తుందని తెలియజేసాడు. ఇందులో అనేక ఆఖ్యానాలు, ఉపాఖ్యానాలు, సంవాదాలు ఉన్నాయి. వాటితో పాటు ప్రశ్నల పేరుతో యక్షప్రశ్నలు, నహుష ప్రశ్నలు, ధర్మరాజు ప్రశ్నలు కూడా కనిపిస్తాయి.

తెలుగు వాఙ్మయంలో ప్రామాణిక మహాగ్రంథాలు చాలా వరకు కొందరి ప్రశ్నల వల్లనే ఉద్భవించాయి. మహారచయితలు సామాన్యులకు సైతం చేరువ కావాలనే ఉద్దేశంతో పాఠకులకు వచ్చే సంశయాన్ని వారే ప్రశ్నలుగా మలచి సమాధానాలు అందించిన గ్రంథాలను కూడా మనం గమనించవచ్చు. ప్రత్యేక ప్రశ్నోత్తర గ్రంథాలు మాత్రమే కాకుండా వేదాలు, పురాణాలు, ఇతిహాసాలు, కావ్యాలు వంటివాటిలో భాగంగా కూడా ప్రశ్నోత్తరాలు దర్శనమిస్తాయి. ఇలాంటివాటిలో భారతం ప్రత్యేకం. భారతంలో ముఖ్యంగా జనులందరికీ చేరువైనవి యక్షప్రశ్నలు. అట్లాగే మూలభారతం ఆధారంగా నహుష ప్రశ్నలు కూడా కొంత వెలుగులోకి వచ్చాయి. కాని అదే భారతం, శాంతి పర్వంలో గల ధర్మరాజు ప్రశ్నల మీద కావాల్సినంత పరిశీలన జరగలేదని నా భావన.

**ధర్మరాజు ప్రశ్నల నేపథ్యం:** ఏ కారణం లేకుండా పశ్నొలేదు. సమాధానం లేదు. అన్నట్లుగా ఈ ధర్మరాజు ప్రశ్నలకు కారణం కూడా ఉంది. అదేమిటంటే కురుక్షేత్రయుద్ధం అనంతరం ధర్మరాజు చింతాక్రాంతుడైనాడు. పశ్చాత్తాపం పొందాడు. జరిగిన సర్వనాశనానికి అతడే కారణమనుకున్నాడు. అందుకే తనకు రాజ్యపాలన అర్హత లేదని, తాను మహా పాతకుడినని బాధపడ్డాడు. ఆ పాప నివారణ జరగాలంటే తాను అరణ్యవాసానికి వెళ్ళి, భిక్షాటనచేస్తూ తపమాచరించాలని నిర్ణయించుకున్నాడు. ఆ సమయంలో తమ్ములు, ద్రౌపది, శ్రీకృష్ణుడు ధర్మరాజును పట్టాభిషేకానికి రకరకాల మాటలతో ప్రేరేపించాల్సి వచ్చింది.



వేదవ్యాసుడు కూడా బోధించాడు. చివరకు షోడశమహారాజు వృత్తాంతం చెప్పిన తర్వాత రాజ్య పట్టాభిషేకానికి అంగీకరించాడు. పట్టాభిషేకం అనంతరం కూడా ధర్మరాజు మనస్సు సంతోషంగా లేదు. ఆ రాజు మనశ్శల్యాన్ని సరిచేయడానికి భీష్ముడే సరైనవాడని వ్యాసుడు, కృష్ణుడు కలిసి నిర్ణయించారు. భీష్ముడు ఆ సమయంలో అంపశయ్యమీద పడుకుని ఉత్తరాయణం కోసం ఎదురుచూస్తున్నాడు. స్వయంగా కృష్ణుడు పాండవులను వెంటపెట్టుకుని అతని దగ్గరకు వెళ్ళాడు.

భీష్ముడిని కుశల ప్రశ్నలు అడిగిన తర్వాత శ్రీకృష్ణుడు **"ఈ ధర్మరాజు మిత్రులు, బంధువులు అందరు మరణించగా దుఃఖంతో బాధాతప్తుడై ఉన్నాడు. నీ ఉత్తమమైన మాటల పోహళింపుచేత ధర్మరాజు బాధను తొలగించవసిందని కోరుతున్నాను.''** (శాంతి. 2. 109) అని అన్నాడు. కృష్ణుడి రాకకు భీష్ముడు సంతోషించాడు. ఆయనకు కుచ్చుకుని ఉన్న బాణాలతో శరీరంతో పాటు, మనస్సుకూడా వశవర్తి కానివ్వడం లేదు. కృష్ణుడితో సంభాషించే సామర్థ్యం కూడా లేదు. కంఠధ్వని, నాలుక స్పష్టతను కోల్పోయాయి. ప్రత్యుత్తరం ఇవ్వలేను క్షమించండని భీష్ముడు అంటాడు. ఆ బాధలు తొలగిపోవడానికి కృష్ణుడు భీష్ముడికి మూడు వరాలు ఇచ్చాడు. బాణాల వల్ల ఎలాంటి నొప్పి కలుగకుండా సుఖంగ ఉందుట మొదటిది. ఆకలి దప్పుల పీడ లేకుండా ఉండుట రెండవది. అతని మనసు దేనికి అంటకుండా అతిశయజ్ఞానాన్ని పొందుట మూడవది. అప్పుడు భీష్ముడు ఏ బాధ లేకుండా ఉన్నతమైన విజ్ఞానాన్ని పొందినట్లు కూడా గ్రహించాడు. అయినప్పటికీ కృష్ణుడినీ **"పాండవులకు ఇవన్నీ నీవెందుకు చెప్పవు"** అని అడుగుతాడు. **"అత్యుత్తమ కీర్తిని నీకు కూడా ప్రసాదించాలని తదనుగుణంగా నా జ్ఞానాన్ని నీ మనస్సులో ప్రవేశపెట్టాను"** (శాంతి. 2. 147) **"నీవు**

**సెప్పెడి సువాక్యములును వేదతుల్యంబులై వెలయుచుండు...”** (శాంతి. 2. 148) అని భీష్ముడు చెప్పే మంచి మాటలన్నీ వేదాలతో సమానమైనవని శ్రీకృష్ణుడు పలికాడు. ఈ మాటల ఆధారంగా భీష్ముడు చెప్పబోయే సమాధానాలు అన్నీ కృష్ణుడు చెప్తున్నట్లుగానే భావించాలి. ఇందులో ధర్మరాజు ఇంచుమించు 205 ప్రశ్నలు అడిగాడు. ధర్మరాజుకి భీష్ముడు స్వధర్మాచరణ గురించే బోధించాడు. భగవద్గీతలో కూడా అర్జునుడికి శ్రీకృష్ణుడు అదే బోధించాడు. ఈ భీష్మబోధ కూడా ఒక భగవద్గీత వంటిది. భగవద్గీత ప్రభుసమ్మితము. అందులో ఉపాఖ్యానాలు లేవు. కాని భీష్మబోధ సుహృత్సమ్మితము. ఇది అనేక ఉపాఖ్యానాల సమ్మేళనం కూడా. కొన్ని సమాధానాలను భీష్ముడు కాంతా సమ్మితంగా కూడా తెలియజేసినట్లు కనిపిస్తాయి.

**భీష్ముడు-ధర్మరాజు :** ప్రశ్న ఒక మెట్టు అయితే సమాధానం మరొక మెట్టు. అంటే ప్రశ్నించే వారి స్థాయి కూడా ఒక ప్రత్యేకమైనదే. ఉత్తరం అందించే వారిస్థాయికి తగ్గట్టుగా ఉండాలి. లేకుంటే ప్రశ్నోత్తరాలలో పస ఉండదు. ఇక్కడ భీష్ముడు, ధర్మరాజు ఇద్దరు మహానుభావులే. భీష్ముని గురించి ఈ సందర్భంలో కృష్ణుడు

> **“రాజటె! రాగహీనుఁడటె! రాజిత సుందరమూర్తి యట్టె! వి**
> **భ్రాజిత సంపదున్నతి విభాసిత వర్తనుడట్టె! కామినీ**
> **రాజి మనోజ్ఞభంగి చతురత్వ ధనుండటె! బ్రహ్మచర్య దీ**
> **క్షా జిత మన్మథుండు నటె! జన్మము లిట్టివి యెందు గల్గునే?”**
> (శాంతి. 2. 103)

అనే పద్యంలో క్షత్రియుడిగా జన్మించాడు, విరాగియై మహర్షిగా జీవించాడు, ఎంతటి ప్రకాశ సుందరమూర్తియో అంతకంటే అత్యున్నత ప్రకాశంగా వెలుగొందే నడవడిక కలవాడు. స్త్రీ సమూహానికి మనోహరమైన నైపుణ్య సంపద కలవాడు. కాని బ్రహ్మచర్యదీక్షచేత మన్మథుడిని జయించినవాడు. ఇట్లాంటి జన్మలు మరెక్కడైనా సంభవిస్తాయా? అంటాడు. అంతేకాదు **“చతుర్వర్ణాల ప్రజలు, చతురాశ్రమాలలో ఆయా ప్రజలు చేయవలసిన అర్హమైన కార్యకలాపాలు, చతుర్వేదాలలో చెప్పబడిన అన్ని ధర్మాలు నీకు తెలుసు. ప్రవృత్తినివృత్తి మార్గాలు, సాంఖ్యయోగాలు, పురాణేతి హాసాలు, ధర్మశాస్త్రాలు నీకు తెలుసు. ప్రవృత్తినివృత్తి మార్గాలు, సాంఖ్యయోగాలు, పురాణేతిహాసాలు, ధర్మశాస్త్రాలు నీకు కరతలామల కాలే. నీవు సర్వసంశయాలను నివృత్తి చేయగల సమర్థుడవు. మీవంటి వారి సర్వసమర్థతకు, బుద్ధివిస్తారతకు, శోకమోహాలతో బాధా సంతప్తులైన ప్రజలను తరింపచేయటమే ప్రయోజనం కదా!”** (శాంతి. 2. 110) అనే కృష్ణుడి మాటలు భీష్మునియొక్క అనుభవత్వాన్ని, విజ్ఞానాన్ని, సామర్థ్యాన్ని తెలియజేస్తాయి. ఇంతటి మహోన్నత వ్యక్తిని ప్రశ్నలు అడగాలి అంటే అన్ని రకాల విషయ విజ్ఞానం అవసరం. అట్లాంటి వారు భారతంలో ధర్మరాజు ఒకరే కనిపిస్తారు. ఆ ధర్మరాజును గురించి ఈ సందర్భంలో స్వయంగా భీష్ముడే **“ఎవ్వఁడు పుట్టిన నెల్ల మునీంద్రులు...”** (శాంతి. 2. 151) అనే పద్యంలో ఎవ్వడి జన్మకారణంగా సమస్త మునీంద్రులు సంతోషాంతరంగులయ్యారో, పరమధార్మికులని పేరు పొందిన భరత వంశీయులు కూడా ఎవ్వడితో సాటిరారో, సత్యం, శౌచం, శాంతి దాంతులు ఎవ్వడియందు ప్రకాశిస్తూ ఉంటాయో, పాత్రులైన వారికే దానం చేయటం, యజ్ఞాలనూ, బంధువులను, రక్షించటం మొదలైన ఉత్తమ ధర్మాలన్నీ ఎవడికి సంతోషాన్ని కలిగిస్తుంటాయో, కామంవలన కాని, భయం వలన కాని, అవినీతి మార్గంలో ఎవడయితే ప్రవేశించడో అటువంటి ఉత్తమగుణగణుడైన వాడు ధర్మరాజు అంటాడు. భారతంలో ధర్మరాజు బహుముఖీనంగా దర్శనమిస్తాడు. ఎంతటి వీరుడో అంతటి శాంతిమంతుడు. ధర్మాధర్మాలు తెలిసివాడు. కుటుంబ నిర్వహణలో, రాజ్య పాలనలో తనకుతానేసాటి. ఆయన స్వయంగా రాజు అయినప్పటికి ధర్మగామి, మోక్షగామి. బాల్యంనుడి అనేక సమస్యలను ఎదుర్కొన్నవాడు కావడంతో అన్ని రకాల ప్రశ్నలను అడిగాడు.

**ప్రశ్నలు - సమాధానాలు :** మనిషి పరిణామ రహస్యం ప్రశ్నించడం అనే సులభమైన ప్రక్రియతో ప్రారంభమౌతుంది. ఏదైనా తెలుసుకోవాలంటే ఎరుకతో ప్రశ్నించడమే ఏకైకమార్గం. ప్రశ్నించడం అనేది తనను తాను అభివృద్ధి పరచుకోవడానికి ఓ మంచి పరికరం. ప్రశ్నలే ఉన్నత లక్ష్యాలవైపు నడవడానికి సహాయం చేస్తాయి. ప్రశ్నించడం ఒక కళ. ప్రశ్నించడం ఒక బాధ్యత. ప్రశ్నించడం ఒక తెలివిడి కోసం చేసే యత్నం. ప్రశ్నలు పలురకాలు. మానసిక సంబంధమైనవి. శారీరక సంబంధమైనవి. ఆధ్యాత్మిక సంబంధ మైనవి. సమాజ సంబంధమైనవి. ప్రశ్నలు అడగడంలో కూడా తేడాలుంటాయి. తెలుసుకోవాలనే జిజ్ఞాసతో అడగడం. ఎదుటివాడికి తెలుసాలేదా పరీక్షకోసం అడగడం. నాకు ఆ రంగంలో విజ్ఞానం ఉందని చూపించుకోవడం కోసం అడగడం. అడిగిన ప్రశ్న ఆధారంగా వారి స్థాయిని నిర్ణయించవచ్చు. మనస్తత్వాన్ని గమనించవచ్చు. అడిగే ప్రశ్నలు వారి అస్తిత్వాన్ని కూడా పట్టిస్తాయి.

అసలైన ప్రశ్నలు సమాధానాలు అంతంకాని గొలుసువంటివి. సమాధానం కూడా మరొక ప్రశ్నకు దారితీసినప్పుడే మనిషి ఎదుగుదల నిరంతరం పరివ్యాప్తమవుతూ ఉంటుంది. చాలామంది ఈ ప్రయాణంలో ఆగిపోయే అవకాశం ఉంటుంది. లభించిన సమాధానంతోనే సంతృప్తిచెందే వారు ముందుకు వెళ్ళలేరు. ప్రశ్నను సమీకరించి సరైన మార్గంలో సంధిస్తే సమాధానం కనుగొనడం అసాధ్యం కాదు. ప్రశ్నను అడగడం అంటే మనల్ని మనమే సమాధానాలను అందుకునే పథంలో నియమించుకోవడం అని అర్థం. ప్రశ్నను కలిగి ఉన్నప్పుడే సమాధానాలను ఆకర్షించగల శక్తిని కలిగి ఉంటారు. ప్రశ్నించిన వ్యక్తికి సమాధానం తెలుసుకోవడంలో ఉత్సాహం లేనప్పుడు అక్కడ సమాధానం ఉ

ఒడదు. ప్రశ్నించడం అనేది విత్తునాటడం వంటిది. ఏ విత్తును నాటుతున్నారో ఆ వృక్షఫలాలను పొందుతారు.

**ధర్మరాజు ఎలాంటి ప్రశ్నలు అడిగాడు:** మొదట రాజధర్మాలు, తరువాత ఆపద్ధర్మాలు, అనంతరం మోక్షధర్మాలకు సంబంధించిన ప్రశ్నలు కనిపిస్తాయి.

**రాజధర్మాలు:** 'రాజధర్మము' అనే పదానికి శ్రీసూర్యరాయాంధ్ర నిఘంటువు 'రాజు చేయవలసిన పని, రాజుకు సంబంధించు ధర్మము' (శ్రీసూర్యరాయాంధ్ర నిఘంటువు. సం.5.పుట.969) అర్థాలను అనే తెలుపుతుంది.

**"సర్వే ధర్మాః రాజ ధర్మ ప్రధానాః**
**సర్వే త్యాగః రాజధర్మేషు దృష్టాః**
**సర్వా దీక్షా రాజ ధర్మేషు చోక్తాః**
**సర్వా విద్యా రాజధర్మేషు యుక్తాః**
**సర్వే లోకాః రాజధర్మే ప్రవిష్టాః."** (సం.భారతం. శాంతి.63 అధ్యా.27శ్లో) అనే మూల భారత శ్లోకాల ప్రకారం అన్ని ధర్మాలలో రాజధర్మమే ప్రధానమని తెలుస్తుంది. రాజధర్మాలోనే అన్ని త్యాగాలు కనిపిస్తున్నాయి. సమస్త దీక్షలు రాజధర్మాలోనే చెప్పబడ్డాయి. సర్వ విద్యలు రాజధర్మాలోనే ఇమిడి ఉన్నాయి. సర్వలోకాలు రాజధర్మంలోనే ప్రవేశించాయి అని తెలియపరుస్తున్నాయి. మరో శ్లోకం రాజు మాహాత్మ్యాన్ని తెలియజేస్తుంది.

**"మాతా పితా గురుర్గోప్తా వహ్నిర్వైశ్రవణో యమః**
**సప్తరాజ్ఞో గుణానేతాన్ మనురాహ ప్రజాపతిః."** (భారతం శాంతి 139అధ్యా.104శ్లో) రాజు ప్రజలయెడ కృపకలిగి రక్షించును - కాబట్టి తండ్రి. దీనులను దుఃఖితులను - భాగ్యవంతులను అందరిని సమానదృష్టితో చూసే వాడు కాబట్టి తల్లి. ప్రజలలో - అప్రియులైన వారిని దహించును గనుక అగ్ని దుష్టుల దమనమతని విధి కనుక యముడు, ప్రియ జనులకు రెండు చేతుల దానమొసంగును గనుక కుబేరుడు. ధర్మోపదేశము గావించును గనుక రాజే గురువు. సర్వుల రక్షించువాడు గనుక రక్షకుడతడు అంటూ పై శ్లోకం రాజునే సర్వస్వుడిగా ప్రకటించింది. వివిధ సందర్భాలలో రాజులు పాటించిన, పాటించాల్సిన అనేక అంశాలను భీష్ముడు ధర్మరాజుకు తెలియజేసాడు.

**ఆపద్ధర్మాలు :** 'ఆపద్ధర్మం' అంటే నిఘంటువు ప్రకారం **'ఆపదయందు అనుష్ఠింపదగిన ధర్మము'** (శ్రీ సూర్యరాయాంధ్ర నిఘంటువు. సంపు.1.పు.391) అని తెలుస్తుంది. ప్రాణాపాయ స్థితిలో కాని, మార్గాంతరం లేనపుడు గాని అనుసరించవలసిన విధానమే ఆపద్ధర్మం. ఆపద్ధర్మాలనేవి ఆపద తీరిన తరువాత విడువవల్సినవే తప్ప అవి సదాచారాలు కావు. తాత్కాలికంగా గండం గడిచిన తర్వాత సామాన్య జీవితానికి రావాలి. ఈ ఆపద్ధర్మాలు ఒక్కొక్కపుడు ధర్మాన్ని అధర్మంగాను, అధర్మాన్ని ధర్మంగాను మారుస్తాయి.

ఆపదలు పలురకాలుగా కనిపిస్తాయి. అవన్ని రెండు విధాలుగా సంభవిస్తాయి. మనుషుల వల్ల, దైవం వల్ల. మనుషులవల్ల సంభవించే వాటిని ఐదు రకాలుగా చూడవచ్చు. 1. అధికారుల వల్ల 2. దొంగల వల్ల 3. పాలకుల సన్నిహితుల వల్ల 4. విరోధుల వల్ల 5. దురాశల వల్ల. దైవికంగా సంభవించే ఆపదలునూ ఐదురకాలు. 1. దుర్భిక్షం 2. వరదలు 3. వ్యాధులు 4. అగ్ని 5. మరణం.



ఈ 'ఆపద'ను గురించి భారతంలో 'ఆపత్తు, కష్టము' అనే అర్థంలో కొన్నిచోట్ల వాడినట్లు కనిపిస్తుంది.

**"ఒక నాఁడేమును నావదలకు విడుమరఁగాంచి..."** **(విరా.1.49)**

**"శిఖిచోరాది ముఖ్య విషయాపదకున్..." (శాంతి.4.34)**

**"కోపంబును లోభంబును, నేపారి మనంబు గలఁప నెప్పుడుఁ జింతాతాపంబు నొందు సధనుండాపదగా..."** (శాంతి.4.35) అనే పై మూడు ఉదాహరణల్లో 'విపత్తు, కష్టము' అనే అర్థాల్లోనే వాడారు. ముఖ్యంగా భీష్ముడు బోధించిన ఆపద్ధర్మాల గురించి 'ఆపదలయందు అవలంబించదగిన ధర్మం' గా కనిపిస్తాయి.

**"గాయంబు వికృతులఁగాల పర్యయముల వచ్చు నాపద్ధర్మ వర్తనములు..."** (అను.5.216) శరీర, కాల మార్పుల వల్ల వచ్చేవి ఆపద్ధర్మాలుగా చెప్పాడు. ఇక్కడ శరీరానికి ఆపద కలిగిన సమయంలో ఆపద్ధర్మంగా కొన్నింటిని అధిగమించవచ్చు అని తోస్తుంది. శాస్త్రాలు 'శరీరమాద్యం ఖలు ధర్మ సాధనం' అంటూ శరీరాన్ని కాపాడుకున్నపుడు ధర్మాన్ని సాధించవచ్చు, నిలబెట్టవచ్చు. ప్రతిసామాన్యుడికి అవసరమయే ఈ ఆపధర్మాలను భీష్ముడి మాటల్లో చాలా తెలుసుకునే అవకాశం ఉంది.



**మోక్షధర్మాలు**: సామాన్యంగా మనిషికి కలిగే ఆత్మవిషయపరంగా చిన్నా పెద్దా సంశయాలన్నిటిని తీర్చి మానవుడు తనను తాను తీర్చిదిద్దుకునే మార్గాన్ని నిపుణతతో బోధించిన విషయాలన్ని మోక్షధర్మాలు.

"భారతీయ తత్త్వశాస్త్రంలో మోక్షము పరమపురుషార్థము. జనన మరణ రూపమైన భవబంధము నుండి విడివడి శాశ్వతానందము పొందుట మోక్షమనబడుతుంది. సకల క్లేశములు తొలగినపుడు సంసార బంధముక్తి కలుగుతుంది. కర్మలు స్వఫలోపభోగం దాకా నిలిచి, క్షీణించి పోవును. కర్మలకు మూలం అజ్ఞానం. అజ్ఞానమే అవిద్య. తత్త్వజ్ఞానం వలన అజ్ఞానం నశిస్తున్నది. కర్మజనితమైన బంధము, తజ్జన్యమైన జననమరణాది రూప దుఃఖము సమూలముగా నశించిపోవుచున్నది. అందువలన దర్శన కర్తలెల్లరు 'తత్త్వజ్ఞానాన్ మోక్షః'. న్యాయవైశేషిక దర్శనాలు చరమ దుఃఖ ధ్వంసంగా అనగా అత్యంతిక దుఃఖ నివృత్తిగా నిరూపించినారు..." (శ్రీభాష్యం విజయసారథి, న్యాయ వైశేషికములు సాంఖ్యయోగములు. పు. 61) అంటారు.

మరో గ్రంథంలో మోక్షం గురించి **"మోక్ష మనగా విడుదల. బంధము నుండి విడుదల. దుఃఖ భూయిష్టమగు సంసార బంధమునుండి విముక్తి నొందుటయే మోక్షము. పుట్టుక చావులనుండి తప్పించుకొనుటయే మోక్షము. అవిచ్ఛిన్న ఆత్మానందానుభూతిని బడయుటమే మోక్షము. స్వస్వరూపమగు దైవమందు నిలుకడ కలిగియుండుటయే మోక్షము. దేహభారమును, మనోభారమును, జీవభారమును వదిలించుకొనుటయే మోక్షము. భారరహితమగు ఆత్మయందు నిలుకడ కలిగియుండుటయే మోక్షము..."** (విద్యాప్రకాశనందగిరి, 'మోక్షసాధన రహస్యము. పు. 1) ఇలా సెలవిచ్చారు. **"మోక్షస్థితియందు జీవుడు శివుడుగా మారును. నరుడు నారాయణుడై విలసిల్లును. భక్తుడు భగవంతుడై భాసించును. మానవుడు మాధవుడుగా పరిణమించును. అది ఒక అపూర్వ ఆనందస్థితి. దుఃఖము లవలేశమైనను అచ్చోట గాన్పించకుండును. ఈ ప్రపంచములో అన్ని లాభములకంటెను, గొప్ప లాభకరమైన స్థితియని"** దానిని గీతాచార్యుడు పేర్కొనెను.

**"యం లబ్ధ్వా చాపరం లాభం మన్యతే నాధికం తతః ।**
**యస్మిన్ స్థితో న దుఃఖేన గురుణాऽపి విచాల్యతే ॥"**
(భగవద్గీత. 6. 22)

పై శ్లోకంలో **"దేనిని పొందిన తర్వాత పొందదగనిది మరొకటి లేదని అనుకుంటాడో, దేనియందు నిలిచి ఎంత గొప్ప దుఃఖంలో కూడా చలించడో అచ్చోట జీవునకు కలుగు ఆనందము అవర్ణనీయము..."** (విద్యాప్రకాశనందగిరి, 'మోక్షసాధన రహస్యము. పు. 28) అని మోక్షాన్ని కొనియాడారు. ఇంతటి మహోన్నతమైన మోక్షాన్ని గురించి ధర్మరాజు అనేక ప్రశ్నలను అడిగాడు. మూడు రకాల ధార్మిక ప్రశ్నలన్నింటికి శరశయ్యమీద ఉన్న భీష్ముడు ఇతిహాసదృష్టాంత పూర్వంగా, శాస్త్రసమ్మతంగా సమాధానాలు చెప్పాడు.

**"ధర్మజునకు నీ చెప్పెడు**
**ధర్మస్థితి వాక్యసమితి తాత్పర్యముతో**
**నిర్మలులై కొనియాడెడు**
**ధార్మికులకు నుభయజగదుదాత్తత కలుగున్."** (శాంతి. 2. 149)

అంటూ కృష్ణుడు అభయాన్ని కూడా ఇచ్చాడు. (సశేషం)

**ఆధార గ్రంథాలు:**


1. సుబ్రహ్మణ్యం, జి.వి. సంపా. **'కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము'** (అన్ని పర్వాలు, పదిహేను సంపుటాలు). 2014. తిరుపతి: తి.తి.దే.

2. హనుమంతరాయ శర్మ, బలభద్రపాత్రుని. **'మహాభారత విమర్శనము'** (రెండు సంపుటాలు). 1996. గుంటూరు: భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్.

3. భూమయ్య, అనుమాండ్ల. సంపా. '**ఆంధ్రమహాభారత పీఠికలు**'. 2010. హైదరాబాదు: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

4. రామకృష్ణమూర్తి, తిప్పాభట్ల. శ్రీనివాసులు, సూరం. సంపా. **'శ్రీమహాభారతము'** (అన్ని పర్వాలు, ఏడు సంపుటాలు). 2018. గోరఖ్‌పూర్: గీతాప్రెస్.

5. శివారెడ్డి, ఎల్లూరి. సంపా. '**ఆంధ్ర మహాభారతోపన్యాసములు**' (ఉపన్యాస సంకలనం). 2007. హైదరాబాదు: ఆంధ్రసారస్వత పరిషత్తు.



# ముకుంద కవితా వీక్షణం

**ఆచార్య బూదాటి వేంకటేశ్వర్లు,** తెలుగు శాఖాధ్యక్షులు, బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం, ఫోన్ : 94413 30511



**"హరిణా జాణంతి గుణారణ్ణే వసిఊణ గేయ మా హప్పం**
**తాణం చియ నత్థి ధణం జీయం వాహస్స అప్పంతి"** (వజ్జాలగ్గం–హరిణవజ్జా)

కవులు, నిరంతరం వారు చేసే కవితాసాధన, లాభాపేక్షలేని వాళ్ళ ప్రచురణలను చూస్తున్నప్పుడు పై పంక్తులు గుర్తుకు వస్తాయి. పై పంక్తుల సారమేమంటే అరణ్యంలో నివసించే హరిణాలు గేయమాహాత్మ్యాన్ని బాగా ఎరిగినవి కావటంచేత, గాయకునికి సమర్పించటానికి తమవద్ద ధనం లేనందున తమ జీవాన్నే గీతచ్ఛలమున వేటాడే వేటగానికి సమర్పిస్తోంది. కవులు కూడా కవిత్వపిపాసులు కావటంచేత ఆ కవితోపాసనలో కాలాన్ని, ధనాన్ని శక్తిని ధారపోసి సాహిత్య సరస్వతిని సుసంపన్నం చేస్తున్నారు. ముకుందరామారావుగారు కూడా అలాంటి హరిణమే!

రామారావుగారితో నా పరిచయం సూఫీకవిత్వ పరిచయంతో. అప్పటినుండి వారి ప్రతి ప్రచురణను నేను గమనిస్తూ వస్తున్నాను. నిశ్శబ్దపు నీడల్లో సంచరించే సంధ్యారాగం, ఆకాశయానం చేసే మౌనపరాగం ఆయన హృదయం. ఎంత సున్నితమో అంత నిశితం ఆయన హృదయం. ముకుంద శబ్దానికి ముకుం మోక్షం దదాతీతి (మోక్షాన్నిచ్చేవాడు) అన్న అర్థమే కాదు. 'ముఖాత్ కుంద ఇవ ప్రతిభాతి' అనే వ్యుత్పత్తిలో "ముఖం నుండి మొల్లవలె తోచేది" – అనే అర్థం కూడా ఉంది. ఆయన మోము నుండి తోచి, మన మనసును దోచే మొల్లలు వారి రచనా సంపుటాలు.

మనం ఎప్పటికీ గుర్తుండి పోవాలంటే ఇతరులు చదువదగిన పుస్తకాలు రాయాలి. లేదా పరులు రాయదగిన పనులు చేయాలి. ముకుంద రామారావుగారు ఇతరులు చేయలేని పనులను రచనల ద్వారా చేసి, ఇతరులు తనగురించి రాసేలా చేస్తున్న సాధువర్తనులు. వర్తనలోను, వాక్కులోను తూకం తప్పని వ్యక్తిత్వం వారిది. పాతికేళ్ల మా స్నేహంలో వారి నోట ఎన్నడూ 'పరుషాలు' వినలేదు. అంతటి సరళహృదయం వారిది. కలిసే వ్యక్తుల్ని కాలం నిర్ణయిస్తుందంటారు. మా ఇద్దరినీ కాలమే కలిపి స్నేహసుధలు వర్షించింది. మనం కోరుకునే వ్యక్తుల్ని హృదయం నిర్ణయిస్తుంది. ప్రవర్తన మనతో ఉండేవారిని స్థిరీకరిస్తుంది. అలా వారి హృదయము, వర్తన వారి స్నేహవృత్తంలోకి ఆకర్షించింది.

అదేకాంతి, అదేనేల, అదేనీరు వంటి రచనలతోపాటు, బౌల్ కవుల అనువాదాలు, నోబెల్ బహుమతి పొందిన కవుల కవితల్ని, చర్యా పదాల్ని ఎన్నో అనువదించి తెలుగు వాళ్ళకు రుచి చూపించారు ముకుంద రామారావుగారు. ఇదికాకుండా వారు రాసిన కవితాసంపుటాలు ఉన్నాయి. 'నిశ్శబ్దం నీడల్లో', 'ఆకాశయానం', 'విడనిముడి', 'మరో మజిలీకి ముందు' – ఈ కవితా సంపుటాలలో వారి అభివ్యక్తిరీతిని పరిచయం చేసే ప్రయత్నం చేస్తాను.

అచ్చమైన నిజమైన సౌందర్యం, మేథాదృష్టి ఎక్కడ ప్రారంభ మవుతుందో అక్కడ సమాప్త మవుతుంది. మేథ ఏ వస్తువులోని సమగ్రశ్రుతినైనా, సమన్వయాన్నయినా ఆస్వాదించటానికి అడ్డువస్తుంది. హృదయంతో తడవని మేథ కళాసృజనలో ఆకర్షించలేదు. అందులో కవిత్వకళలోమరీ. అందుకే పడిగల వాక్యాలే కవుల్ని చిరంజీవుల్ని చేస్తాయి. మనిషి నిరంతరము తన సంస్కారాన్ని విజ్ఞానాన్ని పెంచుకోవటానికి ప్రయత్నిస్తాడు. ఉనికి కోసం మనిషి చేసే భీకరమైన సంఘర్షణలో శాశ్వతంగా నిలిచిపోయే దానివైపు మొగ్గడం సహజలక్షణం. అలా శాశ్వతమైన దానివైపు నిలవాలనుకోవటమే నాగరికతా ప్రస్థానం. కవులు కవిత్వ ప్రస్థానంలో చేసే నాగరికతా యాత్ర ఏమంటే శిల్ప మర్యాదలవైపు మొగ్గి, పాఠకుల హృదయాల లోని సుకుమారతను ప్రోది చేయటమే.

ముకుంద రామారావుగారికి Ism ప్రధానంకాదు. పరిణతి చెందిన కవియైనా, రచయిత అయినా కవితనో, కథనో చెపుతుంటే జీవితం నడుస్తున్నట్లుండాలి. ముకుంద రామారావుగారి కవిత్వం కూడా అలాంటి భావాన్నే కలిగిస్తుంది. ఆ కవితాసంకలనాల శీర్షికలే అలాంటి అనుభవాన్ని కలిగిస్తాయి 'విడనిముడి', 'నిశ్శబ్దపు నీడల్లో', 'మరో మజిలీకి ముందు' – వంటి శీర్షికలు జీవితానుభవాన్ని ధ్వనించే వక్రోక్తులు. ఏ కవిత్వమైనా అభివ్యక్తి సౌందర్యంతోనే రాణిస్తుంది. కేవల భావాలకు అభివ్యక్తి సౌందర్యం వలననే జవజీవాలు సిద్ధిస్తాయి. ఎంత గొప్ప నిసర్గ సుందర భావానికయినా ఇది తోడయితే మరింత విలువ సమకూరుతుంది.

కవి తన అభివ్యక్తి సౌందర్యానికి ఎంచుకునే ప్రధాన సాధనాలు.

1. భాష, 2. భావచిత్రం, 3. వక్రోక్తి / ధ్వని.

ముకుంద రామారావుగారి కవిత్వంలో ఏదో హడావిడి కనిపించదు. ఆ అభివ్యక్తి లలిత సుకుమారంగా ఉంటుంది. సంక్లిష్టత ఉండదు. మన ఎదదలలోని సుకుమారతను తడివినట్లనిపిస్తుంది.

**"వాకిట్లో వాలు కుర్చీ / మానాన్న**
**కదలికలన్నీ తన కోసమేననుకునే**
**సర్వేంద్రియాల సమాహారం**
**సకల మర్యాదలతో కూర్చోబెట్టిన**
**సజీవ విగ్రహం**

**ఎక్కడో ఏదో కోల్పోయిన చూపుల్లో**
**గతం వర్తమానపుశూన్యం**

**దేశంనుండి దేహందాకా ఆరాటంలో**
**మరణాన్ని పదేపదే ఆవాహన చేస్తున్న వృద్ధాప్యం**
**ఒక పురా వైభవ ప్రతీక / నడక ఆగిపోయాక**
**ప్రకృతి పరిసరాలు తోడు /ఒకప్పుడు అదిరిపోయి, బెదరిపోయిన**
**పిల్లలముందు / వినాలన్నా, వినిపించాలన్నా,**
**బేలగా ఎదురు చూసే పిల్లాడు**

**అటెటో తిరిగొచ్చేలోగా / ఆ కుర్చీ ఖాళీగా ఉన్నా,**
**మూలన పడున్నా / పరిపరి విధాల మనస్సు**
**ఆ కుర్చీ ఈనాటిదా? / వాళ్ల నాన్నది**
**బహుశా రేపునాది!"**

ఈ కవిత 'నాన్న' - అనేశీర్షిక కిందరాసింది. ఇందులో ముసలితనాన్ని 'వాలుకుర్చీ'కి సంకేతించి, వార్ధక్యాన్ని భావచిత్రాల దండతో అలంకరించటం ఈ కవిత ప్రత్యేకత. మళ్లిపోయిన వయసులో మౌనం తప్ప మరెవ్వరు పలకని సందర్భాన్ని, అన్నీ చెంతకు వచ్చే సందర్భాన్ని, ఎవరెటు కదిలినా ఆ కదలికల చైతన్యాన్ని తనకు అన్వయించుకునే సందర్భాన్ని -

**"కదలికలన్నీ తనకోసమేననుకునే**
**సర్వేంద్రియాల సమాహారం**
**సకల మర్యాదలతో కూర్చోబెట్టిన**
**సజీవ విగ్రహం"** - అన్న భావచిత్రంతో మనకు సాక్షాత్కరిస్తుంది. ఇంటికి వచ్చిపోయే వాళ్లు అడ్డంగా భావిస్తారనో పక్కకు కుర్చీని జరుపమంటారేమోనని, కోడుకో కోడలో తన మనవడో తనవైపుచూసి ముచ్చటలాడి కనికరిస్తారేమోనన్న అసహాయపు జాలి చూపుల ఎదురుచూపులు అన్నీ మూటకట్టుకొని మనల్ని పలుకరిస్తాయి. విగ్రహాలను పూజించటానికి వాటిదగ్గరకు మనమే వెళతాం. నైవేద్యాలు సమర్పిస్తాం. విగ్రహంలా కదలని ఈ సజీవవిగ్రహానికి కాఫీలు, అల్పాహారాలు, ఆహారాలు అన్న కూర్చున్న కుర్చీ చోటుకే వస్తాయి కాబట్టి 'సకలమర్యాదలతో కూర్చోబెట్టిన సజీవ విగ్రహమని రచయిత ప్రస్తావించాడు. ఇలా ఆ కుర్చీని సంకేతించి అభేద రూపకంతో తనతండ్రిని చెప్పిన ఈ భావచిత్రంతోపాటు

**'అటెటో తిరిగొచ్చేలాగా / కుర్చీఖాళీగాఉన్నా**
**మూలనపడున్నా / పరిపరి విధాలమనస్సు ....'**

- అంటూ చెప్పిన పంక్తులు జీవితంలో మన అనుభవంలోనివే. బయటి ఊరికో, వీధిలోకో వెళ్ళి తిరిగి ఇంటికి వచ్చేటప్పటికి కుర్చీలో ఉన్న నాన్న కనిపించక పోతే తండ్రికేమైందో, అశుభాన్ని వినవలసి వస్తుందేమోనన్న బాధతో పరిపరివిధాల మనస్సు ఆందోళనపడటాన్ని చెపుతాడు.

చివరిగా **"ఈ కుర్చీ ఈనాటిదా/వాళ్లనాన్నది/ బహుశా రేపునాది"** - అన్నప్పుడు కేవల కుర్చీ వారసత్వం మాత్రమేకాదు. వార్ధక్యంలో ఈ వేళ వాళ్ళ నాన్న అనుభవం, ఒకప్పుడు వాళ్ళ తాత అనుభవించినదే. రేపు తనకూ తప్పదని చెప్పటం.

ఇలా ఈ కవితను చదివినప్పుడు మన జీవితంలో ఎదురైన వార్ధక్యపు అనుభవాలతో మన మనసు సంవదిస్తుంది. అందుకే పరుచూరి రాజారాంగారు ఈ కవితను చదివి **"అదేదో నన్ను మా ఇంటినీ చూసి రాసినట్లుగా అనుభూతి కలిగించింది. వారసత్వపు కుర్చీ కూడా ఉంది. అందుచేత తాదాత్మ్యం కలిగిందేమో!"**- (విదనిముడి, పుట-110) అని అన్నారు. మానవ జీవనరీతికి అనుభూతిని అందించే అంతశ్శక్తి కవిత్వంలోనే ఉంది. జీవనం భౌతికాభివ్యక్తి అయితే, జీవనతత్త్వం జీవితసత్యం. ఆ సత్యాన్ని అన్వేషించే సాత్త్వికశక్తి ముకుంద రామరావుగారి కవితాచైతన్యపు ప్రవృత్తి - వస్తువులోని సౌందర్యంకంటే అభివ్యక్తిలోని సౌందర్యమే కవిని చిరాయువుని చేస్తుందనటానికి బోలెడన్ని ఉదాహరణలు కనిపిస్తాయి.

**"అమ్మానాన్నా / ఒకరి తరువాత ఒకరు**
**హఠాత్తుగా ఖాళీ చేసేసే ఇళ్లు**
**విత్తనాలన్నింటినీ విదిల్చిపోయే చెట్లు"** - (విదనిముడి - వాళు లేని ఇల్లు)

ఇది దూరమైన తల్లిదండ్రుల గురించి కవి రాసిన పంక్తులు. చెట్టు ప్రాణమంతా వేళ్లలో ఉంటుందని అనుకుంటారుగాని దాని ప్రాణమంతా దాని ఫలాలలోని గింజలలో ఉంటుంది. తల్లిదండ్రుల ఆశలు ప్రాణాలు బిడ్డలపైనే ఉంటాయి. ఒకరి తరువాత ఒకరు స్వర్గస్థులైన వాళ్లు 'విత్తనాల్ని విదిల్చిపోయిన చెట్లు'లా ఉన్నారని చెప్పడం కవి భావనాసీమలో విరిసిన అభేద రూపకం.

ఈ వేళ చదువుకున్న పిల్లలున్న ప్రతి ఇంట్లో తల్లిదండ్రులు పడేవేదన 'మరొకదు' (విదని ముడి) అనే కవితలో కనిపిస్తుంది. ఇక్కడ ఉద్యోగం రాక, భవిష్యత్తులేక, బ్రతుకుతెరువుకోసం విదేశాలకు వెళ్లే పిల్లలున్న ఇళ్లల్లో తల్లిదండ్రులు వాళ్లను పంపే సందర్భంలో-

**"అత్తారింటికి పంపుతున్న అమ్మాయికీ**
**అన్ని సముద్రాలావలకి పంపుతున్న అబ్బాయికీ**
**తేడా ఏమిటో తెలీదు"** – అని అనుకుంటారు, మన కవి ముకుందరామారావులా.

**"అమ్మని వదలి ఉండలేనివాడు / ఎక్కడికైనా....**
**అయినా / విడిచి వెళ్తున్నప్పుడు**
**నేలమీద వాడికన్నీళ్లు / ఈ భూమిని వదలనంటుంటే**
**ఆకాశంలో ఎగరటానికి**
**భారంగా లాక్కెళ్తున్న కాళ్లు...."** ఇది అంపకాల సన్నివేశాన్నే స్ఫురింపచేస్తుంది. చివరికి కన్నమనసులు

**"మావీథిలో అందరి ఇళ్లలాగే**
**మా ఇంటిలో మరొకడా..."** అనిసరిపెట్టుకున్నా
**"ఎలా బతికి బయటికొస్తాడో?"** – అన్న ప్రశ్న వాళ్ల మనసుల్లో కలగుండు పడుతుంది.

ఇలా మన కళ్ల ముందు కనిపించే దృశ్యాల్ని తన అనుభవంలో నుండి వ్యాఖ్యానించి చెప్పటం చేత ఈకవితలు మనల్ని ఆకర్షిస్తున్నాయి.


కళ్ల ఎదుట కనబడే దృశ్యాన్నో, సన్నివేశాన్నో సాధారణమైన మాటలతో చెపితే వాళ్లను కవులుగా పరిగణించం. కంటికి కనిపించని దానికి మూర్తిమత్వం కల్పించటంలోనే కవిత్వముంది. అందుకు కవి ఎంచుకునే ఉపమాద్రవ్యం, భాష పఠితను ఆకర్షిస్తుంది. మన అందరి అనుభవాలకు తాను ప్రాతినిధ్యం వహిస్తూ, మళ్లీ మనను ఆ అనుభూతిలో ఉన్మీలనం చేసి జాగృతపరుస్తాడు కవి. తాను భావనచేసే వస్తువులో వివశుడైపోకుండా, దానికంటే ఎదిగి, దానిమీద పెత్తనం చేస్తాడు. భావనను తన వశంచేసుకోగలిగితేనే రససిద్ధికి దోహదం చేయగలుగుతాడు.


''మరోమజిలీకి ముందు'' – అనే కవితా సంపుటిలో 'అదృశ్యదృశ్యం' అనే కవిత ఉంది. ఈ దృశ్యం నిత్యం మనం చూసేదే! కాని వాటిని కవి భావన చేసిన తీరును గమనిద్దాం.

**"పచ్చనిపైరు పరుపుమీద / ఎత్తయిన దిండులా కొండ**
**కాలువలో / చలికి వణుకుతున్నట్లు చెట్లు**
**రహస్య శోధనలో/ ఆకాశంలో పక్షులు**
**జోలపాట గాలి సంగీతం**

**పంటతో జంటగా / మురిసిపోతున్నమనిషి**
**అకస్మాత్తుగా నక్షత్రాలు విరిగి పడవు**
**ఆకాశం కూలి పోదు**
**అంతలో దృశ్యమే మారిపోతుంది**

**పిండి పిండవుతున్న కొండ / పగుళ్ళు బారుతున్న నేల**
**కాలి బాటవుతున్న కాలువ / ఎండిన కొమ్మలమీద**
**పక్షులు కాదు రాబందులు**





**పాతుకుపోదామనుకున్న, / మనుషుల మొక్కలు**
**తమనుతామే పెకలించుకొని / వీస్తున్న గాలివేపు పరుగు**
**ధూళి రేగుతున్ననేల వెనుక**
**లీలగా / ఎటూ ఆపలేని గుళ్ళు దేవుళ్ళు**
**కరిగినకలా? / చెరిగిన చిత్రమా?"**

ఇది మనకళ్లముందే జరుగుతున్న పచ్చని ప్రకృతి విధ్వంసం. ఇది కరిగిపోతున్న కలా? చెరిగిపోతున్న చిత్రమా? అని కవి వేసిన ప్రశ్న మన మనసులోని ప్రశ్నే!

పచ్చని పైరును పరుపుతో, కొండను ఎత్తయిన దిండుతో, కాలువ ప్రవాహానికి ఊగే చెట్లను చలికి వణుకుతున్నాయనటం, వీచేగాలి సంగీతం జోలపాటలా ఉందనడం, ఎదిగొచ్చిన పంటతోపాటు జంటగా మురిసిపోతున్న మనిషి – మన చిన్నతనంలో చూసిన ఒక మధురమైన దృశ్యం. అకస్మాత్తుగా మిన్ను విరిగి పడిపోదు కాని దృశ్యం మారిపోతుంది. అంటే జరిగిన మార్పు అకస్మాత్తుగా మనిషికి తెలియకుండా జరిగింది కాదు, తెలిసి చేసిందేనని చెప్పటం కోసం.

**"అకస్మాత్తుగా నక్షత్రాలు విరిగిపడవు**
**ఆకాశం కూలిపోదు**
**అంతలోదృశమే మారిపోతుంది"** – అని చెపుతారు.

కొండ పిండికావటం, నేల పగుళ్లు బారటం, కాలువ కాలిబాట కావటం, ఎండిన కొమ్మలపై రాబందులు వాలటం మారిన దృశ్యాలు. అయితే ఇక్కడే ఒక విషయాన్ని చెప్పి, కవి మన మనసుల్ని, తడిపివేస్తున్నాయి. అదేమంటే –

**"పాతుకు పోదామనుకున్న, / మనుషులమొక్కలు**
**తమను తామే పెకలించుకొని / వీస్తున్న గాలి దిశవేపు పరుగు**
**ధూళి రేగుతున్న / నేలవెనుక**
**లీలగా / ఎటూ ఆపలేని గుళ్ల దేవుళ్ళు"**

– 'పాతుకుపోదామనుకున్న మనుషుల మొక్కలు' అంటే స్థిరపడదామని (settle) అనుకున్న వాళ్లు, తమకు తామే సమూలంగా

సమాజ ధోరణి కనుకూలంగా పరుగెత్తి పోతున్నారు. 'వీస్తున్న గాలి' – అంటే ప్రపంచీకరణ, Market oriented culture. ఆ వ్యాపార సంస్కృతి ముందు నిలువ దొక్కుకొని సంబాళించుకునే శక్తిలేక తమనుతావే పెకలించుకొని పరుగెత్తి పోతున్నారు. ఈ పరుగుపందెంలో రేగినధూళిని ఏ దేవుడూ ఆపలేకపోతున్నాడు. ఎటూ ఆపలేకపోవటం అంటే సమూలంగా పెకలించుకు పారిపోతున్న మనిషిని కాని, ముంచివేస్తున్న విధ్వంస రక్కసినిగాని రెండింట్లో దేనిని ఆపలేని నిస్సహాయత. దేవుని నిస్సహాయతను ప్రశ్నించగల ఉదాత్తత కవిదా? కవిత్వానిదా? చెప్పటం కష్టం.

ఈ పై భావచిత్రంలో దృశ్యాన్ని, అదృశ్యమైన దృశ్యాన్ని కలిపి చెప్పటం కనిపిస్తుంది. ప్రకృతిలో మమేకమైన Synthesisను, దానికి భిన్నమైన Antithesisను ఒకే భావచిత్రంగా అనిపించేలా కవి మేళవించి చెప్పాడు. కానీ రెండు భిన్న భావచిత్రాలు. రెంటిలో మనిషి ఉద్వేగముంది. తొలిభావచిత్రంలో 'పంటతో జంటగా మురిసిపోతున్నమనిషి' మలిభావచిత్రంలో 'తమను తావే పెకలించుకొని వీచే గాలివైపు పరుగెత్తే మనిషి మొక్క'యి కనిపిస్తున్నాడు. ఈ వైపరీత్యాన్ని దేవుడు కూడా ఆపలేకపోవటం విషాదం. ఇది జీర్ణించుకోలేక 'ఇది కరుగుతున్నకలా? చెరిగి పోతున్న చిత్రమా?'–అని ప్రశ్నించటంతో రెండూనని సమాధానం.

ఇలా భావచిత్రానికి ఉండాల్సిన మూర్తిమత్వలక్షణం, పాఠకుని హృదయాన్ని తాకి ఒక అనుభూతిని కలిగించే లక్షణం, సంక్షిప్తత – భావతీవ్రత – ఉద్వేగం వంటిలక్షణాల ఇమేజరీగా ప్రకాశిస్తోంది. ఏ కవయినా జనానికి పరిచయంలేని అంశాలతో భావచిత్రాలను నిర్మించలేడు. ముకుంద రామారావుగారు చిత్రించే భావచిత్రాలు మనందరి అనుభవంలో ఉన్నవే.

చాలామంది ఆధునిక కవులు చిత్రించే భావచిత్రాలతో పూర్వాపర వ్యత్యస్తముంటుంది. దానితో పాఠకుడికి కవి చెప్పదల్చుకున్న విషయం రూపుకట్టకపోగా విపరీతార్థ స్ఫురణ కలిగే ప్రమాద ముంటుంది. ఉపమేయానికి చెప్పిన ఉపమను మొదటి రెండు మూడు పంక్తులలోనే అమర్చి, చివరికి భిన్నమైన సమన్వయంతో ముగించటంవల్ల పాఠకుడు గందరగోళపడతాడు. ముకుంద రామారావుగారి కవిత్వంలో అలాంటి దొసగులు కనిపించవు. ఉ దా॥కు 'తీరం చేరే వరకే' (నిశ్శబ్దం నీడల్లో సంపుటి) అనే కవిత తీసుకుందాం.

**"జీవిత సముద్రంలో / నావని నావికుణ్ణి నేనే"** – అని ప్రారంభించి చివరి వరకూ అంటే తీరంచేరేవరకు అంతా తానే అయి ఈది, తీరం చేరాక

**"విరిగి పోయి విడిపోయిన భాగాల్లా**
**నావ,**
**నావికుడు**
**నేను"** – అని అంటాడు.

జీవితాన్ని సముద్రంతో పోల్చటం కవి సమయం (Poetic Convention). ప్రయాణంచేసే వాళ్లు నావ, నడిపేవాడు నావికుడు. ఈ స్పృహ కవిత చివరివరకు చెదరకుండా సాగిపోతుంది. ఆరంభంలో నావను, నావికుణ్ణి నేనే నంటూ అభేదంగా పలికినవాడు చివరికి మూడు బాధ్యతలు విరిగిపోయిన విడి భాగాల్లాంటి వయ్యాయని నావ, నావికుడు, నేను వేరు వేరుగా మిగిలిపోయాయన్న స్పృహను కలిగించేలా ఆ మూడుపదాల్ని వేరువేరుగా చెపుతాడు. ఇలా ముకుంద రామారావు గారి కవిత్వం శిల్పశోభితంగా అలరిస్తుంది.

**"విరిగితే తప్ప / విరామం లేని కుర్చీలు**
**విరిగినా విరామం లేని మనుషులు**

**అంతంలేని ఆట / ఆకట్టుకోని పాట**
**జీవితమేనా?"** (పదవీ విరమణ (ఖండిక) నిశ్శబ్దం నీడల్లో (సంపుటి)

పదవీ విరమణ చేశాక కూడ విరామమెరుగని అవిశ్రాంత జీవుల జీవితాన్ని ఉద్దేశించి అన్న పై మాటలు శ్లేషతో ముగించటం కవి గడుసుదనం.

రైలులో ప్రయాణిస్తూ తనకెదురుగా తల్లితోపాటు ఒడిలోనున్న పాపను, ఆ పాప నవ్వునూ, కళ్లనూ, పాప తల్లిని హత్తుకొని నిద్రపోవటం, పాప కళ్లు తెరవగనే తల్లి నిద్రలేవటం – వీటన్నింటిని గమనించిన కవి ఫీలింగ్ ఏమిటో చూడండి –

**"దారంతా / ఆ తల్లీ పిల్లా**
**ఎంత దూరా భారాన్ని తగ్గించారో" (తెరిపి)**

కంటిపాపలేకాదు, ఇంట్లో చంటిపాపలు కూడా మనకు తెలియని, మనదికాని 'మజా'లలో తేలిపోయి పక్కమనిషిని పట్టించుకోనికాలం. విమానమెక్కినా, రైలెక్కినా, ఎఱ్ఱ బస్సెక్కినా పక్కమనిషిని పట్టించుకొని మాట్లాడేవాళ్లు లేరు. చేతిలో స్మార్ట్‌ఫోనే సర్వ ప్రపంచం. అటువంటి సందర్భంలో కూడా ప్రయాణించే 'తల్లీబిడ్డల' ప్రేమలాలనను, 'నిదురించే పసిపాపకనులలో ముసిరిన భవితవ్యాన్ని చదువుతూ కాలక్షేపం చేసిన కవి సంస్కారాన్ని ఏమని చెప్పాలి!


"పద్యం గుప్పిట్లో చిక్కిన ఈ కవి, తనకంటే పద్యం బలమైందని, అది చెప్పిందే నేను మాటాడేదని, తాన్నావహించిన క్షణాలు కలకంటే తీయనైనవని, ఆద్యంతం కాగితం మీద పదునైన అడుగుజాడలను వదలిపోతుందని, అప్పుడది తనను తేలికపరచి తెలియకుండానే అదృశ్యమై పోతుందని" (నా పద్యం (ఆకాశయానం) పద్యాన్ని కవిత్వాన్ని పర్యాయంగా చెప్పిన పంక్తుల్ని గమనిస్తే మనప్రాచీన లాక్షణికులు చెప్పిన 'భావసమాధి' స్థితిని తలపింప చేస్తుంది. "Right forms imply right feelings, but wrong forms donot necessarily imply wrong feelings. The latter may be due


to the lack of concentrating his energies? (సత్కావ్యం కవి భావుకత్వానికి నిదర్శనమే కాని రసవిహీనమైన కావ్యము విధిగా అతని భావుకతా లోపానికి నిదర్శనం కాదు. ఈ రెండవది అతని సమాధిలోపం వలన కలుగవచ్చు.) – Clive Bell.

స్వభావ జగత్తునుండి విభావ జగత్తులోనికి పోలేనివాడు రచనచేయలేడు. వస్తువును భావన చేయటమే కవితారూపతపస్సు. ఆ transmigrate కాలేనిచోట రచయిత ఉండడు. అలా కాగలిగినప్పుడే 'పలికించెడివాడు రామభద్రుండట' అనగలుగుతాడు. ముకుంద రామారావుగారు కూడా ఈ కవితలు చాలా వాటిలో అలాంటి స్థితిలో రాసినట్లు దాఖలాలు కనిపిస్తున్నాయి.

భావుకతా సౌందర్యం, అభివ్యక్తి అనే అంశాలు కళాతత్త్వశాస్త్ర పరిధిలోని అంశాలు. ప్రతీకలకు మూలంగా చెప్పదగిన భావచిత్రాలు భావుకసీమలోనివే. కవిత్వంలో వీటిని గురించి మాట్లాడటమంటే అభివ్యక్తి పార్శ్వాన్ని గురించి తడవటమే. ముకుంద రామారావుగారు చిత్రించిన భావచిత్రాలను గమనిస్తే వాటిలో ఎక్కువగా రూపకాత్మక భావచిత్రాలు కనిపిస్తాయి. ప్రతీకాత్మకం చేసిన 'కుర్చీ' – వంటి భావచిత్రాలు ధ్వనిని ఆశ్రయించి ప్రకాశిస్తున్నాయి. ఆధునిక కవిత్వంలో భావచిత్రాలు లేకుండా ఎవరు రాయటంలేదు. ఖండికలన్నీ ఏదైనా ఒక భావాన్ని పాఠకుడి హృదయంలో బొమ్మ కట్టేందుకే ప్రయత్నిస్తున్నాయి. అందుకై ఉపయోగించిన భాష అత్యంత సరళంగా కనిపిస్తుంది.

ఆకాశంలో ఇంద్రధనస్సును 'ఆకాశంమెడలో కందువాలా ఉ ందనటం, ఊగుతున్న సముద్రపు అలల్ని చూపి 'వెళ్లినవాళ్లంతా సముద్రంతో ఏమి మొరపెట్టుకున్నారో, ఒళ్లంతా ఊపుకుంటూ నవ్వో ఏదుపో తెలియని నీటిపదాలతో మాట్లాడాతోందన'టం, రాలే ఆకుల్ని "పదవీవిరమణ చేస్తున్నా"యనటం, సూర్యోదయాన్ని "ఉదయ మెప్పుడూ కూతురులాగే అందంగా ఆప్యాయంగా వస్తుంద"నటం, పాదాల కిందిపచ్చిక స్పర్శను 'చెవుల్లో గుసగుసలాడుతున్నట్లు'గా ఉందనటం, పగలూ రాత్రిని 'ప్రపంచకర్మాగారానికి కనురెప్పలు కాపలా కాసే సమయపాలక కార్మికులు' – అనటం, చంద్రుడిని 'నదులూ సముద్రాలన్నిట్లో రోజుకో వేషంతో మునిగి తేలుతున్నా డనటం', వేకువను 'అప్పుడే కొనుక్కొచ్చిన కొత్తబట్ట' అనటం, చెట్ల మధ్య ఉదయించే సూర్యబింబం 'ఎండిన చెట్ల కొమ్మలకి ఎర్రగా వేలాడే ప్రయత్నంలో సూర్యుడున్నాడు'న్నాడనటం, పాతింటిని 'మూలనపడున్న ముసలి కుక్కలా' ఉన్నదనడం, వర్షాన్ని 'నీటితో కడుపు పండిన నిండు గర్భిణీ మేఘపు అడుగుల శబ్దమ'ని అనటం, పక్షిని 'పాస్‌పోర్ట్ లేకుండా, ఏ హద్దులు హక్కులూ లేకుండానే హాయిగా ఉంద'నటం, సముద్రాన్ని **"అన్నిదిక్కులా ప్రవహిస్తున్న సూర్యకాంతితో కలుషితమైపోయిన చంద్రుడి అంటువ్యాధి కదా"** అని అనటం, నయాగరాను **"సూర్యకాంతిని హత్తుకొని రాళ్లమీద తల బాదుకుంటున్న ఇంద్రధనుస్సు, తనకుతానుగా తెలిసికోలేని**




**అందమైన అద్భుత"**మని, గడ్డకట్టిన నయాగరాను 'చిత్రాల్లో బంధించి మనుషులు చూసుకున్నట్లు గడ్డకట్టించి ప్రకృతి నిన్ను చూసు కుంటుందా?' అని ప్రశ్నించటం, 'రాత్రిని చంద్రుడి కన్నీరనటం' – సముద్రంలో చేరే నదుల్ని ఉద్దేశించి "దాహం తీరని సముద్రం అవినీతిలా నదుల్ని మింగుతోంద"నటం వంటి కొన్ని పంక్తులు ముకుంద రామారావుగారి అభివ్యక్తి సౌందర్యాన్ని, భావుకశక్తిని పట్టి చూపిస్తాయి.

ఈ కవికి నిశ్శబ్దాన్ని ఉపాసించటమైంత ఇష్టమో ఏకాంతాన్ని భరించటమంత కష్టం. సమూహాన్ని ఇష్టపడే ఈ జీవి –

**"వీడ్కోలు బాధాకరమే**
**అయినా ఎల్లకాలం ఎవరుండి పోతారు**
**ప్రేమముఖ్యం ఎంతదగ్గరున్నా దూరమైన"** – అని సమాధాన పరచుకుంటాడు.

**"నా వరకూ నాకు / అక్షరాల్ని అలంకరించుకుని**
**పదాల్ని మూటకట్టుకొని / వాక్యాల్ని కప్పుకొని**
**నిశ్శబ్దంగా కనుమరుగవాలని ఉంది"** – అని స్వప్నిస్తాడు. ఈ నిశ్శబ్దోపాసకుడు స్వస్వరూపానుసంధానం చేసుకొన్నట్లుగా.

**"తానొచ్చిన అడవికి**
**దూరమైన బొగ్గులా ఎదురుచూస్తున్నాను**
**కాలిబూడిదవటానికి"**

– అని అనటం ఏ తత్త్వవేత్తో అనదగిన మాటలు. 'A righteory indignation' – పవిత్రమైన ఉదాసీనత ఇది. బాధాతప్త హృదయంతో కాలిపోవటానికి సిద్ధమవటమే కవిత్వయాత్ర. ఇది బాధానుపూర్వక బలి.

"మనస్సు, హృదయం, ఆత్మల సమ్మిశ్రితం బహుశా కవిత్వం"... "కవిత్వపు తలుపులు తెరచి, నేను చూసే విశాలవిశ్వాన్ని, అనంతాకాశాన్ని అద్భుతమైన ప్రకృతిని, అర్థంకాని ప్రపంచాన్ని అందరితో పంచుకోవాలన్న తపన నాచేత రాయిస్తూనే ఉంది. నాలోని అసంతృప్తికి కారణాల్ని, నానోపలి ప్రపంచంలో వెదుకుతూనే ఉ

న్నాను. నన్ను తెలిపే పదాలేవో నిశ్శబ్దంలోనే కలిసిపోతున్నాయేమో?" – (ముందుమాట, నిశ్శబ్దం నీడల్లో).

ఈ కవి తాను కవిని కావటానికిగల కారణాన్ని, తన అన్వేషణను, తన అభివ్యక్తిని పైమాటల ద్వారా స్పష్టంగా చెప్పటాన్ని గమనించవచ్చు.

మన అస్తిత్వాన్ని ఉన్నది ఉన్నట్లుగా చూడటమే సత్యమీమాంస. దీన్నే తత్త్వశాస్త్రజ్ఞులు మెటాఫిజిక్స్ అంటారు. ఒక ద్రష్ట అస్తిత్వాన్ని తానెలా దర్శిస్తున్నాడో ఆ అస్తిత్వాన్ని తానెలా తెలుసుకుంటున్నాడో వివరించటం జ్ఞానమీమాంస (Epistemology). తాను దర్శించిన దాని ద్వారా ప్రతిపాదించే పరమార్థం నైతిక ప్రమాణాల నిర్ణేత (Ethics). ముకుంద రామారావుగారి అభివ్యక్తిని గమనించినప్పుడు మొదటి రెండు లక్షణాలు స్పష్టంగానే కనిపిస్తాయి. ప్రతిపాదించే ఎథిక్స్ మాత్రం ధ్వనిపూర్వకంగా మన హృదయంలో కలిగించే సంస్కార రూపంలో ఉంటుంది.

**సీ॥ "నీదృక్పథమునందు నిఖిల ప్రపంచంబు**
**నగ్నసుందరమైన నల్లపూస**
**నీమానసము దయారామాభివృద్ధికి**
**అమృతంబుజిల్కు వర్షాగమంబు**
**నీ చరిత్రము గాఢనిద్రాదరిద్రాణ**
**కుతలచక్రమునకు కోడికూత**
**నీవాణి వికటభావావేశరభసకు**
**గిరిదాట రాని సుగ్రీవముద్ర**

**ఆ॥వె॥ సుప్రశాంతిరత్న శుద్ధాంతములనిచ్చి**
**తపమొనర్చు యోగధనుడవీవు**
**భావదాస్యమునకు నీవతీతుడవంద్రు**
**ప్రజ్ఞవిస్మరింపవలదుసుకవి" (జాషువా "కవి")**

# జీవన సంక్రాంతులు

**వి.ఎస్.ఆర్.ఎస్. సోమయాజులు**
**ఫోన్ : 9441148158**

మేషం నుంచి మీనం దాకా సాగేది సౌరగమనం
అది సంక్రాంతి విభవం,
మానవాళి మనుగడకు పండుగలు జీవన హేతువులు
సృష్ట్యాదినుండి ఉత్తర, దక్షిణ అయనాలు పాంచభౌతిక
ప్రాకృతికత్వంతో ముడిపడిన
ఉభయసంధ్యలిచ్చే సూర్యచంద్రుల గమనాల్ని, నిర్దేశాల్ని
తరాల వారసత్వాలకు సంస్కృతీవాహికలు, జీవనమూల్యరుచులు
బరువెక్కిన జ్ఞాపకాల మాటున
పూటభత్యం పుల్లవెలుగుల జీవితాలు – సంక్రాంతి
ఆంధ్రుల పెద్ద పండుగ మూడురోజుల సంబరాలు
సంభ్రమాలు విరిశ్రుతులు మంచు కురిసే హేమంతాల్ని
రాబోయే వసంతానికి స్వాగతాలొత్తుంటాయి
భోగి మంటలక్రాగడం
భోజ్యవంటలు గ్రోలడం సంక్రాంతినాడు చేసిన దానధర్మాలు
పితరాళి వంశాల మూలపురుషుల స్మరణలు
కనుమనాటి గోపూజలు విశిష్టతల పాడిపంటల
సస్యవృద్ధులిచ్చే తరింపులు
ధనుర్మాసంలో నెలగంట పట్టిన లోగిళ్ళు
ముగ్గుపాల ముద్దబంతుల రంగవల్లుల జాళ్ళు
తలపై అక్షయపాత్రతో హరిదాసు కీర్తనలు
డూడూ బసవన్నల ఆశ్వీరచనాలు
ఫణిమకుట ధారులుగా లింగమూర్తులు
ఒకప్పటి సంచార జన జీవితాలన్నీ
నేడు యూట్యూబ్ ఛానళ్ళ సాదృశ్యాలు
పల్లెలన్నీ పచ్చదనాలతో సంస్కృతీ విరిశ్రుతులగా
మళ్ళీ జీవనానందాలకు
మరొకసారి మకర సంక్రాంతి సరిగమలు సన్నాయి స్వాగతాలు



# వైభవంగా సాగిన బి.ఎన్.శాస్త్రి పురస్కార సభ

డా. మంత్రి శ్రీనివాస్, ఫోన్ : 832 833 3720

తెలుగుప్రాంతాల చరిత్రను చిరస్థాయిగా నిలిపిన శాసనాల హృదయాన్ని చదివి చెప్పిన మహనీయుడు శ్రీ భిన్నూరి నరసింహ శాస్త్రి. శాసనపాఠకుడుగా, చరిత్రకారుడుగా, రచయితగా, పరిశోధకులుగా, పత్రికా సంపాదకులుగా ఆయన సుప్రసిద్ధులు. తెలుగు జాతి చరిత్ర నిర్మాణానికి కారణభుతాలై కాలగర్భంలో దాగున్న ఎన్నో విలువైన చారిత్రక సత్యాలను, పాలనాధారాలను జనులకు అందించి లోకోపకారం చేశారు. ఆదిలాబాద్, నల్గొండ, మహబూబ్ నగర్ జిల్లాల సర్వస్వాలతో పాటు బ్రాహ్మణరాజ్య, రెడ్డిరాజ్య సర్వస్వాలతో తెలుగు పాలకుల వైభవాన్ని, ఘనమైన చరిత్రను అక్షరాలలో నిక్షిప్తం చేసి పదిలపరిచారు. బహుముఖ ప్రజ్ఞాభారతి, నిలువెత్తు సాహితీ సంతకమైన ఆయన తొంబై ఒకటవ జయంతిని పురస్కరించుకొని వేద సంస్కృతీ పరిషత్, మూసీ మాసపత్రిక సంయుక్త ఆధ్వర్యవంలో బి.ఎన్. శాస్త్రి పురస్కార ప్రదానోత్సవం వైభవంగా జరిగింది. 2023 వ సంవత్సరానికి గాను ప్రముఖ కవి, రచయిత, శతకకర్త, గ్రంథ పరిష్కర్త, శ్రీమాన్ వైద్యం వేంకటేశ్వరా చార్యులు ఈ విశిష్ట పురస్కారాన్ని అందుకున్నారు.

నిరంతర సాహితీ సృజనకారులుగా పేరుపొందిన వైద్యంవారు కురుమూర్తి క్షేత్ర చరిత్రము, కర్నూలు జిల్లా కవితరంగిణి, వ్యాసవైజయంతిక, 'భజయతి రాజ స్తోత్రా'నికి తెలుగు అనువాదం, టీకా తాత్పర్యం, తిరుమల బుక్కపట్టణం అన్నయాచార్యుల చిత్రకవితా విలసితం 'చిత్రబంధ మాలిక'కు వ్యాఖ్యానం, అయలూరి కందళార్యుల 'అలంకార శిరోభుషణాంతర్గత చిత్రమ్' నకు వ్యాఖ్యన, బంధ చిత్రాలను రాశారు. మల్లియ రేచన 'కవిజనాశ్రయం' ఛందోగ్రంథానికి భావదీపిక, పోతానామాత్యుని భాగవతానికి 'సరళవ్యాఖ్య'ను, కాణాదము పెద్దన విరచిత 'ముకుంద విలాసా'నికి 'మానసోల్లాసం' వ్యాఖ్యను రచించారు. బహుముఖీన ప్రజ్ఞావంతులైన వీరు పన్నెండు శతకాలను రాశారు. పద్నాలుగు శతకాలను పరిష్కరించారు. అందులో తెలుగుబాల శతకం, ఉన్నమాట శతకం, సుదర్శన చక్రరాజ శతకం, కురుమూర్తి వేంకటేశ శతకం ప్రముఖమైనవి. తితిదే వారి కోరిక మేరకు కాణాదం పెద్దన అధ్యాత్మ రామాయణాన్ని పున:ప్రకాశం చేశారు. అంతేకాదు ఆళ్వార్ల చరిత్ర సంగ్రహం, వామన చరిత్ర, భాగవత వ్యాఖ్యానం, మోహినీ విలాసం ప్రబంధ రాజరాజేశ్వర విజయ విలాసం సచిత్ర బంధం వంటివి శ్రీనివాసుని ఆజ్ఞగా భావించి విరచించారు. చిన్ననాటి నుండే చిత్ర కవితాభిమాని కనుక చిత్ర కవిత్వంలో శ్రీనివాస శతకం, అక్షర చిత్రాలు, బంధ చిత్రాలు, గర్భ చిత్రాలు రచించారు.



సురభారతి ఉస్మానియా విశ్వవిద్యాలయం వేదికగా జరిగిన ఈ పురస్కార ప్రదానోత్సవ సభకు పూర్వ ప్రాచార్యులు,'మరింగంటి కవుల సాహిత్య సేవ, జీవనపర్వం, మహోత్సవ విధి, భగవత్ప్రతిష్ఠా విధానం, శేషభట్టర్ రామానుజాచార్యుల రచనలు, మావూరు చందుపట్ల' వంటి విద్వద్గ్రంథ కర్త డా. శ్రీ రంగాచార్య అధ్యక్షత వహించారు. ఈ సభ ప్రభను పెంచుతూ విశ్రాంత ప్రభుత్వ పాలానాధికారి, తెలుగుభాషా పరిరక్షకులు శ్రీ ఎన్.ముక్తేశ్వరరావు ముఖ్య అతిథిగా విచ్చేయగా, ప్రాసంగీకులుగా చరిత్ర పరిశోధకులు, శాసన పరిష్కర్త డా.డి. సూర్యకుమార్ హాజరయ్యారు.

డా. శ్రీ రంగాచార్య సభనుద్దేశించి మాట్లాడుతూ బి.ఎన్.శాస్త్రిగారి అవిరళ సాహిత్య కృషిని, పరిశోధనా నైపుణ్యాన్ని, చరిత్ర శోధకులుగా ఆయా విషయాలపై ఆయనకున్న జ్ఞానాధికారాన్ని గురించి ప్రస్తావిస్తూ నిరంతర సాహితీ నిర్మాత శ్రీ వైద్యం వేంకటేశ్వరాచార్యులు ఈ విశిష్ట పురస్కారాన్ని అందుకోవడం ఎంతో ఆనందదాయకమన్నారు. కవిగా వైద్యం వారి సాహిత్య కృషిని గురించి ఆయన రచనల్లోని వైవిధ్యతను, కాలానుగుణంగా తనను తాను తీర్చిదిద్దుకుంటూ నిత్య చైతన్యులుగా ఉంటున్న వారి వ్యక్తిత్వ పరిమళాన్ని సభికులకు పంచారు.

అధ్యక్ష ప్రసంగానంతరం కమనీయంగా, కన్నుల పండగగా ఘనంగా పురస్కార ప్రదానం జరిగింది. ప్రత్యేకాసనంలో విరాజితులై అవార్డును స్వీకరించిన వైద్యంవారు తమ అమూల్యమైన స్పందనను తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ బి.ఎన్. శాస్త్రి గారితో తనకున్న అనుబంధాన్ని పంచుకున్నారు. తాను రచయితగా అడుగులు వేస్తున్న క్రమంనుండే తనకు శాస్త్రి గారి ప్రోత్సాహం లభించిందని, మూసీ మాస పత్రిక మాధ్యమంగా తన సాహిత్యాన్ని లోకానికి అందించారని,





ఆయన అందించిన ఆదరణ మరిచిపోలేనిదన్నారు. 1981 నుండి తనకు పత్రికతో ఆత్మీయ అనుబంధం ఉన్నదని, మూడు దశాబ్దాలుగా కొనసాగుతున్న నా సాహితీ వ్యాసంగాన్ని ఎంతో గౌరవంతో పాఠకులకు అందిస్తున్నదని, శాస్త్రిగారి అనంతరం వారి కుటుంబ సభ్యులు డా. కమలాకరశర్మ, డా. మనోహరిలు తన సాహిత్యాన్ని పత్రికా మాధ్యమంగా వెలువరిస్తున్నారు. శాస్త్రిగారి పేరున ప్రదానం చేస్తున్న ఈ పురస్కారాన్ని అందుకోవడమంటే తనకెంతో గౌరవంగా, గర్వంగా ఉందన్నారు.

అనంతరం మూసీమాసపత్రిక సంపాదకులు, ఉస్మానియా విశ్వవిద్యాలయం పాఠ్యప్రణాళిక సంఘం అధ్యక్షులు ఆచార్య కమలాకర శర్మ మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం ప్రతిష్ఠాత్మక బి.ఎన్. శాస్త్రి గారి ఆశయాలను ముందుకు తీసుకువెళ్ళడంలో పత్రికను ఆధునిక హంగులను అభివృద్ధి చేసి ఇందులో భాగంగా ఆన్‌లైన్ లోనూ పత్రికను పాఠకులకు అందుబాటులో ఉంచుతున్నామన్నారు. ఏటా సాహిత్యపరమైన, చారిత్రాత్మక అంశాల మీద సదస్సులను ఏర్పాటుచేస్తూ ప్రతి యేడాది ప్రతిష్ఠాత్మక బి.ఎన్.శాస్త్రి పురస్కారాన్ని వివిధ విభాగాలలో సేవలందిస్తున్న వైతాళికులకు ప్రదానం చేస్తున్నామన్నారు.

సభా ఉత్సాహాన్ని పెంచుతూ విశ్రాంత ప్రభుత్వ పాలనాధికారి, సాహితి ప్రియులు శ్రీ ముక్తేశ్వరరావు మాట్లాడుతూ నల్గొండ జిల్లా పరిపాలనాధికారిగా తాను పనిచేస్తున్నప్పుడు బి.ఎన్.శాస్త్రి గారితో తనకేర్పడ్డ పరిచయం తనలో దాగున్న ఎన్నో సంశయాలను దూరంచేసి జిల్లా చరిత్ర, సాహిత్యం మీద ఒక చక్కని అవగాహన ఏర్పడేలా చేసిందన్నారు. జాతి చరిత్ర నిర్మాణంలో జిల్లా సర్వస్వాలు ఎంతటి ఘనమైన పాత్రను పోషిస్తాయో శాస్త్రి గారి సాన్నిధ్యంలో తాను అవగాహన చేసుకున్నానని, ఆయన ఒక నడిచే చరిత్ర గ్రంథమని, తెలుగు జాతికి ఆయన చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. భాషపై తనకున్న జిజ్ఞాసకు ఆయన ప్రోత్సాహం కొత్త ఉత్తేజాన్ని అందించిదన్నారు.

చివరగా తన విలక్షణమైన ప్రసంగంలో బి.ఎన్.శాస్త్రి గారి శాసన పాఠాలను, ఆయన తనపై చూపించిన వాత్సల్యాన్ని ఎంతో ఉద్వేగంతో పంచుకున్నారు. సాహిత్య అంశాల అస్తిత్వానికి సాక్ష్యాలుగా నిలిచే శాసనాల నిర్ధారణలో శాస్త్రిగారు ఎంతటి కృషీవలులో, అంతే కర్తవ్య నిష్ఠులన్నారు. భారతదేశ చరిత్ర–సంస్కృతి, ఆంధ్రదేశ చరిత్ర–సంస్కృతి,కందూరు చోడుల శాసనములు–చరిత్ర–సంస్కృతి, త్రిపురాంతక దేవాలయ శాసనములు, ముఖలింగ దేవాలయ చరిత్ర–శాసనములు వంటివే కాక జిల్లా సర్వసాలతో పాటు ఎన్నో రచనలను చేసి కీర్తిని గడించారన్నారు. ఆయన సాహిత్యమంతా లోకకళ్యాణం కోసమేనని చెబుతూ ఆయన స్ఫూర్తిని భావి పరిశోధకులు అందిపుచ్చు కొని నవీన పద్ధతుల్లో సాహిత్యాన్ని సృష్టించాలన్నారు. మూసీ మాస పత్రిక నిర్వహిస్తున్న కార్యక్రమాలు, సేవలు కొనియాడదగ్గవన్నారు.

ఎంతో ఆహ్లాదకరంగా సాగిన పురస్కార సభకు పరిశోధక విద్యార్థి లక్ష్మీనారాయణ ఆహ్వానం పలుకగా, చిరంజీవి సాగి కావ్యశ్రీ స్వాగత గీతాన్ని ఆలపించారు. పురస్కార ప్రదానోత్సవ పాఠాన్ని డా. మంత్రి శ్రీనివాస్ పఠనం చేయగా, లక్ష్మీగల్ల మహీపాల్ ముగింపు వచనాలు పలికారు.



3

# ప్రణయం నుండి ప్రణవం దాకా !

**డా. గండ్ర లక్ష్మణ రావు,** కరీంనగర్, ఫోన్ : 9849328036


కవిత్వానికి ఉండే లక్షణం ప్రయోజనం. ప్రాచీన అలంకారికులు కావ్య ప్రయోజనాల్ని వివిధ రకాలుగా తెలియజేశారు. సాహిత్య దర్పణకర్త అయిన విశ్వనాథుడు కావ్యం వలన చతుర్వర్గ ఫల ప్రాప్తి కలుగుతుందని అన్నాడు. ధనంజయుడు ఆనందానుభూతియే కవిత్వ ప్రయోజనంగా పేర్కొన్నాడు. అందుచేత కవిత్వ ఫలాల్లో ఆనందం ఒకటి. కళారూపాన్ని ధరించిన వస్తువు ఆనందాన్ని ఇస్తుంది. కవిత్వం రాసేటప్పుడు కవికి, వినేటప్పుడు శ్రోతకు ఆనందం కలగాలి. కవితావస్తువు ఏదైనా కావచ్చు. వైయక్తిక అనుభూతుల్ని పంచినా ఆనందమే. సమాజ హృదయాన్ని తన హృదయంగా ప్రకటించినా ఆనందమే.

తొలి యవ్వనంలో ఎవరైనా కలం పడితే ప్రణయం గురించి రాయకపోవడం ఉండదు. ఎందుకంటే ప్రపంచమంతా ప్రేమమయం. కాళిదాసాది మహాకవులు సైతం ప్రణయ కవిత్వం రాసినారు. తెలుగు సాహిత్యంలో 1950 కంటే ముందు భావకవిత్వం ప్రధాన పాత్ర వహించింది. భావ కవితా యుగంలో కృష్ణశాస్త్రి, వేదుల, నాయని, నండూరి, వానమామలై, దాశరథి, సినారె, పల్లా దుర్గయ్య, అనుమల కృష్ణమూర్తి మొదలైన తెలుగు కవులు ప్రణయ కవిత్వం బహుళంగా, బహుముఖాలుగా రచించారు. అభ్యుదయ కవి శ్రీశ్రీ కూడా తొలుత భావగీతాలు రాసిన వాడే. తెలుగు కవిత్వంలో అభ్యుదయమనే ప్రవాహం వచ్చిన సమయంలో కూడా విశ్వనాథ సత్యనారాయణ వంటి వారు భావ కవిత్వం రాసి మేరునగధీరుల్లా నిలబడ్డారు. చాలామంది కవులు సమాజ హితమైన, సమాజానికి ఆనందాన్నిచ్చిన కవిత్వాన్ని వెలువరించారు.

స్తంభంకాడి గంగాధర్ తొలి యవ్వనంలో తాను పొందిన అనుభూతుల్ని, అనుభవాల్ని దాచుకోకుండా అందంగా అక్షరబద్ధం చేశాడు. ఆయన కవిత్వం నిండా ప్రణయం కనిపిస్తుంది. ఆనందం కనిపిస్తుంది. అందుకే **"ఆనంద వర్ధనం"** అనే అందమైన వచన కవితా సంపుటిని వెలువరించాడు. **'నా మనోసుమం రాల్చే/ భావాల మధువు/ ఆనందవర్ధనం! అమృతతుల్యం!'** అని తన కవిత్వం గురించి చెబుతాడు. ఆనందం నిత్య సత్యం. అది శాశ్వతమైనది. సాధారణంగా మనిషి ఆనందమే లక్ష్యంగా జీవిస్తాడు. అయితే కవిత్వం కలిగించేది రసానందం. ఈ ఆనందం భౌతికం కావచ్చు, మానసికం కావచ్చు. కోకిల గొంతు తీయగా ఉంటుంది అంటాం. వినడానికి చెవికి ఇంపుగా ఉందంటే అది అనుభూతికి సంబంధించింది. గంగాధర్ కవిత్వంలోను ఇట్లాంటి భావనలు ఉన్నాయి. **'ఎక్కడో ఒక కోకిల కూసిందంటే / అది నీ సందేశమే అనుకుంటాను/ ఎక్కడో ఒక సుమం విరిసిందంటే/ అది నీ చిరునవ్వేనని భావిస్తాను'** అంటాడు.

కాళిదాసు 'విక్రమోర్వశీయం'లో ఊర్వశి తప్పిపోయినప్పుడు విక్రముడు అడవిలో తిరుగుతూ ఒకచోట హంసలను చూస్తాడు.

**ఆనందవర్ధనం**
స్తంభంకాడి గంగాధర్
వెల - 90 /-
ప్రతులకు : రచయిత,
ఇం.నెం. 10-2-448/బి,
రోడ్ నెం.2, విద్యానగర్,
కరీంనగర్ - 505 001.
ఫోన్ : 94400 49872




"నా ప్రేయసి ఇటునుంచే పోయింది" అంటాడు... "ఊర్వశి ఈ మార్గంలో వెళ్లకపోయి ఉంటే హంసలకు ఇంత అందమైన నడక ఎక్కడి నుంచి వస్తుంది?" అనేది భావన. **'కార్తీకమాసపు శుక్లపక్షపు రాత్రివేళ/ విస్తారంగా కాస్తున్న వెన్నెల వెలుగులో/ తనువంతా తమకంతో/ అణువు అణువంతా ఆరాటంతో/ గుండెల పైన గులాబీ పువ్వుల/ కోమలత్వపు పైట వేసుకొని/ మల్లెల శయ్యపై పరిచిన/ మొగలిపూల మృదువసనంపై పవళించి/ పక్కానికి వచ్చిన పరువాలతో/ అలజడి నిండిన అధరాలతో/ ఆమె విరహోత్కంఠిత..!'** అని గంగాధర్ అందంగా వర్ణించాడు.

కళల యొక్క లక్ష్యాలలో ప్రధానమైంది ఆనందం కాగా కవిత్వం యొక్క మౌలిక అంశం అందాన్ని, అందమైన భావాన్ని సృష్టించడం. 'అనాఘ్రాత పుష్పం' అంటాం... అంటే అప్పుడే వికసించిన పుష్పం ఎంత స్వచ్ఛంగా, నిర్మలంగా, పవిత్రంగా, పరిమళభరితంగా ఉంటుందో గంగాధర్ కవిత్వం అంత నిర్మలంగా, పవిత్రంగా, పరిమళభరితంగా ఉంది. **'పరుచుకున్న మంచుపూల సమూహంలా/ ప్రోగు పడిన కుంకుమ పూరాశిలా/ పచ్చని పంటల పసిడి కాంతిలా/ ఉదయభానుని అరుణ కిరణంలా/ ఎన్నెన్నో వర్ణాలు/ ఎన్నెన్నో భావాలు/ ప్రకృతి నిండా ప్రణయ రాగం/ఎదనిండా కవిత్వనాదం!'** తన ఎదుట కనిపించే పరిసరాల్లో, ప్రకృతిలో ప్రణయాన్ని దర్శించాడు ఈ కవి. ప్రకృతిలో ప్రణయం ఉంది. ఈ విశ్వంలోని సమస్త గోళాలు, నక్షత్రాలు ఇలా నిలిచి ఉండడానికి కారణం వాటి మధ్య ఉన్న బంధమే. ఆ బంధమే ప్రణయం. తత్ఫలితంగానే ఈ కవి హృదయం నుంచి సౌందర్యం నిండిన కవిత్వనాదం బయటకు వచ్చింది.

స్తంభంకాడి గంగాధర్ వేద పండితులకు నిలయమైన ధర్మపురిలో పుట్టి, పెరిగినవాడు. సంస్కృతాంధ్ర కళాశాలలో చదివిన విద్యార్థి. ఈ నేపథ్యం ఆయన మీద చాలా బలంగా ఉంది. అందుచేత భావనలోనే కాదు భాషలో కూడా ప్రతిభ, పటిమ కనిపిస్తాయి. **"సమ్మోహన/ నయనద్వయ వీక్షిత జనిత/ ప్రణయమెల్ల/ హృదయంలో**

**శీతలచందన శరత్కళా ధారలై/ ప్రవహించగా/ చంద్రకాంత భాసుర చెలి/ చమటముత్యాల/ స్పర్శ చేత దేహం నిలువెల్లా/ కంపించగా/ నిక్వణ నిరర్గళ నిర్గత/ నిట్టూర్పులు/ విభాకర మయూఖ రేఖలై/ తాకగా...'** అని మనోహరమైన సమాస ఘటిత విశేష ప్రయోగాలతో కవిత్వం రచించాడు. గంగాధర్ లోని సంప్రదాయ విద్యా బలం, ప్రాచీన కావ్యాధ్యయనశీలత 'ఆనందవర్ధనం'లో అడుగడుగునా కనిపిస్తాయి.

అదేవిధంగా ఒక కవిత ఉన్నట్టుగా మరొక కవిత లేదు. **'తమస్సు చిక్కబడిన కృష్ణపక్షపు ఆకాశంలో/ కాంతులీనే నక్షత్రాలకు/ తమస్సు పలుచబడిన శుక్లపక్షపు గగనంలో/ వెలుగులీనే పున్నమి జాబిలికి/ విధాతను నేనే అయి ఉంటాను..'** అని ఒకచోట రాస్తాడు. **'నిరాశా నిస్పృహల తమస్వినీ గర్భ పాతాళానికి/ నా నేత్రద్వయ వీక్షణం పడిపోయినప్పుడు/ నువ్వు మేరు నగ శిఖర హస్తానివై/ నా చూపుల్ని గగనవీధుల వైపు మరలిస్తావు...'** అని మరొక చోట రాస్తాడు. కవితల నిర్మాణంలో ఎంతో వైవిధ్యం ఉంది. భావవ్యక్తీకరణను బట్టి ఈ నిర్మాణ వైవిధ్యం ఉంది. కవికి ఉండే ప్రత్యేక శిల్పం వల్లే ఈ నిర్మాణ వైవిధ్యం సాధ్యమవుతుంది. అప్పుడే అది గొప్ప కవిత్వం అవుతుంది. ఏది సులభం? ఏది కఠినం? అనేది భావాన్ని బట్టి ఉంటుంది. భావాన్ని బట్టి భాష ఉండాలి. గంగాధర్ కవిత్వంలో ఇవన్నీ ఉన్నాయి.

అలాగే ఈ కవిత్వంలో ఆత్మానందం ఉంది. ప్రణయానందం ఉంది. అందుకే ఇది ఆనందవర్ధనం. ఆనందం వర్ధిల్లజేసినాడు. కవిత్వంలో ధ్వని ప్రధానం. ఎక్కడ ధ్వని ఉంటుందో అక్కడ చమత్కారం ఉంటుంది. ఆనందం ఉంటుంది. "నేను నడుస్తూ ఉంటే నా చేతికి ఒక పువ్వు తగిలింది. బాధగా ఉందా? అన్నాను. అది నా వైపు చూసి నీకా? నాకా? అంది." శేషేంద్ర రాసిన ఈ వాక్యంలోని ధ్వని గమనించండి. ధ్వనిని బట్టి చమత్కారాన్ని గమనించండి. ఇలాంటి ధ్వని కూడా ఆనందవర్ధనంలో ఉంది. **'పిల్ల గాలులు చలికి వణుకుతూ/ నీకూ నాకూ కబురు పంపాయి/ మనిద్దరి కౌగిలి మధ్యన నలిగి/ వెచ్చబడుదామని కాబోలు!'** ఇటువంటి చమత్కారాలు గమనించవచ్చు.


# మూసీ


సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక
మూసీ మాస పత్రిక సభ్యులుగా చేరండి
వెంటనే శాశ్వత చందాదారులు కండి.
సాహిత్య రంగంలో వెలువడుతున్న ఒకే ఒక
పరిశోధనాత్మక వ్యాసాల మాస పత్రిక
యూజీసీ కేర్ లిస్ట్‌లో చేరిన తెలుగు పరిశోధనా పత్రిక
శాశ్వత సభ్యత్వం (10 సం॥లు)... 2500/-
సంప్రదించండి. మూసీ మాసపత్రిక... ఫోన్ : 934 7971177


గంగాధర్ లోని ఈ ప్రణయ భావనలకు ఆయన భార్య శ్రీవిద్య ఒక తోడు, ఒక కారణం. సౌందర్యలహరిలో శంకరాచార్యులు "శివునికి శక్తి తోడయినపుడు చేతనుడవుతాడు." అంటారు. గంగాధర్ లో నిద్రాణమై ఉన్న ప్రణయ భావాలను అక్షరబద్ధం చేయడానికి శ్రీవిద్య తోడైంది. అందుకే.. **'నీ హృదయ పత్రంపై/ నేను చేసిన ప్రేమ సంతకం/ జీవన పర్యంతం శాశ్వతం!'** అని చెప్పాడు. **'ప్రేమనై/ నీ మనసుతో రమించాలని ఉంది/ ఆత్మనై/ నీలో స్నానమాడాలని ఉంది..'** అని 'ఆత్మస్నానం' కవితలో విశ్వ ప్రణయాన్ని రాశాడు. ఈ భావనలను చాలా లోతుగా అర్థం చేసుకోవాలి. మనసుతో రమించాలి, ఆత్మతో ఆనందించాలి. 'ఆత్మస్నానం' అనడంలో ఆనంద సరస్సులో మునిగి తేలాలని ఉంది అనే భావన స్ఫురిస్తుంది. భారతంలో గోపికల ప్రేమ మనోరమణమే కానీ భౌతికం కాదు. అది మనోహరమైనది. ఎందుకంటే భౌతికమైన ప్రేమ శాశ్వతం కాదు. అందుచేత ఆత్మానందస్ఫోరకమైన, ఆత్మానంద ధ్వని పూరితమైన కవిత్వాన్ని రాయడం వల్ల "ఆనందవర్ధనం" అద్భుతమైన కవితా సంపుటిగా తెలుగు సాహిత్య చరిత్రలో నిలిచిపోతుంది.


**'నాలోని తాత్వికుడికి/ నన్ను నేను అప్పగించుకోవడం తప్ప/ నాకిక వేరే తత్వమేది లేదు!'** అని "లోపలి మనిషి" కవితలో ఈ కవి స్పష్టం చేసినప్పటికీ, "ఆనందవర్ధనం"లోని అన్ని కవితల్లోనూ అంతర్లీనంగా ఒకానొక తాత్వికత దాగి ఉంది. అది పాఠకుని అంతర్నేత్రానికి గోచరిస్తుంది. **'ఆజన్మాంతమూ/ అద్వైతాన్ని అనుసరించినా/ అంతరంగానికి/ అంతర్యామి దర్శనం కాలేదు/ దివ్యత్వం కొరకు దిగంతాల దాకా అన్వేషించినా/ ఆత్మకు పరమాత్మ/ ఆచూకి చిక్కలేదు..'** అని "అన్వేషణ" కవితలో వ్యక్తీకరించినా, **'తనను తాను తెలుసుకోనీ/ చితి కదా మృతికి రూపం!/ తనను తాను తెలుసుకున్న/ ముక్తి కదా ఆత్మకు స్వరూపం!!'** అని "మృతి" కవితలో తత్వ ప్రతిపాదన చేసినా అది వియోగ విషాదానంతర వైరాగ్యానికి పతాక స్థాయిగా కనిపిస్తుంది. గంగాధర్ ది ప్రణయం నుంచి ప్రణవం దాకా సాగిన భావ కవిత్వం. "భాగవతము" కవిత ద్వారా ఈ విషయం ప్రస్ఫుటమవుతుంది.

పాతిక సంవత్సరాల నుంచి వస్తున్న అనేక వాదాల ఒరవడి నుండి విడివడి ఒక కొత్తదైన భావుకతతో "ఆనందవర్ధనం" కవితా సంపుటి వచ్చింది. గోదావరి మలుపు లాగా స్తంభంకాడి గంగాధర్ కూడా కవిత్వాన్ని మలుపు తిప్పుతున్నాడు. ఈనాటి నవకవులు, యువకవులు కూడా సహజమైన భావవ్యక్తీకరణకు ప్రాధాన్యం ఇస్తే మంచి కవిత్వం వస్తుంది. ఎందుకంటే అది మనసు నుంచి వస్తుంది కనుక. హృదయ దశ నుండి ఆత్మదశ దాకా సాగిన ప్రణయ భావాల అంతస్సూత్రంతో అలంకరించబడిన "ఆనందవర్ధనం" అందరికీ ఆనందాన్ని పంచుతుంది.

## స్వకృతి





**సంస్కృత - తెలుగు వ్యుత్పత్తి పదకోశః**
ఆచార్య ముదిగంటి గోపాలరెడ్డి
వెల : 1500/- పుటలు : 1000 (ఎ4 సైజు)
ప్రచురణ: సంచాలకులు, సంస్కృత అకాడమీ, హైదరాబాద్.
**ప్రతులకు :** డైరక్టర్, సంస్కృత అకాడమీ, ఆదర్శ శోధ సంస్థ, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్ - 500 007.
ఫోన్ : 833102 1001




**నమః కవి పంచాననాయ**
డా. కపిలవాయి లింగమూర్తి
వెల : 150 /-
**ప్రతులకు :** కపిలవాయి అశోక్‌బాబు, ఫ్లాట్ నెం. 404, సి బ్లాక్, వైదేహి నివాస్ గోల్డెన్ పామ్, అచ్యుతరెడ్డి మార్గ్, విద్యానగర్, హైదరాబాద్ - 500 044.
ఫోన్ : 87907 27772




**గురు బ్రహ్మ**
- డా. కె. బాలస్వామి, వెల : 20 /-
**ప్రతులకు :** కపిలవాయి అశోక్‌బాబు, ఇం.నెం. 17-110, వాణీ సదనము, విద్యానగర్ కాలనీ, నాగర్ కర్నూల్ - 509 209.
ఫోన్ : 8790727772




**బృహన్నల** (ఆధునిక సామాజిక పద్య నాటకం)
కటకం వేంకట రామశర్మ
వెల : 100/-
**ప్రతులకు :** కమలాశంకర నిలయము, 390, హెచ్ ఎం టి స్వర్ణపురి కాలనీ, హైదరాబాద్ - 500 049.
ఫోన్ : 94404 72321




**శ్రీపదార్చన (పద్యార్చన)**
- ఆరవల్లి శ్రీదేవి
వెల : అమూల్యం
**ప్రతులకు :** రచయిత్రి, 1-19-118, ఎస్ 1, రెండవ ఫ్లోర్, నవకార్ అపార్ట్‌మెంట్స్, కొత్త బస్తి, వెంకటాపురం, సికింద్రాబాద్ - 500015
ఫోన్ : 99594 99975


## మూసీ పబ్లికేషన్స్ వారి పుస్తకములు

**వివరాలకు : మూసీ మాసపత్రిక, 3-4-245/1, లింగంపల్లి, కాచిగూడ, హైదరాబాద్ -27, ఫోన్ - 27560616**

| | |
|---|---|
| 1. భారతదేశ చరిత్ర - సంస్కృతి (17భాగాలు 4,5 మరియు 7 నుండి 21 వరకు) రూ. 175/- ఒక్కొక్క భాగానికి | రూ. 2875 - 00 |
| 2. బ్రాహ్మణ రాజ్య సర్వస్వము | రూ. 1200 - 00 |
| 3. నల్లగొండ జిల్లా కవులు - పండితులు | రూ. 350 - 00 |
| 4. మల్యాల వంశ చరిత్ర - శాసనములు | రూ. 100 - 00 |
| 5. శాసన సంపుటి | రూ. 150 - 00 |
| 6. కందూరు చోడుల శాసనములు - చరిత్ర - సంస్కృతి | రూ. 100 - 00 |
| 7. షష్ఠ్యబ్దీస్ శతజయంతి సంచిక | రూ. 100 - 00 |
| 8. విజయనగర శాసనములు - సాహిత్య సాంస్కృతిక విశేషములు | 90 - 00 |
| 9. త్రిపురాంతక దేవాలయ శాసనములు | రూ. 75 - 00 |
| 10. పులిజాల రంగారావు సంక్షిప్త జీవిత చరిత్ర | రూ. 75 - 00 |
| 11. దేవాలయ వాస్తుశిల్పము | రూ. 50 - 00 |
| 12. మూసీ ద్వైవార్షిక ప్రత్యేక సంచిక | రూ. 50 - 00 |
| 13. మూసీ 'తెలుగు సంస్కృతి' ప్రత్యేక సంచిక | రూ. 75 - 00 |
| 14. 'సుచరిత' (బి.ఎన్.శాస్త్రి సంస్మరణ) ప్రత్యేక సంచిక | రూ. 100 -00 |
| 15. మూసీ 'మన తెలుగు' ప్రత్యేక సంచిక | రూ. 100 - 00 |
| 16. ఆంధ్రదేశ శాసన సాహిత్యంలో స్త్రీలు | రూ. 175 - 00 |



## చిరునామా

**మూసీ రచయితలకు, చందాదారులకు విజ్ఞప్తి.**

చందాలు, రచనలు పంపాల్సిన చిరునామా
సంపాదకుడు, మూసీ మాసపత్రిక,
ఇం.నెం. 2-2-1109/
బికె-ఎల్.ఐ.జి.10, బతుకమ్మకుంట,
బాగ్అంబర్‌పేట, హైదరాబాద్-500013.
చందాలకు ఆన్‌లైన్ అకౌంట్
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నల్లకుంట,
హైదరాబాద్.
అకౌంట్ నెం. 52019740642
IFS Code : SBIN0020083
editormusi@gmail.com

# కోచింగ్ పిల్లలు

కోచింగ్ యువ కిశోరాలు
పరుగులు తీస్తున్నారు
బస్సుల్లో, సైకిళ్ల మీద
కొండొకచో బైక్‌ల మీద
చిక్కడపల్లి, అఫ్జల్‌గంజ్
అశోక్‌నగర్, అమీర్‌పేటల రోడ్లన్నీ
వారి భవిష్యదాకాంక్షలతో
ప్రకాశమానంగా వున్నాయి

ఏ వీధిలోకి వెళ్ళినా
గాలి
చదువుల సువాసనల్ని వెదజల్లుతున్నది
పార్కుల్లో బెంచీల పక్కన చెట్లు
విద్యా పుష్పాలను పూస్తున్నాయి
లైబ్రరీల్లో గోడలు
ఊపిరి బిగపట్టి నిశ్శబ్దాన్ని పాటిస్తున్నాయి

పల్లె నుంచి అమాయకంగా
ఎగురొచ్చిన పావురాలు కొన్ని
చిన్న చిన్న గదుల్లో కాపురముంటూ
అర్ధాకలితో తపస్సు చేసే
పసివాళ్లు కొందరు
అప్పులు చేస్తున్నారో
తిప్పలు పడుతున్నారో
అదృష్టదేవతను
రెక్క పట్టుకొని లాక్కొచ్చుకోవాలని
పెనుగులాడుతున్నారో!

జ్ఞానాన్ని
పోటీ బూట్లలో బిగించి
నడవాలనే యాతన
జ్ఞాపకశక్తికి
పదును పెట్టుకుంటున్న ధారణ



నుదుటిపైన చెమట చుక్కలను
ముత్యాలుగా మార్చుకోవాలనే తపన
నిరుద్యోగ సాగరంలోని కెరటాలకు
ఇచ్ఛా సాఫల్యం అనిశ్చితం
ఏవి ఒడ్డున పడతాయో
వాటికే తెలియని సతమతం

ఈ బిడ్డల దగ్గర
కాస్సేపు ఆగి
ఆత్మస్థైర్యాన్ని
నూరి పొయ్యాలని వుంటుంది నాకు
పాలకుల కిదేమీ పట్టదు
మొద్దుబారిన
నిద్రలోకి హఠాత్ మెలకువది
కేవలం యాంత్రిక దృష్టి
సంక్లిష్ట పరిస్థితిని
సరిదిద్దలేని అవ్యవస్థ
అమృతప్రాయమైన వారి ఉత్సాహాలను
విషపూరితం చేస్తున్న అవస్థ
బిడ్డలారా!
చిన్నబుచ్చుకోవద్దు

నిరాశను మీ నిఘంటువుల్లోకి
రానివ్వద్దు
ఈ అనుభవాలు
మీ జీవన ప్రస్థానానికి
పాథేయమౌతాయి
ఏదీ వృథా కాదు
గోఎ హెడ్
ఆల్ ది బెస్ట్!

డా. ఎన్. గోపి
ఫోన్. నెం. 9391028496

# ఫర్టీ 9 సంతాన సాఫల్యత కేంద్రం

**మీ మాతృత్వపు స్పర్శకు దూరం అయ్యారా?**

అందమైన చిన్ని చిన్ని అడుగులు..
బోసి బోసి నవ్వుల కేరింతలు...
ఒక పూజ్యమైన అలక, అలుపెరగని ఉల్లాసం..
మారం చేస్తూ, మైమరిపిస్తూ...
మీ ఆనందం అంభరాన్ని తాకాలా ?

**మీరు తీసుకునే
ప్రతి నిర్ణయానికి
మా ప్రేమ, సేవ
అంకిత భావం మీకు
తోడుగా ఉంటుంది.**

సరోగసి, అసిస్టెడ్ హ్యాచింగ్,
ఎంబ్రియో &సెమెన్ ఫ్రీజింగ్,
స్త్రీలలో గర్భాశయ అండాశయ
లోపాల నివారణ-చికిత్స,
వెరికోసిల్, వీర్యకణాల లోపం,
ల్యాప్రోస్కోపిక్ విధానం ద్వారా
లోపాల నిర్ధారణ -సవరణ,
ఆధునిక వైద్యవిధానాలతో చికిత్స.

**7416 106 106**
www.ferty9.com

**IUI** **IVF** **ICSI** **IMSI** **HSG**



## ఫర్టీ 9 హాస్పిటల్ మరియు పరిశోధన కేంద్రం

మీ ఆశ, మీ స్వప్నం ఫలిస్తుంది ఫలప్రదంగా...

విజయ డయాగ్నస్టిక్స్ ఎదురుగా, సికింద్రాబాద్ మరియు నిజాంపేట్ క్రాస్ రోడ్, కూకట్‌పల్లి, హైదరాబాద్

Scanned with OKEN Scanner